మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 173 | శనివారం | 13-12-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




## యాదవులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు

- సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తించడంపై సిఎం రేవంత్‌రెడ్డికి యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ అభినందనలు
- జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ
- తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించిన రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురి మధ్య తాజా రాజకీయ పరిస్థితుల పైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అఖిలేష్‌కు వివరించారు. యాదవ్‌లకు ఎంతో ఇష్టమైన సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తిస్తూ సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని తరువాయి 2లో



## బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ

- రెండు దశల్లో జనగణనకు రూ.11,718 కోట్లు
- 71 పాత చట్టాలు బుట్టదాఖలు
- కొబ్బరి ఎంఎస్‌పి పెంపు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

**ఎఫ్‌డిఐతో ఆర్థిక వ్యవస్థకు ముప్పుందని వామపక్షాలు హెచ్చరించినా మొండివైఖరి వీడని మోదీ సర్కార్**

**న్యూఢిల్లీ:** విదేశీ పెట్టుబడిదారులకు ద్వారాలు తెరిచే విషయంలోగానీ, పథకాలకు కొత్త పేర్లు పెట్టి తమదే ఘనతగా చెప్పుకోవడంలోగానీ మోదీ ప్రభుత్వం తీరు మారలేదు. బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) పెంపునకు అనుమతి ఇస్తూ కేంద్ర కేబినెట్ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. అదే విధంగా జనగణన 2027 కోసం రూ.11,718 కోట్లును ఆమోదించింది. 71 పాత చట్టాల బుట్టదాఖలకు అంగీకారం తెలిపింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పేరును పూజ్య బాబు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చేందుకూ నిర్ణయం తీసుకుంది. అలాగే కొబ్బరి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను 2026 సీజన్‌కు గాను రూ.445 నుంచి రూ.12,027కు పెంచుతూ ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పని హెచ్చరించినప్పటికీ బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐకి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఎల్‌ఐసి వంటి సంస్థల్లో ప్రభుత్వ వాటాలు తగ్గించి, ప్రైవేటువిదేశీ పెట్టుబడిదారులకు అవకాశమిస్తే ప్రజల జీవితకాల పొదుపు సంక్షోభంలో పడుతుందని వాపమక్షాలు తరువాయి 2లో



## ఉపాధి హామీలో గాంధీపేరు తొలగింపు

**పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్పు**

- 100 నుంచి 125 రోజులకు పనిదినాల పెంపు
- కేంద్ర మంత్రిమండలి ఆమోదం

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన (పిబిజిఆర్‌వై)గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పని దినాలను 100 నుంచి 125కు పెంచేందుకు ఆమోదం తెలిపింది. దినసరి కనీస వేతనాన్ని రూ.240కు సవరించింది. ఈ పథకానికి మొదట్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఇజిఎ)గా పేరు పెట్టారు. ఆ తర్వాత మహాత్మా గాంధీ పేరును జోడించి సవరించారు. ఇప్పుడు మరోమారు ఈ పథకం పేరు మారింది.

## తొలి పల్లె పోరులో సత్తా చాటాం

- 90 శాతం కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు
- రెండో, మూడో విడతల్లోనూ పట్టంకట్టండి
- ఓటర్లకు టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి
- కవితకు సిఎం కావాలనే కోరిక అత్యాశేనని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

మొదటి విడత సర్పంచ్ ఎన్నికలలో 4230 పంచాయతీలకు గాను కాంగ్రెస్ మద్దతుదారులు 2,600 పైచిలుకు స్థానాల్లో గెలిచారని, ఏకగ్రీవం అయిన చోట్ల 90 శాతం కాంగ్రెస్ మద్దతు దారులు గెలిచారని, చాలా చోట్ల బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి పోటీ చేశాయని, వెయ్యికి దగ్గరగా బిఆర్ ఎస్, 200 లోపు బిజెపి, 40 స్థానాలు సిపిఐ(ఎం), 30 స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు గెలిచారని ఆయన తరువాయి 2లో



## హిల్ట్ పాలసీకి బిఆర్‌ఎస్‌లోనే బీజం

- లీజుల భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు గత ప్రభుత్వమే సంతకాలు చేసింది
- కాంగ్రెస్ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది
- నేను ముఖ్యమంత్రినైతే అన్యాయాలపై ఆరాతీస్తా
- ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

హిల్ట్ పాలసీకి బిఆర్‌ఎస్ కిటికీలు తెరిచి బీజం వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దర్వాజలు తెరిచిందని, లీజుల భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సంతకాలు చేశారని, బిఆర్‌ఎస్ వేసిన దొంగదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం రహదారులుగా మారుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తప్పుడు తరువాయి 2లో



జర్మనీతో సుదీర్ఘకాలంగా స్నేహబంధం 03

## గజ గజ

- రాష్ట్రాన్ని వణికిస్తున్న చలి
- ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులు
- ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- రికార్డుస్థాయిలో కనిష్టానికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత ప్రజలను గజగజ వణికిస్తోంది. ఉత్తరాది నుంచి శీతల గాలులు వీస్తున్నాయి. దీంతో తెలంగాణలో చలి తీవ్రత పెరిగిందని హైదరబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు తెలిపారు. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. శుక్ర, శనివారాల్లో తరువాయి 2లో



## ప్రభాకర్‌రావు లొంగుబాటు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిని విచారిస్తున్న సిట్ దర్యాప్తు అధికారులు**



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపిన ఫోన్ టాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ఎస్‌ఐబి మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో సిట్ దర్యాప్తు అధికారుల ముందు లొంగిపోయారు. ఏడు రోజుల పాటు ప్రభాకర్‌రావును సిట్ అధికారులు విచారించనున్నారు. లొంగిపోయిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు ప్రభాకర్‌రావును అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా ఆయన్ని విచారిస్తున్నారు. ఫోన్ టాపింగ్ ఆపరేషన్ ఎవరి ఆదేశాలతో సాగింది? లక్ష్యంగా ఎంచుకున్న ఫోన్ నంబర్ల జాబితా ఎలా తయారైంది? ఈ ఆపరేషన్‌లో రాజకీయ ఒత్తిడి లేదా ఆదేశాలు ఉన్నాయా? వంటి కీలక అంశాలపై విచారణ ముమ్మరంగా తరువాయి 2లో

## మాజీ కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

- సేఫ్ నిధులతో సింగరేణి ప్రాంతాల అభివృద్ధి
- పేద, కార్మిక కుటుంబాల సొంతింటి కల నెరవేరుస్తాం
- పంచాయతీ ఎన్నికల ప్రచారంలో కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



సింగరేణి కార్మిక వాడలు, ప్రభావిత ప్రాంతాల్లో నివశిస్తున్న మాజీ కార్మికులకు అండగా ఉంటామని, సంస్థ క్వార్టర్లలో సింగరేణి స్థలాల్లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నమాజీ కార్మిక కుటుంబాలకు, కాంట్రాక్టు కార్మికులకు, సంస్థ పై పరోక్షంగా ఆధారపడ్డ కుటుంబాల ఇండ్ల, ఇండ్ల స్థలాలకు హక్కు కల్పించేందుకు కృషి చేస్తామని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కార్మిక ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాలైన గౌతంపూర్, రుద్రంపూర్, ఫోర్ ఇంక్లైన్, ప్రశాంతినగర్, రామాంజనేయ కాలనీ, బాబుక్యాంపు, ఎన్‌కే నగర్, నందా తండా, చంచుపల్లి తరువాయి 12లో

## శివరాజ్ పాటిల్ కన్నుమూత



- కాంగ్రెస్ సీనియర్ నేతకు నేడు అంత్యక్రియలు
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సంతాపం

**లాతూర్ :** లోక్‌సభ మాజీ స్పీకర్, కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివరాజ్ పాటిల్ శుక్రవారం ఉదయం తన స్వస్థలం మహారాష్ట్రలోని లాతూర్‌లో మరణించారు. 90 ఏళ్ల పాటిల్ స్వల్ప అనారోగ్యంతో తన నివాసం 'దేవ్‌ఘర్'లో మరణించారని, శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కుమారుడు శైలేష్ పాటిల్, కోడలు అర్చన, గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై లాతూర్ నగరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అమిత్ దేశ్‌ముఖ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. శివరాజ్ పాటిల్ ఇద్దరు మనవరాలు ఆయనతో కలిసి జీవించారు. పాటిల్ తన చివరి రోజుల వరకు కాంగ్రెస్, నెహ్రూగాంధీ కుటుంబానికి విధేయుడిగా తరువాయి 2లో

## మరో 10 మంది జనజీవనంలోకి

- ఛత్తీస్‌గఢ్‌లో ఆయుధాలు వీడిన నక్సల్స్
- మావోయిస్టుల కంపెనీ ప్లాటూన్ కమాండర్ మిదియం భీమా తలపై రూ.8 లక్షల రివార్డు



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లో మరో దఫా మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లాలో శుక్రవారం ఆరుగురు మహిళలు సహా పది మంది నక్సలైట్లు లొంగిపోయారని పోలీసులు తెలిపారు. దీంతో ఈ ఏడాది జిల్లాలో మొత్తం 263 మంది మావోయిస్టులు హింస వీడినట్లు పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. పోలీసుల బూపూనా మార్గెమ్ (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు) చొరవ కింద సీనియర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) జిల్లా అధికారుల సమక్షంలో ఈ కార్యకర్తలు తరువాయి 2లో

## ఊపిరి అందడం లేదు



- ప్రమాదకరంగా వాయు కాలుష్యం : సమస్యపై చర్చిద్దాం
- ప్రధాని మోదీకి రాహుల్ సూచన
- వ్యవస్థాత్మక ప్రణాళిక అవసరమని వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రధాన నగరాల్లో రోజు రోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం అంశాన్ని శుక్రవారం ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో లేవనెత్తారు. ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేశారు. జీరో అవర్ సందర్భంగా వాయు కాలుష్యం అంశాన్ని లేవనెత్తిన రాహుల్‌గాంధీ, ప్రతిపక్షం, ప్రభుత్వం ఒకరినొకరు దూషించుకోకుండా, సమస్యకు పరిష్కారం కనుగొనే విధంగా ఈ అంశంపై చర్చను ఆసక్తికరమైన రీతిలో రూపొందించవచ్చని సూచించారు. 'ఇది సైద్ధాంతిక సమస్య కాదు. వాయు కాలుష్యం ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి తాము సహకరించాలనుకుంటున్నామని, ఈ సభలోని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు' అని అన్నారు. వాయు కాలుష్య సమస్యను పరిష్కరించడానికి ప్రధానమంత్రి ఒక ప్రణాళికను రూపొందించవచ్చని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'మన ప్రధాన నగరాల్లో ఎక్కువ భాగం విషపూరితమైన గాలి దుప్పటి కింద జీవిస్తున్నాయి. లక్షలాది మంది పిల్లలు ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారు. వారి భవిష్యత్తు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్‌లో భూకంపం.. సునామీ హెచ్చరిక జారీ

**టోక్యో:** జపాన్ ఈశాన్య ప్రాంతంలో 6.7 తీవ్రతతో వచ్చిన భూకంపం తర్వాత, జపాన్ వాతావరణ సంస్థ (జెఎంఎ) శుక్రవారం సునామీ హెచ్చరిక జారీ చేసింది. ఆఒమోరి తీరానికి సమీపంలోని సముద్ర ప్రాంతంలో, సుమారు 20 కిలోమీటర్ల లోతున చోటు చేసుకుందని ప్రకటించింది. జెఎంఎ ప్రకారం, హొక్కైడో, ఆఒమోరి, ఇవాటే, మియాగి తీర ప్రాంతాల్లో సుమారు ఒక మీటర్ (3.2 అడుగులు) వరకు భారీ అలలు వచ్చే అవకాశం ఉంది. కాగా, భూకంప బాధితులు లేదా క్షతగాత్రుల వివరాలు ఇంకా తెలియరాలేదు. దీనిని ఈ వారం సంభవించిన రెండో పెద్ద భూకంపంగా పేర్కొంటున్నారు. సోమవారం ఆఒమోరి తీరంలో 7.5 తీవ్రతతో భూమి కంపించింది. ఆ ఘటనలో 34 మంది గాయపడ్డారు. ఇవాటేలోని కుజి పోర్ట్‌లో 0.6 మీటర్ల ఎత్తులో సునామీ నమోదైంది. తాజా భూకంపం నమోదైన ప్రాంతంలోనే 2011లో భారీ భూకంపం సంభవించింది. రెక్టార్ స్కేల్‌పై దాని తీవ్రత 9.0 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. దాదాపు 20,000 మంది మృతి చెందారు. ప్రసిద్ధి చెందిన ఫుకుషిమా అణు విద్యుత్ కేంద్రం నాశనమైంది.



## ప్రభుత్వ రాజీనామాకు బల్గేరియా పార్లమెంట్ ఆమోదం

**సోఫియా (బల్గేరియా):** బల్గేరియా ప్రధాని రోజెన్ జెల్యాజ్‌కోవ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దేశవ్యాప్తంగా జరుగుతున్న అవినీతి వ్యతిరేక నిరసనల నేపథ్యంలో రాజీనామా చేయగా, పార్లమెంట్ శుక్రవారం దాన్ని ఆమోదించింది. బల్గేరియా వచ్చే నెల యూరోజోన్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అధిక పన్నులు, సోషల్ సెక్యూరిటీ బాధ్యతలు పెంచే బడ్జెట్ ప్రతిపాదన వంటి అంశాలకు వ్యతిరేకంగా, దేశవ్యాప్తంగా వేలాది మంది, ముఖ్యంగా యువకులు, గత వారం రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ వర్గాల్లో వ్యాప్తి చెందిన అవినీతి, సామాన్య పౌరులకు న్యాయం దొరకడం లేదన్న భావన కూడా ఈ నిరసనలకు ఆజ్యం పోసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం సమర్పించిన రాజీనామాను, 240 సభ్యులు గల పార్లమెంట్ 127–0 ఓట్లతో ఆమోదించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రస్తుత కేబినెట్ విధులు కొనసాగిస్తుంది. ఈ ఏడాది జనవరిలో అధికారంలోకి వచ్చిన జెల్యాజ్‌కోవ్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆరు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని నిలబెట్టుకుంది. కానీ ఈసారి రోడ్లపై భారీగా ప్రజలు చేరడంతో పరిస్థితి మారిపోయింది. ప్రధాని గురువారం రాజీనామా ప్రకటిస్తూ 'ప్రజల ఒత్తిడికి ఇది ప్రత్యక్ష ప్రతిస్పందన.. ప్రజల స్వరం దేవుని స్వరం' అని వ్యాఖ్యానించారు. ఇలావుంటే, అధ్యక్షుడు రుమెన్ రాదేవ్ ముందుగా పార్లమెంట్‌లో ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉన్న పార్టీ లేదా కూటమికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి. అది విఫలమైతే, రెండవ పెద్ద కూటమికి అవకాశం. ఈ రెండూ విఫలమైతే, అధ్యక్షుడే కేర్‌టేకర్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, కొత్త ఎన్నికలకు వెళతారు. 2021 నుండి ఇంత వరకూ ఏడు ఎన్నికలు జరగ్గా, ఎనిమిదోసారి కూడా ఎన్నికలే శరణమవుతాయని పరిశీలకులు అంటున్నారు. 6.4 మిలియన్ జనాభా గల బల్గేరియా జనవరి 1 నుంచి తన లెవ్ కరెన్సీకి బదులుగా యూరోని స్వీకరించనుంది, తద్వారా యూరోజోన్‌లో 21వ సభ్యదేశంగా మారనుంది. బల్గేరియా 2007లో యూరోపియన్ యూనియన్‌లో చేరింది.

# హెచ్1బి వీసాలతో ప్రమాదం

### స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు లభించడంలేదని పోల్‌స్టర్ మిచెల్ సంచలన వ్యాఖ్య



**వాషింగ్టన్:** అమెరికాలో విదేశీయులపై, ప్రత్యేకించి భారతీయులపై వ్యతిరేకత రోజురోజుకూ పెరుగుతున్నది. హెచ్1బి వీసాపై అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి సర్వే నిర్వహించే పోల్‌స్టర్, వ్యాఖ్యాత మార్క్ మిచెల్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఒక హెచ్1బి వీసాదారుడిని దేశం నుంచి పంపితే, అది పది మంది అక్రమ చొరబాటుదారులను పంపించినంత ప్రభావం ఉంటుందని అతను వ్యాఖ్యానించారు. దేశంలో భారతీయుల ప్రభావం తగ్గించడానికి 'డీఇండియనైజ్' అత్యవసరమని అన్నారు. సిలికాన్ వ్యాలీలో పని చేస్తున్న వారిలో 66 శాతం మంది విదేశీయులేనని, వారిలో భారతీయులే ఎక్కువగా ఉన్నారని వివరించారు. విదేశాల నుంచి వచ్చిన వారు హెచ్1బి వీసాపై పనులు చేస్తున్న కారణంగా కనీసం 12 కోట్ల మంది అమెరికన్ టెక్ వర్కర్లు నిరుద్యోగులయ్యారని ఆరోపించారు. అమెరికా కంపెనీలు తక్కువ ఖర్చుతో పని చేసే యువ ఇమ్మిగ్రంట్ ఇంజనీర్‌లకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సీనియర్ అమెరికన్ ఇంజనీర్లు నిర్లక్ష్యానికి గురవుతున్నారని మిచెల్ విమర్శించారు. ఆపిల్ వంటి టాప్ కంపెనీల్లో ఉన్న సీనియర్ భారతీయ డెవలపర్లను పంపిస్తే, అమెరికాకు ఆర్థికంగా లాభమని అన్నారు. వాల్‌మార్ట్, సిలికాన్ వ్యాలీ వంటి చోట్ల భారీగా భారతీయులు ఉన్నందున అమెరికన్ ఉద్యోగాలు కోల్పోతున్నాయని ఆరోపించారు. కాగా, మిచెల్ ఈ విధంగా జాతి ఆధారిత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. సోషల్ మీడియాలో ఇది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. జాత్యహంకారానికి నిదర్శనంగా నిలుస్తున్న మిచెల్ వ్యాఖ్యలు ఇండియన్–అమెరికన్లను కూడా టార్గెట్ చేస్తున్నట్లు కనిపిస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## థాయిలాండ్ పార్లమెంట్ రద్దు

### వచ్చే ఏడాది ఆరంభంలో ముందస్తు ఎన్నికలు

**బ్యాంకాక్:** థాయిలాండ్ ప్రధాని అనుతిన్ చాన్‌వీరాకుల్, రాజు మహా వజిరాలొంగ్‌కోర్న్ ఆమోదం అనంతరం శుక్రవారం పార్లమెంట్‌ను రద్దు చేశారు. ఈ నిర్ణయం రాయల్ గెజిట్‌లో ప్రచురణతో అమల్లోకి వచ్చింది. అధికారాన్ని ప్రజలకు తిరిగి ఇస్తున్నానని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నిబంధనలను అనుసరించి రాజు ఆమోదించిన తర్వాత 45 నుంచి 60 రోజుల్లో ఎన్నికలు జరగాలి. ఈ కాలంలో అనుతిన్ పరిమిత అధికారాలతో కేర్‌టేకర్ ప్రభుత్వాన్ని నడిపిస్తారు. అయితే, కొత్త బడ్జెట్‌కు ఆమోదం ఇవ్వలేరు. ఈ నిర్ణయం థాయిలాండ్–కాంబోడియా సరిహద్దుల్లో మళ్లీ భారీ స్థాయి యుద్ధం జరుగుతున్న సమయంలో రావడం గమనార్హం. మాజీ ప్రధాని పాయెతోంగ్‌టార్న్ శినావాత్ర స్థానాన్ని అనుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లోదక్కించుకున్నారు. శినావాత్ర గత సంవత్సరం సరిహద్దు వివాదం నేపథ్యంలో వచ్చిన కుంభోణాల ఆరోపణల కారణంగా పదవి కోల్పోగా, సెప్టెంబర్‌లో విపక్షం 'పీపుల్స్ పార్టీ' మద్దతుతోనే అనుతిన్ ప్రధాని అయ్యారు. ప్రతిఫలంగా నాలుగు నెలల్లో పార్లమెంట్ రద్దు చేసి, కొత్త రాజ్యాంగానికి ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని అంగీకరించారు. రాజ్యాంగ సవరణ విషయంలో విభేదాలు పెరగడంతో, పీపుల్స్ పార్టీ గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనివల్లే పార్లమెంట్ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. పీపుల్స్ పార్టీ హౌస్‌లో అతిపెద్ద పార్టీగా ఉంది. భవిష్యత్తు ఎన్నికల్లో భూం జైథాయ్ పార్టీకి ప్రధాన ప్రత్యర్థిగా పీపల్స్ పార్టీని పేర్కొంటున్నారు. పాయెతోంగ్‌టార్న్ ప్రభుత్వం పతనమవుతున్న సమయంలో అనుతిన్ తన పదవులను రాజీనామా చేసి, ఆమె కూటమి నుండి బయటకు వెళ్లిన విషయాన్ని ఈ సందర్భం గా ప్రస్తావించాలి. పాయెతోంగ్‌టార్న్ కాంబోడియా సెనేట్ అధ్యక్షుడు హున్ సేన్‌తో ఫోన్ కాల్ వివాదం కారణంగా నైతిక ఉల్లంఘనలకు దోషిగా తేలారు.

ఇలావుంటే, కాంబోడియాతో మళ్లీ యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో అనుతిన్ జాతీయతను ఉద్దేశించిన కఠిన వైఖరి అవలంబించారు. జులైలో జరిగిన రోజుల యుద్ధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, వాణిజ్య రాయితీలను నిలిపివేస్తానని హెచ్చరించి, యుద్ధ విరమణకు ఒప్పించారు. అయితే, ఈ వారం మళ్లీ ఘర్షణలు పెరగడంతో, ట్రంప్ మరోసారి శాంతి నెలకొల్పుతానని ట్రంప్ ప్రకటించారు. థాయ్ ఎగుమతులపై భారీ సుంకాలు విధించే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. కాగా, ఈ వారం జరిగిన యుద్ధంలో 24 మంది మరణించగా, లక్షలాది మంది ఇరువైపులా తలదాచుకున్నారు. థాయ్ సైన్యం ప్రకారం 165 మంది కాంబోడియా సైనికులు చనిపోయినట్లు అంచనా, అయితే కాంబోడియా అధికారిక సంఖ్య వెల్లడించలేదు.

## ట్రంప్‌పై రెండో అభిశంసనను తిరస్కరించిన ప్రతినిధుల సభ

**వాషింగ్టన్:** టెక్సాస్‌కు చెందిన డెమోక్రటిక్ ప్రతినిధి అల్‌గ్రీన్ తీసుకొచ్చిన అభిశంసన (ఇంపీచ్‌మెంట్) తీర్మానాన్ని అమెరికా ప్రతినిధుల సభ గురువారం తిరస్కరించింది. ఇది అల్‌గ్రీన్ ఈ ఏడాది చేపట్టిన రెండో విఫల ప్రయత్నం. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా 237, అనుకూలంగా 140 ఓట్లు వచ్చాయి. 47 మంది డెమోక్రాట్లు 'ప్రెజెంట్ ఓట్' (తటస్థ ఓటు) వేశారు. ఈ ఏడాది జూన్‌లో ఇదే తీర్మానాన్ని విస్తృత మెజారిటీతో తిరస్కరించినప్పటికీ, ఈసారి డెమోక్రాట్లలో మద్దతు పెరిగినట్లు కనిపిస్తోంది. డెమోక్రటిక్ హౌస్ నాయకుడు హకీమ్ జెఫ్రీస్ తదితరులు ఓటు ముందు వెల్లడించిన ప్రకారం, రిపబ్లికన్ మెజారిటీ ఎలాంటి దర్యాప్తు జరపలేదు. అందుకే పూర్తిగా వ్యతిరేకించకుండా ప్రెజెంట్ అని ఓటు వేస్తున్నారు. 'ఇంపీచ్‌మెంట్ అంటే రాజ్యాంగం ఇచ్చిన పవిత్ర బాధ్యత. అధికార దుర్వినియోగం, చట్ట ఉల్లంఘనలు, ప్రజా నమ్మక ద్రోహం వంటి తీవ్రమైన కారణాలు ఉండాలి' అని చెప్పారు. కాగా, ట్రంప్ తన రెండో పదవీ కాలంలో 'అత్యున్నత నేరాలు, దుశ్చర్యలు'కు పాల్పడ్డారని అల్‌గ్రీన్ ఆరోపణ. ట్రంప్ కాంగ్రెస్‌ను పక్కనబెట్టి ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపిస్తున్నారు. డెమోక్రటిక్ శాసనసభ్యులకు 'మరణదండన' తప్పదన్న బెదిరింపులకు కూడా ట్రంప్ పాల్పడుతున్నట్టు తెలిపారు. అయితే, రిపబ్లికన్లు ఈ ఆరోపణను ఖండిస్తున్నారు.



అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. వేలాది ఇళ్లు మునిగిపోయాయి. కనీసం 78,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా అధికారులు ఆదేశించారు. శుక్రవారం కూడా వరదలు ముంచెత్తే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## లొంగుబాటు (మొదటి పేజీ తరువాయి)

సాగుతోంది. విచారనలో పలువురు కీలక అధికారులు, రాజకీయ నేతల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అరెస్టై బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితులు గతంలో వెల్లడించిన అంశాలపై కూడా ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తున్నారు. పదవీ విరమణ చేసిన తరువాత ఎస్ఐబి చీఫ్‌గా ఎవరు నియమించారు అనే అంశం ఇందులో ప్రదానంగా ఉంది. ఈ విషయంపై సిట్ అధికారులు కూపి లాగుతున్నారు. అధికారులు అభ్యంతరం పెట్టినా అప్పటి సిఎం కెసిఆర్ స్వయంగా జోక్యం చేసుకుని ప్రభాకర్‌రావును ఎస్ఐబి చీఫ్‌గా నియమించినట్లు తెలుస్తుంది. దీనిపై ప్రభాకర్‌రావును సిట్ అధికారుల లోతుగా ప్రశ్నిస్తున్నారు. ప్రభాకర్‌రావు నుంచి కీలక వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇదే కేసులో మరికొందరు ఉన్నతాధికారులు, మునుపటి ప్రభుత్వ కాలంలోని కొందరు కీలక వ్యక్తుల పాత్రపై సిట్ దృష్టి సారించింది. ప్రభాకర్‌రావు 26 హార్డ్ డిస్క్ లు ధ్వంసం చేసినట్లు ఇప్పటికే గుర్తించారు. అందులో 7 కొత్త హార్డ్ డిస్క్ ల రీ ప్లేస్ చేయడం పై ఆయన్ని విచారిస్తున్నారు. రివ్యూ కమిటీ అనుమతి లేకుండానే రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు ఫోన్ ట్యాప్ ఎందుకోసం? ఎవరికోసం? చేశారనే అంశంపై లోతుగా విచారిస్తున్నారు. ప్రభాకర్‌రావు ఎలాంటి విషయాలు బయటపెడుతారోనని గత ప్రభుత్వ పెద్దల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

## గుర్తుంచుకుంటారు (మొదటి పేజీ తరువాయి)

అఖిలేష్ యాదవ్ ప్రశంసించారు. దేశంలోని యాదవ సమాజం రేవంత్ రెడ్డిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని, యాదవుల హృదయంలో రేవంత్ రెడ్డి ఉండిపోతారని అఖిలేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణలోని యాదవ వర్గానికి రాజకీయంగా మంచి గుర్తింపు ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎంఎల్ఎ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నేత రోహిన్ రెడ్డి తదితరులు సిఎం వెంట ఉన్నారు.

**విజన్ డాక్యుమెంట్‌తో గణనీయమైన ప్రగతి : సుబ్రమణియన్**

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించి, అనుసరించడం ద్వారా రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజన్ డాక్యుమెంట్‌లోని విషయాలను ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు.

## గజ గజ (మొదటి పేజీ తరువాయి)

శీతల, అతిశీతల గాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. దీంతో ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. ఆదివారం నుంచి పొగ మంచు పెరిగే అవకాశం ఉందన్నారు. శీతల గాలులతో పాటు పొగ మంచు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. చలిగాలులు, పొగ మంచు ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు..**

జిల్లాల్లో చలి ప్రభావం తీవ్రమైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 5.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ చలి వణికిస్తోంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉంది. దీంతో ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. శనివారం ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే సూచనలున్నాయి. ఈ జిల్లాలకు సైతం ఎల్లో అలర్ట్ జారీ చేశారు. డిసెంబర్ 14వ తేదీన రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో చూస్తే రాత్రి వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

**26 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు..**

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే నమోదవుతున్నాయి. వీటిలో 13 జిల్లాల్లో 8 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడం చలి తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. ఈశాన్య భారత దేశం నుంచి తెలంగాణ వైపు వచ్చే చల్లని గాలుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు. సాధారణం కన్నా గరిష్ఠంగా 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. జనగామ మినహా అన్ని జిల్లాల్లో 10డిగ్రీల లోపు రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందన్నారు.

## సత్తా చాటాం (మొదటి పేజీ తరువాయి)

వివరించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మొదటి విడత మాదిరిగానే రెండో విడత, మూడో విడత ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ మద్దతు దారులకు పట్టం కట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత 15 మాసాల్లో 80 వేలకు పై ఉద్యోగాలు ఇచ్చామని, ఉచిత బస్సు మొదలుకుని సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనం పంచాయతీలో అత్యధిక స్థానాలు గెలుపు అన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనను మెచ్చి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని సంక్షేమాన్ని తెలంగాణలో అందిస్తున్నామని

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి 25 వేలకు పైగా మెజార్టీ ప్రజలు ఇచ్చారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంమెచ్చి ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పనిచేసిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, స్థానిక నాయకులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

**తెలంగాణ వికాసం వైపు పయనిస్తోంది..**

గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా 5 లక్షల 75 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తద్వారా తెలంగాణ ప్రభుత్వం పట్ల పెట్టుబడిదారులకు నమ్మకం, విశ్వాసం పెరిగిందన్నారు. పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో వచ్చిన పెట్టుబడులు ఎన్ని? వచ్చాయని ప్రశ్నించారు. ఓట్ చోరీపై 14 లక్షల వరకు సంతక సేకరణ జరిగిందన్నారు. ఈ నెల 14 వ తేదీన రామ్ లీలా మైదాన్ లో జరిగే మహాధర్నాలో సిఎం రేవంత్,కేబినెట్ మొత్తం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పిఎసి సభ్యులకు, పాల్గొంటారని తెలిపారు. మహాధర్నాలో పెద్ద ఎత్తున నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓట్ చోరీ తోనే తెలంగాణ బిజెపి ఎంపిలు గెలిచారని ఆయన స్పష్టం చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిదిమంది ఎంపిలు ఉన్న బిజెపి గెలిచింది ఎంత? బిజెపి ఎమ్మెల్యేలకు, ఎంపిలకు వేసిన ఓట్లు ఎక్కడ పోయాయి? అని ప్రశ్నించారు.

**కవితకు అత్యాశ...**

'నేను కూడా సిఎం అవుతా..ఒక్కొక్కరి తోలు తీస్తా'' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొనడంపై టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ స్పందించారు. కవితకి సిఎం కావాలనే ఆశ ఉంటే తప్పు లేదు.. మనిషికి అత్యాశ ఉండకూడదు అని చురకలంటించారు. బిఆర్ఎస్ నేతల అక్రమాలను కవిత వాస్తవాలను బయట పెట్టారు, కవిత ఆరోపణలపై విచారణ చేయించాలని సిఎం దృష్టికి తీసుకెళ్తా అని తెలిపారు.

## బిఆర్‌ఎస్‌లోనే బీజం (మొదటి పేజీ తరువాయి)

ప్రచారం చేసినందుకు, తమ పరపతిని దెబ్బతిసినందుకు తనకు,తన భర్తకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, బిజెపి, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాదవరం కృష్ణారావు, టి న్యూస్ చానల్‌ను డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి లీగల్ నోటీసు అందజేస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి అయితే మాత్రం 2014 నుంచి ఇప్పటి వరకు అన్ని అన్యాలపైన ఆరా తీస్తానని స్పష్టం చేశారు. తన భర్త అనిల్ కుమార్, వ్యాపార వేత్త ఎ.వి రెడ్డితో కలిసి ఫోటోను చూపిస్తూ భూలావాదేవీలు జరిగాయని గుంటనక్కలు వెకిలి ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. తాము పార్లమెంట్‌లో పోరాటం చేస్తుంటే, ఎసి గదుల్లో కూర్చొని, కెసిఆర్ నీడలో చేరి పందికొక్కుల్లాలగా ప్రజల సొమ్ము తిన్నారని ఆరోపించారు. లీజుకు ఇచ్చిన భూములు కెటిఆర్ విక్రయించలేదా? అని అన్నారు. తాను ఇంకా మొత్తం చిట్టా విప్పలేదని, కేవలం ఇది టాస్క్ మాత్రమేనని, దీనికే ఇలా భయపడితే ఎలా అని ఎద్దేవా చేశారు. ముందు, ముందు టెస్ట్ మ్యాచ్‌లు కూడా ఉంటాయన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తన భర్త వచ్చి ఏమైనా పనులు అడిగారా అని నిలదీశారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులతో తాము ఏమైనా అవుటాఫ్‌గా అనుకూలమైన పనులు చేసుకున్నామా? అని మండిపడ్డారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాను ఒక్కరూపాయి కూడా లాభం పొందలేదని వివరించారు. మాజీ మంత్రి హరీశ్ రావు, బిఆర్ఎస్ తనపైన దుష్ప్రచారం చేయాలనుకున్నప్పుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ సోషల్ మీడియా, కృష్ణారావు లాంటి ఎమ్మెల్యేల ఆరోపణలు వస్తాయన్నారు.

**ఎన్నికల ముందే భూ బదలాయింపు జరిగింది...**

ఎన్నికల కు ముందు 2023, అక్టోబర్ 7న బిఆర్ఎస్ ప్రభుత్వం కెటిఆర్‌కు చెందిన శాఖ నుంచి ఐదు ఎకరాలకు సంబంధించిన స్థలాన్ని భూ మార్పిడి చేశారని కవిత ఆరోపించారు. పరిశ్రమల భూమిని రెసిడెన్షియల్ భూమిగా మార్చుకోవచ్చని ఎన్నికల ముందు ఎందుకు జివో ఇచ్చారని?, ఇందుకు ఏం లాభం జరిగిందని, ఇందులో కృష్ణారావు పాత్ర ఏమిటని ప్రశ్నించారు. ఈ స్థల బదలాయింపు చేసిన వ్యక్తి కృష్ణారావుకు బంధువు అంటా కదా అని అన్నారు. ఈభూమికి సంబంధించి బిఆర్ఎస్, కెటిఆర్, ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వ్యాపార వేత్త ఎవి.రెడ్డికి పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాపార భాగస్వామి అని, పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎవరికి బినామీ అని, ఆయన ఎక్కువగా 'రామన్న'తోనే ఉంటారని తెలిపారు. కృష్ణారావు కుమారుడు భాగస్వామిగా ఉన్న కంపెనీ 70 ఎకరాలలో విల్లాలు నిర్మించిందని, ఇందులో ప్రభుత్వ రోడ్ స్థలంఉన్నదని, అలాగే చెరువు స్థలం కూడా ఉన్నదని ఆరోపించారు. గాజుల రామారంలో కె.పి. వివేకానంద, మాదవరం కబ్జా చేశారని కవిత ఆరోపించారు.

## 100% ఎఫ్‌డిఐ (మొదటి పేజీ తరువాయి)

నొక్కిచెప్పినప్పటికీ ఏకపక్షంగా ముందుకెళ్లింది. దేశం ఆర్థికంగా బలహీనపడవచ్చని కూడా వామపక్ష నాయకులు గతంలోనే హెచ్చరించారు. ఉద్యోగ సంఘాలు కూడా గతంలో దేశవ్యాప్త సమ్మెలకు పిలుపులిచ్చాయి. కార్మికులకు, ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవద్దంటూ పార్లమెంటు లోపల, బయట కూడా వామపక్షాలు పోరాడాయి. కానీ, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐలను మోదీ కేబినెట్ ఆమోదించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతుండటంతో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని భావిస్తోంది. పార్లమెంటు సమావేశాల కోసం లిస్ట్ చేసిన13 శాసనాల్లో బీమా చట్టాల (సవరణ) బిల్లు 2025 ఉన్నట్లు లోక్‌సభ బులెటిన్ పేర్కొంది. బీమా రంగంలో ఎఫ్‌డిఐలను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, బీమా రంగం ఎఫ్‌డిఐ ద్వారా రూ.82వేల కోట్లను ఆకర్షించగలిగింది. ఈ రంగంలోకి ఎఫ్‌డిఐలకు పూర్తి అనుమతినిస్తే, దేశీయ పెట్టుబడులు కూడా పెరుగుతాయన్నది కేంద్రం అంచనా. విదేశీ సంస్థలు భారతీయ కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగా పని చేయడానికి 100 శాతం ఎఫ్‌డిఐ పెంపుదలతో అవకాశం లభిస్తోందని భావిస్తోంది.

**జనగణనకు రూ.11,718 కోట్లు** : జనాభా లెక్కలు చేపట్టడం కోసం రూ.11,718 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం లభించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దేశంలో తొలిసారిగా డిజిటల్ జనగణనకు మోదీ ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. రెండు దశల్లో ప్రక్రియ జరుగుతుందని అన్నారు. హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ (గృహాలను జాబితా చేయడం, లెక్కించడం) 2026, ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జరుగుతుందని, జనాభా లెక్కల సేకరణ (పీఈ) 2027 ఫిబ్రవరిలో మొదలవుతుందన్నారు. లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని హిమ క్షేత్రాల్లో ఎన్యుమరేషన్ 2026 సెప్టెంబరులో జరుగుతుందని వైష్ణవ్ తెలిపారు. ఎన్యుమరేషన్ డిజిటల్‌గా జరుగుతుందన్నారు. 30 లక్షల మంది ఫీల్డ్ అధికారులు ఈ బృహత్ కార్యాన్ని చేపడతారన్నారు. డేటా సేకరణ కోసం మొబైల్ యాప్, పర్యవేక్షణ కోసం కేంద్ర పోర్టల్ వినియోగిస్తారని చెప్పారు. ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ అందుబాటులోకి రావడమే కాకుండా సందేహాల నివృత్తికి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మెషిన్ రీడబుల్ ఆక్షనబుల్ ఫార్మాట్‌లో మంత్రిత్వ శాఖలకు డేటా మొత్తం సెన్సెస్‌యాజ్‌ఏ సర్వీస్ (సిఎఎస్) ద్వారా అందుతుందని వైష్ణవ్ అన్నారు. జనగణనలో భాగంగానే కులగణన కూడా జరుగుతుందని ఆయన తెలిపారు.

**71 చట్టాలు బుట్టదాఖలు** : దీర్ఘకాలంగా వినియోగంలో లేని 71 చట్టాలను బుట్టదాఖలు చేసేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ 71 చట్టాల్లో 65 'ప్రిన్సిపల్ యాక్ట్'కు జరిగిన సవరణలు కాగా ఆరు 'ప్రిన్సిల్ లాస్' అని అధికారులు వెల్లడించారు. ఇందులో ఒకటి బ్రిటిష్ కాలం నాటిదిగా తెలిపారు. ఇప్పటివరకు మొత్తంగా 1,562 పాత చట్టాలను రద్దు అయ్యాయని వెల్లడించారు.

**కొబ్బరి ఎంఎస్‌పి పెంపు:** కొబ్బరి సాగుదారులకు మెరుగైన రాబడి వచ్చేందుకుగాను, డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తి పెంచేందుకు 2026 సీజన్‌కుగాను మిల్లింగ్ కొబ్బరి (క్వింటా)ఎంఎస్‌పిని రూ.445 నుంచి రూ12,027కు పెంచేందుకు కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. కొబ్బరి కాయ క్వింటా ఎంఎస్‌పిని రూ.400నుంచి రూ.12,500కు పెంచినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## కన్నుమూత (మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో అనేక కీలకమైన రాజ్యాంగ, మంత్రి పదవులను నిర్వహించారు. 2008 లో కేంద్ర హోం మంత్రిగా ఉన్న సమయంలో పాకిస్తాన్ శిక్షణ పొందిన పది మంది ఉగ్రవాదులు నవంబరు 26 రాత్రి ముంబైపై దాడులకు ఒడిగట్టినప్పుడు... ఈ అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు మూడు వేర్వేరు దుస్తులలో కనిపించడంపై ప్రజల నుంచి, మీడియా నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. విమర్శలకు వ్యతిరేకంగా తనను తాను సమర్థించుకుంటూ, ప్రజలు దుస్తులను కాదు, విధానాన్ని విమర్శించాలని ఆయన అన్నారు. ముంబై దాడులు పాటిల్ రాజకీయ జీవితంపై తీవ్రంగా ప్రభావం చూపాయి. కేంద్ర మంత్రివర్గంలో ఆయన స్థానం దాదాపుగా భరించలేనిదిగా మారింది. దీంతో పాటిల్ నవంబరు 30, 2008న రాజీనామా చేశారు. కాగా శివరాజ్ పాటిల్ మృతికి పార్టీలకు అతీతంగా నాయకులు సంతాపం ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అనేకమంది పాటిల్‌కు సంతాపం తెలిపారు. నివాళులర్పించారు. 1935 అక్టోబరు 12న జన్మించిన పాటిల్, 19661970 మధ్య లాతూర్ మునిసిపాలిటీ అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. తరువాత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 19771979 మధ్య ఆయన మహారాష్ట్ర అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్, స్పీకర్‌తో సహా కీలక పదవులను నిర్వహించారు. ఆ తర్వాత ఆయన లాతూర్ లోక్‌సభ స్థానాన్ని ఏడుసార్లు గెలుచుకున్నారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభకు 10వ స్పీకర్‌గా ఉన్నారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి చెందిన రూపతై పాటిల్ నీలంగేకర్ చేతిలో ఆయన ఓడిపోయారు. ఆయన రాజ్యసభ సభ్యుడు కూడా. కాంగ్రెస్ నాయకుడు కేంద్ర మంత్రివర్గంలో హోం, రక్షణ, వాణిజ్యం, శాస్త్ర, సాంకేతికతతో సహా అనేక కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. పాటిల్ పంజాబ్ గవర్నర్‌గా 2010 నుంచి 2015 వరకు చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి అడ్మినిస్ట్రేటర్‌గా పని చేశారు. 2022లో ఒక పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతూ 'జిహాద్' భావన ఇస్లాంలోనే కాకుండా భగవద్గీత, క్రైస్తవ మతంలో కూడా ఉందని చెప్పినందుకు ఆయన వివాదానికి గురయ్యారు. మార్చి 2025 లో పాటిల్ తన కుటుంబంతో దిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం**

నైతిక విలువలు, హుందాతనంతో రాజకీయాలు నెరిపిన పెద్ద మనిషి శివ్‌రాజ్ పాటిల్ మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివ్‌రాజ్ పాటిల్ మృతిపై సిఎం రేవంత్ రెడ్డి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్థానిక సంస్థల ప్రతినిధి నుంచి ప్రస్థానం ప్రారంభించిన పాటిల్ ఏడు సార్లు ఎంపిగా, లోక్‌సభ స్పీకర్‌గా, కేంద్ర హోమ్ శాఖ మంత్రిగా, పంజాబ్ గవర్నర్‌గా సేవలు అందించారని సిఎం రేవంత్ రెడ్డి ఒక సంతాప సందేశంలో కొనియాడారు.

**టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సంతాపం**

మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శివరాజ్ పాటిల్ మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. లోకసభ స్పీకర్‌గా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా శివరాజ్ పాటిల్ అనేక పదవులు నిర్వహించారని ఆయన గుర్తు చేసుకున్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## ఐసిసిసిలో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంజారాహిల్స్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అత్యాధునిక ఫిట్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం డిజిపి బి.శివధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ.... సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్య తనిచ్చిన టీజీఐసీసీ అధికారులను అభినందించారు. ఇటువంటి చర్యలు సిబ్బందిలో నైతిక స్థైర్యాన్ని బలోపేతం చేసి, పోలీసింగ్ విభాగంలో నిరంతర ఉత్తమ పనితీరుకు దోహదపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్, తెలంగాణా సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణా ఈగల్ ఫోర్స్‌తో పాటు టిజిఐసిసిలలోని సిబ్బంది శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం మెరుగుపరచడానికి ఈ కొత్త సెంటర్‌ను సిద్ధం చేశారు. 1900 చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పబడిన ఈ ఫిట్‌నెస్ సెంటర్లో అత్యాధునిక కార్డియో, స్ట్రెంథ్‌ట్రైనింగ్ మరియు కండిషనింగ్ పరికరాల సముదాయం ఉంది. ఇందులో ఇతర వృత్తిపరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమానికి సీనియర్ ఐపిఎస్ అధికారులు శిఖా గోయల్, విసి సజ్జనార్, కమలాసన్ రెడ్డి, అవినాష్ మహంతి, అభిషేక్ మహంతిలు పాల్గొన్నారు.

## సివిల్ వివాదంలో పోలీసుల జోక్యమా?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒక స్థల వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవడంపై హైకోర్టు శుక్రవారం విచారించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటరు దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి, నగర పోలీసు కమిషనర్, శామీర్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ, ఎస్సై, ప్రైవేటు వ్యక్తి వెంకటరెడ్డిలకు నోటీసులు ఇచ్చింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జస్టిస్ శ్రవణ్‌కుమార్ ఆదేశాలను జారీ చేశారు. సివిల్ వివాదంలో పోలీసులు ఏవిధంగా జోక్యం చేసుకుంటారో చెప్పాలని ఆదేశించారు. శామీర్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ, ఎస్సైలు సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారని పేర్కొంటూ శామీర్‌పేట్ మండలం తూంకుంటకు చెందిన అనిల్‌కుమార్ పిటిషన్ వేశారు. తూంకుంటలో 133 చదరపు గజాలను పిటిషనర్ 2018 మార్చిలో కొన్నారని, ప్రహరీ కట్టి గది కట్టి పన్ను చెల్లిస్తున్నారని, ఆ గదిలోని వాచ్‌మెన్ వెంకటరెడ్డి అనే వ్యక్తిని బయటకు పంపేసి నోటరీ పేపర్‌తో స్థలాన్ని కాజేశారని, ఇందుకు పోలీసులు కూడా సహకరించారని చెప్పారు.



## ఔట్‌సోర్సింగ్‌కు బదిలీ చేయవద్దు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఇటీవల జివొ 1195 ద్వారా కొన్ని క్యాడర్ల ఉద్యోగులను కాంట్రాక్ట్ నుంచి ఔట్‌సోర్సింగ్‌లోకి మార్చారని, దీంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని చిన్నారెడ్డికి వివరించారు. దీనిపై స్పందించిన చిన్నారెడ్డి తక్షణమే వైద్య ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తుకి ఫోన్ చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్‌కి బదిలీ చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, బుచ్చయ్య, అంజి, జయమ్మ, అలివేలు, జెన్. బి, నార్సింగ్ శీను, కమలమ్మ, భద్రయ్య, రాధమ్మ, అలివేలు పాల్గొన్నారు.

# జర్మనీతో సుదీర్ఘకాలంగా స్నేహబంధం



ఐటి, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో కలిసి పనిచేద్దాం

జర్మనీ పార్లమెంటు బృందంతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతం: జర్మనీ పార్లమెంట్ బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా భవన్‌లో శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు బృందాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐటి, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండని, తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని, హైదరాబాద్ ఐటీ రంగానికి హబ్‌గా వెలుగొందుతుందని, దీంతోపాటు మూసీ పునర్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగంపైన ఆసక్తిగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న స్కిల్ యూనివర్సిటీలో జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని, తద్వారా తెలంగాణ విద్యార్థులు జర్మనీ భాష నేర్చుకొని జర్మనీ దేశంలో పనిచేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

**సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత..**

తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూరదృష్టితో సైబర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామన్నారు. ఆర్థిక నేరాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని, ఫైనాన్స్ రంగంలో సైబర్ ఫిషింగ్ ఎలా జరుగుతుంది, వాటిని అరికట్టేందుకు బెస్ట్ ఎఐ టూల్స్ వాడుతున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని జర్మనీ పార్లమెంటు బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించింది. ప్రతి రంగంలో సాధించాల్సిన లక్ష్యాలను ఈ విజన్ డాక్యుమెంట్‌లో స్పష్టంగా పేర్కొనడం అభినందనీయమని, రాష్ట్ర ప్రగతి పట్ల ప్రభుత్వ నిబద్ధత ఈ డాక్యుమెంట్ ద్వారా స్పష్టంగా తెలుస్తుందని జర్మనీ పార్లమెంట్ బృందం డిప్యూటీ సిఎం, మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సైబర్ సెక్యూరిటీ, స్కిల్ లేబర్ అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కోరుకుంటున్నామని జర్మన్ పార్లమెంట్ బృందం వివరించింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు చాలా మంది భారతదేశంలో పెట్టుబడులు పెట్టారని, తమ దేశానికి చెందిన బిఓఎస్‌హెచ్ వంటి ప్రసిద్ధ కంపెనీలు ఇక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయి, తమ దేశానికి చెందిన ఇంజనీర్లు భారతదేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్నారని జర్మనీ పార్లమెంటు బృందం వివరించింది. భారతదేశానికి చెందిన 60 వేల మంది విద్యార్థులు జర్మనీలో వివిధ రకాల కోర్సులను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, స్కిల్ లేబర్‌కు భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో కొదవలేదని అన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్‌కొ సిఎండి హరీష్, ప్రణాళిక శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, అసెంబ్లీ సెక్రెటరీ నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## జాతర పనులు త్వరితగతిన పూర్తి

మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న మంత్రులు

**ప్రజాపక్షం/ములుగు :** మేడారం దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్కలు కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం సందర్శించారు. మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్దరణ అభివృద్ధి పనులను, దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను, జంపన్న వాగు వద్ద పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరిగతిన పూర్తి చేయాలని సంబందిత అదికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారులు ఆర్అండ్‌బి, ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిది గోబెల్స్ ప్రచారం

లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి మేలు చేస్తాయంటూ తప్పుడు ప్రచారం

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి ఎంతో మేలు చేస్తాయని తప్పుడు ప్రకటన చేస్తున్న బిజెపిని రానున్న రోజుల్లో కార్మిక వర్గం తగిన గుణపాఠం చెబుతుందని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. కార్మిక వర్గానికి అండగా నిలబడిన కమ్యూనిస్టులపైన బిజెపి నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తప్పుడు ప్రకటన చేశారన్నారు. ఇలాంటి గోబెల్స్ ప్రచారంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 100 మంది వరకు కార్మికులు ఉన్న సంస్థల్లో కార్మిక చట్టాలను అమలు చేయాలనేది స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రస్తుత లేబర్ కోడ్‌లలో దీనిని 300 మంది వరకు పెంచడం ఎవరి ప్రయోజనం కోసమనే అంశాన్ని కార్మికులు అర్థం చేసుకుంటున్నారని వివరించారు. పర్మినెంట్ ఉద్యోగాలకు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం మిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో సంవత్సరానికి ఒకసారి సగం నెల జీతం ఇచ్చి ఇంటికి పంపిస్తామని, ఈ లేబర్ కోడ్‌లలో స్పష్టం చేశారని, దీనిని బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వానికి అంటగాగుతున్న బిఎంఎస్ కూడా కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తున్నదని నరసింహ గుర్తు చేశారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లామ్‌మెంట్ పేరుతో కార్మిక వర్గాన్ని శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. దిగు వర్కర్లకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని అంశాన్ని కార్మిక వర్గం స్వాగతిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో అసంఘటిత రంగంలో ఉన్నటువంటి ఆటో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో లక్షలాదిగా ఉన్న ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం లాంటి అనేక స్కీములలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు కూడా అందించడం లేదని అన్నారు. వారి కోసం ఏ చట్టాలను తీసుకురాకపోవడం ఏ విధంగా న్యాయం అనేది బిజెపి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్మికులకు అండగా కార్మిక నాయకులు ఉండే విధానాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నదని, 51 శాతానికి పైబడి ఓట్లు వస్తేనే గుర్తింపు సంఘంగా గుర్తించాలని నిబంధన తీసుకురావడం ఏ విధమైన న్యాయమని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ ప్రకారం కొద్ది శాతం మెజార్టీ ఓట్లతో దేశ ప్రధానిగా ఉన్నటువంటి నరేంద్ర మోడీ ఈ విధమైన చట్టాలు తీసుకురావడం ఎంత వరకు సమంజసం అని మండిపడ్డారు. గతంలో రైతాంగం రైతు చట్టాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని బిజెపి నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు.

# హెచ్‌సిఎను రద్దు చేయండి

సిసిఎస్, సిఐడి, ఉప్పల్, ఇడి కేసుల్లో చిక్కుకున్న వైనం

బిసిసిఐ నిధుల్లో భారీ కుంభకోణం..

సెలక్షన్ పేరుతో కలెక్షన్‌లు

మీడియా సమావేశంలో టిసిఎ నేతల వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పీకలలోతు అవినీతిలో కూరుకుపోయిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)ను రద్దు చేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బిసిసిఐ ఇచ్చిన వందల కోట్ల రూపాయలను దోచుకోవడంతో పాటు సిసిఎస్, ఉప్పల్, సిఐడి, ఇడి కేసులు నమోదు చేసిందని, ఈ కేసుల్లో హెచ్‌సిఎ నేతలు జైళ్లకు కూడా వెళ్లి వచ్చారని ఇలాంటి వారిని క్రికెట్ అసోసియేషన్ నుంచి భర్తరఫ్ చేయాలని టిసిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ టీంకు క్రీడాకారులను సెలక్షన్‌ల పేరుతో కలెక్షన్‌లకు తెగబడుతున్న హెచ్‌సిఎ పట్ల క్రికెట్ అభిమానులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్‌సిఎ తాజాగా నిర్వహించిన అండర్14 ఎంపికల్లో హెచ్‌సిఎ హైకోర్టు ఆదేశాలను, బిసిసిఐ నిబంధనలను ఉల్లంఘించి సెలక్షన్‌ల పేరుతో కలెక్షన్‌ల దోపిడీకి పాల్పడిందన్నారు. టిసిఎ వెల్లడించిన వివరాల ప్రకారం, జిల్లావారీగా ట్రయల్స్ నిర్వహించాల్సినప్పటికీ హెచ్‌సిఎ పబ్లిక్ నోటిఫికేషన్ ఇవ్వకుండానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల యువ క్రికెటర్లను సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌కు ఒకేచోటకు పిలిపించిందని ఆరోపించింది. జిల్లాల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకుండానే ఈ విధంగా పిలుపునివ్వడం వల్ల సుమారు 3,500 మంది విద్యార్థులు 250 కిమీ మేర ప్రయాణించి తల్లిదండ్రులతో రాగా, అక్కడ ఏర్పాట్లు లేక కలకలం, అవ్యవస్థ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన విమర్శించారు. ఒకేచోట వేలాది మందికి ఒకరోజులో ట్రయల్స్ ఎలా నిర్వహించగలరు? జిల్లా మ్యాచ్లు నిర్వహించడం తప్పనిసరి క్రమంలో ఈ ప్రక్రియను పక్కనపెట్టడం ద్వారా అర్హులైన ప్రతిభను అణగదొక్కడానికే ఇది చేసిన చర్య అని టిసిఎ ఆరోపించింది. అంతేకాకుండా అండర్ 14 విభాగం బిసిసిఐ గుర్తింపు పొందిన టోర్నమెంట్ కాదని, ఈ పరిస్థితుల్లో వేలాదిమంది పిల్లల వ్యక్తిగత వివరాలు సేకరించడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. హెచ్‌సిఎ క్రీడాకారుల డేటాను ప్రైవేట్ అకాడమీలకు వాణిజ్య ప్రయోజనాల కోసం మళ్లించే ప్రయత్నం జరుగుతోందని, ఇది డేటా చౌర్యంతో పాటు క్రిమినల్ ఉద్దేశపూర్వక చర్య అని ఆయన ఆరోపించారు. రాబోయే నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్ 2025 నిబంధనలను హెచ్‌సిఎ స్పష్టంగా ఉల్లంఘిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో 4 కోట్ల జనాభా ఉన్నప్పటికీ హెసిఎ ఆధీనంలో కేవలం 210 క్లబ్లు మాత్రమే ఉండటం, ఒకే లీగ్ హైదరాబాద్‌లోనే సాగుతున్న దాన్ని లెక్కచూపుతూ హెచ్‌సిఎ క్రికెట్‌పై ఏకపక్ష ఆధిపత్యం కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో టిసిఎ రాబోయే సంవత్సరాల్లో తెలంగాణ ప్రీమియర్ లీగ్ 2026, పాఠశాలలు–కళాశాలల స్థాయి టోర్నమెంట్లు, డిసెంబర్ 21 నుంచి తెలంగాణ గోల్డ్ కప్ 2025 వంటి రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. హెచ్‌సిఎపై ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

## రాజకీయాల్లో గెలుపోటములు సహజం : ఎంపి అఖిలేష్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయాల్లో గెలుపు, ఓటములు ఉంటాయని, ప్రజలు ఎప్పుడు మన వెంట ఉంటారో తెలియబోదని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు, ఎంపి అఖిలేష్ యాదవ్ అన్నారు. హైదరాబాద్, నందినగర్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావును అఖిలేష్ యాదవ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాలు, తదితర అంశాలపైన చర్చించినట్టు తెలిసింది. అనంతరం అఖిలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ దేశం ప్రగతిశీల, ఒక విజన్‌వైపు వెళ్లాలని, విభజన రాజకీయాలు అంతం కావాలని ఆకాంక్షించారు. ప్రజలు ఒకసారి స్వీకరిస్తారని, మరోసారి అవకాశం కల్పిస్తారన్నారు. కెటిఆర్ మాట్లాడుతూ యుపిలో సమాజ్‌వాది పార్టీ శాసనసభలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత 37 మంది ఎంపిలను గెలిపించుకుని పార్లమెంట్‌లో మూడవ అతి పెద్ద పార్టీగా అవతరించిందని, అదే స్ఫూర్తితో బిఆర్ఎస్ ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికత

డ్రగ్స్ నేరగాళ్లపై రౌడీషీటర్ల తరహా నిఘా

కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల సమన్వయ సమావేశంలో సిపి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్ కట్టడికి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి.సజ్జనార్ తెలిపారు. యువతరం భవిష్యత్తును భ్రష్టు పట్టిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ఏరిపారేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు డ్రగ్స్ వినియోగదారులపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై ఎటువంటి నిఘా ఉంచుతామో, డ్రగ్స్ నేరగాళ్లు, పెడ్లర్లపైనా అదే స్థాయి నిఘా ఉంటుందని సిపి స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిలో శుక్రవారం నగర సిపి విసి సజ్జనార్ అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీకి ఐబి, డిఆర్ఐ, ఎన్‌సిబి, ఎక్సైజ్, కౌంటర్ ఇంటెలిజెన్స్, ఈగల్, ఎఫ్ఆర్ఆర్వో తదితర కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌కు చెక్ పెట్టేందుకు 'హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్' (హెచ్‌న్యూ)ను మరింత బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న బృందాలకు అదనంగా నాలుగైదు కొత్త బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, నిందితుల అరెస్టుల్లో ఈ బృందాలు కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు.

**డ్రగ్స్ నియంత్రణకు అన్ని విభాగాల పరస్పర సహకారం..**

మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్కరోజుతో ముగిసే ప్రక్రియ కాదని, అది నిరంతర పోరాటమని, అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పని చేయాలని సూచించారు. ఇకపై ప్రతినెల అన్ని ఏజెన్సీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, కేసుల పురోగతిని సమీక్షించనున్నట్లు తెలిపారు. పాత కేసులు, నిందితుల కదలికలు, కొత్త నేర పద్ధతులపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని మార్పిడి చేసుకోవాలన్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగంలో విదేశీయుల పాత్రపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడంతో పాటు విమానాశ్రయాల్లో ప్రయాణికుల సమాచారం ఆధారంగా సంబంధిత ఏజెన్సీస్ నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. అలాగే, డ్రగ్స్ రవాణాకు కొరియర్ సర్వీసులు వేదికగా మారుతున్న నేపథ్యంలో వాటిపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యం కోసం నగరానికి వచ్చి, ఆసుపత్రుల్లో చేరకుండా తిరుగుతున్న విదేశీయుల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఇలాంటి వారి వివరాలను డిఆర్ఐ, ఎఫ్ఆర్ఆర్ఓ అధికారులతో పంచుకుని వారిని వెంటనే ట్రాక్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి, ఐబి జాయింట్ డైరెక్టర్ తిరుగణన సంబంధన్, డిఆర్ఐ డిప్యూటీ డైరెక్టర్ గురు రాజేష్, ఎన్‌సిబి అసిస్టెంట్ డైరెక్టర్ విష్ణు వర్ధన్, ఈగల్ టీమ్ డిఐజి అభిషేక్ మహంతి, సిఐఎస్ఎఫ్ డిఐజి మోహంకా, ఎఫ్ఆర్ఆర్ఓ అప్పలనాయుడు, ఇంటలిజెన్స్ ఎస్‌పి.భాస్కరన్, డిసిపి ఎస్‌బి కె.అపూర్వారావు, డిసిపి టాస్క్‌ఫోర్స్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డిఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ అనురాగ్ సింగ్, ఆబ్కారీ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో.. తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా నిలబడే ఛాన్స్

ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రపంచ వేదికపై తెలంగాణ పోటీ పడడానికి 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ఉపయోగపడుతుందని ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులు తెలంగాణలోని ప్రజారోగ్యంలో మౌలిక సదుపాయలు కల్పించడానికి, ప్రతి పౌరుడికి ప్రపంచ స్థాయి వైద్యం అందేలా చేస్తాయని ఆయన తెలిపారు. క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా నిలబడే అవకాశాలున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఆయన శుక్రవారం ఒక లేఖ రాశారు. వచ్చే ఏడాది జనవరి మూడో వారంలో తెలంగాణ రాష్ట్ర పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిని కలుసుకోనున్నట్లు డాక్టర్ నోరి దత్తాత్రేయ తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ చారిత్రాత్మక విజయం సాధించిందని, లక్షలాది కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన, స్థిరత్వం, భవిష్యత్తుపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన తన లేఖలో తెలిపారు. డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ వంటి రంగాల్లోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం తెలంగాణ రైజింగ్ విజన్ 2047 శక్తికి ఊతమిస్తుందన్నారు. తెలంగాణలో ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపు కోసం చేస్తున్న ప్రయత్నాలు హర్షనీయమన్నారు. ప్రపంచ దిగ్గజాలను హైదరాబాద్, ఫోర్త్ సిటీకి రప్పించి తెలంగాణను భారతదేశ స్టార్టప్‌గా, మానవ కేంద్రీకృత అభివృద్ధికి ప్రపంచ కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుజువు చేశారన్నారు.


**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

**NIT No.** 50, **పని పేరు:** 1 పని కోసం జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయడం. **అంచనా విలువ / ఇసివి:** రూ.11.60లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం:** 12.12.2025న మ.2:30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 17.12.2025న మ.2:45గం.ల వరకు. **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్ నెం.9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 11977-PP/CL/ADVT/1/2025-26, Date: 12-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మల్కాజ్‌గిరి సర్కిల్-28

కొటేషన్ నోటీసు

**NIT No. Quotation Notice No.07/EE-28/SBZ/GHMC/2025-26**

**పని పేరు:** వివేకనందపురం థీమ్ పార్క్ మరియు శ్రీ కృషి ఎన్‌క్లేవ్ అభివృద్ధి. **పరిమాణం:** Each/Job, **బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 12.12.2025న ఉ.10:30గం.ల నుండి 15.12.2025న ఉ.10:30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం.9154796465. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 11960-PP/CL/ADVT/1/2025-26 Date: 12-12-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం
**శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము**
బీచుపల్లి గ్రామము, ఎర్రవల్లి మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా, తెలంగాణ

బహిరంగ వేలము & సీల్డ్ టెండర్ ప్రకటన

లేఖ సంఖ్య : 32/E.O/S.A.S.D/BPLY/2025 తేది: 10-12-2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మం.బీచుపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము యొక్క క్రింద తెలిపిన విధముగా వివిధ టెండర్స్ తేది: 20-12-2025 శనివారము ఉ.11-30 గం.లకు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము ఆవరణములో సీల్డ్ టెండర్ & బహిరంగ వేలములు ద్వారా నిర్వహించబడును. ఈ బహిరంగ వేలములలో పాల్గొనుటకు ఆసక్తి కలవారు ముందుగా వారు తేది: 20-12-2025 శనివారము రోజు మ.12-00 గంటలలోపు డిపాజిట్ డి.డి. రూపములో చెల్లించవలయును.

| క్ర.సం. | వేలము పాట వివరములు | కాలపరిమితి | డిపాజిట్ రూపాయలు |
|---|---|---|---|
| 1 | టెంకాయలు, వాహనపూజ సామాగ్రి కిరాణము అమ్ముకొనుటకు హక్కు | 01/01/2016 నుండి 31/12/2026 వరకు | రూ.6,00,000/- |
| 2 | కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 01/01/2026 నుండి 31/01/2026 వరకు | రూ.50,000/- |
| 3 | రక్షా కంకణముల అమ్ముకొనుటకు హక్కు | 01/01/2026 నుండి 31/12/2026 వరకు | రూ.2,00,000/- |

డి.డి.లు తీయవలసిన చిరునామ: Excutive Officer, Sri Anjaneya Swamy Devastanam, Beechupalli పేరుమీద డి.డి. తీయవలయును.

**గమనిక :** బహిరంగ వేలము & సీల్డ్ టెండర్‌లో పాల్గొనుటకు ఆసక్తి కలవారు వేలంపాటకు ముందుగా దేవస్థానం కార్యాలయము నందు తేది 19-12-2025 నుండి తేది 20-12-2025 ఉ.10-00 గంటల వరకు రూ.1,000/- చెల్లించి టెండర్ షెడ్యూల్ తీసుకొగలరు.

డి.కె. భరతసింహారెడ్డి, వ్యవస్థాపక వంశీయులు,
సి. రామన్ గౌడ్, కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 11989-PP/CL/ADVT/1/2025-26, Date: 12-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## పునర్విభజనపై అభ్యంతరాలు, సూచనలు

సెలవు రోజులైన ఈ నెల 13, 14 తేదీల్లో స్వీకరించనున్న జిహెచ్ఎంసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వార్డుల పునర్విభజనకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు స్వీకరించేందుకు మహానగర పాలక సంస్థ( జిహెచ్ఎంసి) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వార్డుల పునర్విభజనపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు జిహెచ్ఎంసి ముఖ్యమైన ప్రకటన చేసింది. ఈ నెల 13 (శనివారం), 14 (ఆదివారం) వ తేదీలలో సెలవు దినాలు అయినప్పటికీ, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు జిహెచ్ఎంసి ప్రకటించింది. ఈ రెండు రోజుల్లో కూడా ప్రజలు తమ అభ్యంతరాలు లేదా సూచనలు సమర్పించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా, తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు వీలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వార్డుల పునర్విభజనపై ఏవైనా మార్పులు, చేర్పులు లేదా అభ్యంతరాలు ఉంటే, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిహెచ్ఎంసి అధికారులు సూచించారు.

## బిసి గురుకులాల అవినీతిపై విచారణ జరిపించాలి

బిసి ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని బిసి సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే బిసి రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని బిసి ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఐఎఫ్ఎస్ అధికారి బి. సైదులు పర్యవేక్షణ, నిబద్ధత లోపంతో అడుగడుగునా అవినీతి జరుగుతుందని, పిఎం శ్రీ నిధుల కింద మంజూరైన రూ.20 కోట్లు అవినీతి జరిగిందని, దీనిపై స్పందించి కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయించి, బిసి గురుకులాల కార్యదర్శి సైదులుపై చర్యలు తీసుకోవాలని, బిసి కమిషన్ కార్యదర్శి, పర్సన్ ఇంచార్జ్ మీత రాజీవ్ లోచన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన, కార్యదర్శి నిబద్ధత లోపం వలన రాష్ట్రంలోని గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థులు సరియైన సౌకర్యాలు లేక, నాణ్యమైన ఆహారం లేక, ఆహార కల్తీ వల్ల, 72 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇందుకు కారణమైన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషన్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుడికాల భాస్కర్, విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్, వివిధ జిల్లాల అధ్యక్షులు వద్నాల రవీందర్, ఊర్లగొండ మురళి, బొంగోని అభిలాష్, వరాల అనిల్, ఉట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం ప్రజావాణికి 266 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 266 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఇందులో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 80, రెవెన్యూ శాఖకు సంబంధించి 17, ఇందిరమ్మ ఇండ్ల కోసం 98, మున్సిపల్ శాఖకు 13, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇతర శాఖలకు సంబంధించి 57 దరఖాస్తులు అందాయన్నారు. సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి, ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**చిన్నారెడ్డికి ఆర్‌టిసి ఉద్యోగుల వినతి..**

వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన తమను తిరిగి ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతూ ఆర్‌టిసి ఉద్యోగులు సిఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. డ్రైవర్స్, కండక్టర్స్, సెక్యూరిటీ గార్డు, మెకానిక్ సహా పలు ఉద్యోగాలు చేస్తున్న సమయంలో చిన్న చిన్న కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన విషయం చిన్నారెడ్డి దృష్టికి తీసుకొచ్చి, తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో తానే స్వయంగా ఆర్‌టిసి ఎం.డిని కలిసి న్యాయం జరిగేలా చూస్తానని వారికి భరోసా ఇవ్వడంతో, ఆర్‌టిసి ఉద్యోగులు జి.చిన్నారెడ్డిని సన్మానించారు.

## 42 గ్రాముల ఒజి కుష్ పట్టివేత


**ప్రజాపక్షం/హైదరాబాద్:** మత్తుమందు ఒజి కుష్‌ను విక్రయిస్తున్న రెండు ముఠాల గుట్టును ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ ఎ టీమ్ లీడర్ అంజిరెడ్డి రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్‌లో తిరుగుతున్న కారును ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అందులో ఒజి కుష్ పట్టిబడింది. ఈ కేసులో పది మంది నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో కియా కారుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇక ధూల్‌పేట పరిధిలో కూడా ఒజికుష్‌ను విక్రయిస్తున్న మరో ముఠాపై దాడి చేసి వారి నుంచి 28.8 గ్రాములను స్వాధీనం చేసుకున్నారు. ఈకేసులో జటాప్ వైష్ణవ్యమనన్, బీహారాలను అరెస్టు చేశారు. ఈ రెండు కేసులను సికింద్రాబాద్, దూల్‌పేట్ ఎక్సైజ్‌పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


**0.40 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం..**

నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఖైరతాబాద్ అనంద్‌నగర్ ప్రాంతంలో 0.40 గ్రాముల ఎండిఎంఎ, ఐదు గంజాయి ప్యాకెట్లు, మూడు లిక్కర్ బాటిళ్లను ఎస్‌టిఎఫ్ బి టీమ్ సిఐ భిక్షారెడ్డి ఎస్ఐ బాలరాజు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్‌ను షెఫ్‌గా పని చేస్తున్న ఓమ శ్రీయ అనే మహిళ ప్రణిత్ అనే వ్యక్తి ద్వారా తెప్పించుకుంది. ఇద్దరిపై కేసు నమోదు చేసి నాంపల్లిలో అప్పగించారు.ఎస్‌టిఎఫ్ బి టీమ్ సిఐ బిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజు కలిసి 252 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హస్తినాపురంలో నితిష్ రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

**మద్యం బ్రాండ్ మిక్సింగ్ చేసే వ్యక్తి అరెస్టు..**

**ఖరీదైన మద్యంలో నకిలీ..**







ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని మిక్సింగ్ చేసి అమ్మకాలు చేపడుతున్న ఓ ముఠా గుట్టును ఎస్‌టిఎఫ్ డి టీమ్ సిఐ నాగరాజు రట్టు చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చెందిన బానోత్ నర్సా అనే వ్యక్తి ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధరల మద్యాన్ని కలిసి బ్రాండ్ మిక్సింగ్ చేసి వినియోగదారులకు తక్కువ ధరలకు అమ్మకాలు చేపట్టి సొమ్ముకుంటాడు. ఈ సమాచారం అందుకున్న సిఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి ఖమ్మం వెళ్లి అరెస్టు చేశారు.

# మహిళా కార్మికులకు అండగా సిపిఐ

ఆందోళన ఉధృతం చేస్తాం

జైళ్లకు పంపించినా ఆగేది లేదు

షాహి సంస్థ మహిళా కార్మికుల ఆందోళనలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కార్యదర్శి కె.నారాయణ హెచ్చరిక





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** షాహి మహిళా కార్మికుల వేతనాలు, యాజమాన్య నిరంకుశ ధోరణికి నిరసనగా తప్పని పరిస్థితుల్లో రోడ్డెక్కారని, ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం తీసుకొని సామరస్యంగా పరిష్కరించని పక్షంలో సిపిఐ అండగా నిలబడి న్యాయం జరిగేంత వరకు ఆందోళనలు ఉధృతం చేసేందుకు వెనుకాడబోమని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కార్యదర్శి కె.నారాయణ హెచ్చరించారు. నాచారం పారిశ్రామికవాడలోని షాహి ఎక్స్‌పోర్ట్స్ గార్మెంట్ లిమిటెడ్ సంస్థలో 5వ రోజుకు చేరుకొన్న మహిళా కార్మికులకు మద్దతుగా ఆయన శుక్రవారం ఆందోళనలో పాల్గొన్నారు. అక్కడికి చేరుకొన్న సంస్థ యాజమాన్యం, కార్మిక సంస్థ అధికారులతో ఆయ న చర్చించి మహిళా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో గార్మెంట్ల కుట్టు పనుల్లో 2500 నుండి 3 వేల వరకు మహిళా కార్మికులు నిమగ్నమై విధులు నిర్వహిస్తుంటే వారికి యాజమాన్యం కార్మిక నిబంధనల మేరకు వేతనాలు ఇవ్వకపోగా పని చేస్తుండగా మానసికంగా వేధిస్తున్నారని వారు బాధ పడుతుండటం శోచనీయమన్నారు. యాజమాన్యం కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించకుండా కుట్రపూరితంగా కాంట్రాక్టర్ ద్వారా తమ రికార్డుల్లో రూ.25 వేలు చూపించుకొంటూ రూ.10 వేలు తగ్గించి ఇవ్వటం శోచనీయమన్నారు. కార్మికశాఖ నిబంధనల మేరకు కనీసం సెలవులను సైతం ఇవ్వటం లేదని తెలుస్తోందన్నారు. ఇలాంటి ధోరణి ఇప్పటికైనా యాజమాన్యం విడనాడాలని, ఇంత పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పని చేస్తున్న సంస్థలో కార్మిక నిబంధనలు పకడ్బందీగా అమలు చేయించటంలో కార్మిక శాఖాధికారులు యాజమాన్యానికి తొత్తుగా మారారని ఆరోపించారు. మహిళా కార్మికులు ఏళ్ల తరబడి పడుతున్న యాజమాన్య నిరంకుశ ధోరణి, అన్యాయాలకు బాధపడి కడుపు మండి స్వచ్ఛందంగా రోడ్డెక్కారే ఏ రాజకీయ పార్టీయో, ఏ కార్మిక సంఘాలదో ప్రోద్భలం కాదన్న విషయం అర్థం చేసుకోవాలన్నారు. మహిళా కార్మికులు తాడోపేడో తేల్చుకొనేందుకు సిద్దమయ్యారని, వారికి పూర్తిస్థాయిలో తమ మద్దతిస్తుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం మహిళా కార్మికుల బాధలను అర్థం చేసుకొని సమస్యలను సామరస్యంగా పరిష్కరించని పక్షంలో సిపిఐ పూర్తిస్థాయిలో అండదండలందిస్తూ విధ్వంసకర ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్లేందుకు సైతం వెనుకాడదని ఆయన హెచ్చరించారు. 5 రోజులుగా రోడ్డెక్కిన వేలాది మంది మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో కార్మిక శాఖ అనుసరిస్తున్న వైఖరిని నారాయణ తీవ్రంగా దుయ్యబట్టారు. ఒక వేళ సంస్థ మూసివేసి మహిళా కార్మికులను జైళ్లల్లో పెట్టవచ్చని, అలాంటి యత్నాలు సరైన పరిష్కారం కాదని ఆయన అన్నారు.

**కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలే కారణం**

దీనికంతటికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్లే పలు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు తమ హక్కులను కోల్పోయి రోడ్డెక్కుతున్నారనటానికి షాహి సంస్థలో పని చేస్తున్న మహిళా కార్మికుల ఆందోళన ఒక ఉదాహరణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్మిక సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలే తప్ప వారికి నష్టం చేకూర్చేలా ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి, కె.ధర్మేంద్ర, రచ్చ కిషన్, ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్ ఇతర ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం అనంతరం 42 మంది విద్యార్థులకు అస్వస్థత

శేరిలింగంపల్లి మండలంలోని ఎంపిపిఎస్ చందర్ నాయక్ తండా పాఠశాలలో ఘటన

కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** శేరిలింగంపల్లి మండలంలోని ఎంపిపిఎస్ చందర్ నాయక్ తండా పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం అనంతరం 42 మంది విద్యార్థులు స్వల్పమైన కడుపు నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. ఈ సమాచారంపై పాఠశాల సిబ్బంది వెంటనే స్పందించి, పిల్లలను సమీపంలోని కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్స అందించారు. ప్రస్తుతం వీరిలో ఎక్కువ మంది పిల్లలు క్రమంగా కోలుకుంటూ డిశ్చార్జ్ అవుతున్నారు. ఇక ఆరుగురు విద్యార్థులు అదనపు పరిశీలన కోసం హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా విద్యా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అక్కడ కూడా వైద్య పరీక్షల అనంతరం వారికి ఎటువంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు లేవని తేలడంతో, వారు కూడా త్వరలో కోలుకునే స్థితి ఉన్నారన్నారు. ప్రస్తుతం అందరు విద్యార్థులు సురక్షితంగా ఉన్నారు, ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు లేవని, జిల్లా వైద్యాధికారులు వైద్య బృందం తెలిపారు. ఈ సంఘటనపై మండల విద్యాధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిశుభ్రత వంటి అంశాలపై కూడా సమగ్ర విచారణ జరుగుతోంది. అవసరమైన సూచనలు సంబంధిత వారికి అందించబడ్డాయి. పిల్లల ఆరోగ్యం, భద్రత పట్ల విద్యాశాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తక్షణ చర్యలు తీసుకుంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి



హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ముఖుంద రెడ్డి

కింగ్ కోఠి, నిలోఫర్ ఆసుపత్రుల సందర్శన.. ఫుడ్ పాయిజనింగ్ బాధితులకు పరామర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిఎంఆర్ఈఐఎస్ ముషీరాబాద్ బాలికల–I స్కూల్, బాగ్‌లింగంపల్లి విద్యార్థులకు గురువారం రాత్రి ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డాక్టర్ జి.ముఖుంద రెడ్డి, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్‌తో కలిసి కింగ్ కోఠి ప్రభుత్వ ఆసుపత్రి, నిలోఫర్ ఆసుపత్రులను సందర్శించారు. అదనపు కలెక్టర్ విద్యార్థుల ఆరోగ్య స్థితిని దగ్గరుండి పరిశీలించారు. వారికి అందిస్తున్న వైద్య సేవలను గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్, అదనపు డిఎంహెచ్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ స్థిరంగా ఉన్నారని, ఎలాంటి ప్రమాదకర పరిస్థితి లేదని అధికారులు అదనపు కలెక్టర్‌కు చెప్పారు. కింగ్ కోఠి ఆసుపత్రిలో 16 మంది, నిలోఫర్ ఆస్పత్రిలో 7 మంది విద్యార్థులు చికిత్స అనంతరం క్షేమంగా ఉన్నారని ఆయన తెలిపారు.

**మెరుగైన వైద్యం అందించాలని సూచన..**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి మాట్లాడుతూ ఫుడ్ పాయిజనింగ్ బాధితులైన విద్యార్థులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు నిరంతర పర్యవేక్షణ, సమగ్రమైన వైద్య సదుపాయాలు అందించాలని ఆసుపత్రి వైద్యులు, అధికారులను ఆదేశించారు. పాఠశాల నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల పరిధిలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పారిశుధ్యం, వంటశాల శుభ్రత పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ఘటనకు కారణమైన అంశాలపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పాఠశాలలో ఉన్న మిగిలిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి సుల్తాన్ బజార్, ఇసామియా బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య బృందాలు స్క్రీనింగ్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# లోయలో పడిన బస్సు

9 మంది భక్తులు మృతి

ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



**చింతూర్ :** ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘాట్‌రోడ్డులో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చింతూరు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఘటనపై స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించాయి. ప్రమాదం జరిగిందని తెలిసి హుటాహుటిన ఘటనాస్థలికి ఎంపి మంత్రులు అనిత, సంధ్యారాణిలు బయలుదేరి వెళ్లారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం చింతూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధితులను మంత్రి అనిత పరామర్శించారు. అనంతరం అనిత మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల పరిహారం ఇవ్వనుందని తెలిపారు. అలానే క్షతగాత్రులకు కేంద్రం రూ.50 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు అందివ్వనుందని చెప్పారు. శీతాకాలంలో ఘాట్ రోడ్డులో రాత్రి 10 నుంచి ఉ.6 గంటల వరకు వాహనాలు నిలిపివేస్తామని, గిరిజన ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపరుస్తామని చెప్పారు. చిత్తూరు జిల్లాకు చెందిన భక్తులు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో భద్రాచలం వెళ్లారు. అక్కడ రామాలయంలో దర్శనం పూర్తి చేసుకుని మారేడుమిల్లి మీదుగా అన్నవరానికి బయలుదేరారు. బస్సులో మొత్తం ఇద్దరు డ్రైవర్లతో సహా 35 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు అల్లూరి జిల్లా చింతూరు–మారేడుమిల్లి ఘాట్‌రోడ్డు రాజుగారిమెట్ట మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు మొత్తం 9 మంది మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారనీ, వారిలో 9 మంది మృతి చెందారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా చింతూరు మారేడుమిల్లి ఘాట్ రోడ్డు వద్ద రాకపోకలు స్తంభించాయి. ఈ ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు లోయలో పడి యాత్రికులు మృతిచెందడం పట్ల సిఎం విచారాన్ని తెలిపారు. క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులతో సీఎం మాట్లాడి తెలుసుకున్నారు.

## విద్యార్థులే ఉజ్వల భారత నిర్మాణానికి రూపశిల్పులు







దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి

నాగోల్ భవ్య గ్రామర్ హైస్కూల్‌లో రెండు రోజులు సైన్స్ ఫెయిర్ ప్రారంభం


**ప్రజాపక్షం/రంగారెడ్డి :** విద్యార్థులే ఉజ్వల భారతదేశ నిర్మాణానికి రూపశిల్పులు అని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సతీమణి దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఆమె శుక్రవారం నాగోల్ ఆదర్శనగర్‌లోని భవ్యాస్ గ్రామర్ హైస్కూల్‌లో జరిగిన రెండు రోజుల సైన్స్ ఫెయిర్ 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత కమలా సుధీర్‌రెడ్డి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతలపాటి అరుణ సురేందర్‌నాథ్ యాదవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా నిర్వహిస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు భిన్నంగా నాగోల్‌లోని భవ్యాస్ గ్రామర్ హైస్కూల్ యాజమాన్యం అత్యుత్తమ విద్యాప్రమాణాలు, అత్యున్నతస్థాయి బోధన, మంచి ఫలితాలు అందిస్తూ గొప్ప పేరును సొంతం చేసుకోవడం సంతోషదాయకం అన్నారు. విద్యార్థులలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు వ్యయప్రయాసలను లెక్కచేయకుండా యాజమాన్యం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించడాన్ని కమలా సుధీర్‌రెడ్డి అభినందించారు. అనంతరం పాఠశాలలోని వివిధ తరగతి గదులను సందర్శించి సెకండ్ క్లాస్ మొదలు 10వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన నూతన ఆవిష్కరణల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అన్ని సబ్జెక్ట్‌ల వారీగా ప్రదర్శించిన వివిధ ప్రాజెక్ట్‌లను విద్యార్థులు ముఖ్యఅతిథి కమలా సుధీర్‌రెడ్డికి చక్కగా వివరించగా ఆమె మంత్రముగ్ధులయ్యారు. తెలుగు నెలలు, భాషాభాగాలు, పైథాగరస్ థీరమ్, ఆల్‌జెబ్రాయిక్ ఐడెంటిటీస్, స్క్వేర్స్ అండ్ క్యూబ్స్, టైప్స్ ఆఫ్ యాంగిల్స్, డిస్కవరీ ఎక్స్‌ప్లోర్, దేశాలు వాటి ఫ్లాగ్స్, జీర్ణక్రియ విధానం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, డ్రిప్ ఇరిగేషన్, ఔషధ మొక్కల ఉపయోగాల ప్రాజెక్ట్‌ల గురించి విద్యార్థులు ఆమెకు చక్కగా వివరించడం ఆకట్టుకుంది. సైన్స్ ఫెయిర్‌లో టెన్త్ క్లాస్ స్టూడెంట్ నిత్యశ్రీ ప్రదర్శించిన మూత్రపిండాల వ్యవస్థ పనితీరు విధానాన్ని కమలా సుధీర్‌రెడ్డి ప్రశంసించారు. 'నీవు తప్పనిసరిగా డాక్టర్‌వు అవుతావు' అంటూ ఆమె నిత్యశ్రీని అభినందించారు. ఈ కార్యక్రమంలో భవ్యాస్ గ్రామర్ హైస్కూల్ హెడ్మాస్టర్ అండ్ ప్రిన్సిపాల్ హెచ్.రాజ్యలక్ష్మి, కరస్పాండెంట్ ఏ.జె. హనుమంతరావు, బిట్స్ పిలానీ ప్రొఫెసర్లు ఎన్.రాజేష్, విద్యా రాజేష్, నాగోల్ జెడ్‌పిహెచ్ఎస్ హెడ్‌మిస్ట్రెస్ ఎన్.లక్ష్మీ దేవి పాల్గొన్నారు.

## ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహం కూల్చివేస్తాం

తెలంగాణ ఉద్యమకారుల జెఎసి హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేలాది మంది ఉద్యమకారుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టడం, ప్రభుత్వ లాంఛనాలతో ఆవిష్కరించడం సిగ్గుచేటు అని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి పేర్కొంది. వెంటనే విగ్రహ ఏర్పాటును నిలిపివేయాలని, లేని పక్షంలో విగ్రహం కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు అసెంబ్లీ ఎదుట గల గన్‌పార్క్‌లోని అమరవీరులస్థూపం వద్ద శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల జెఎసి అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనాడూ తెలంగాణ అస్థిత్వం, ఉద్యమకారుల ప్రాణత్యాగాలపై నోరు మెదపని ఆంధ్ర ప్రాంతానికి చెందిన గాయకుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేయడం వలన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మఘోషిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ నాయకులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అమరులైన వీరులను గాలికి వదిలేసి, ఆంధ్ర ప్రాంతానికి చెందిన గాయకుడికి ప్రభుత్వ లాంఛనాలతో విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ యాదగిరి, చంద్రన్న ప్రసాద్, మోహన్ బైరాగి, సుజి, వేముల యాదగిరి, లారా, లలిత, లావణ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## అన్నా హజారే మళ్లీ నిరాహారదీక్ష

### జనవరి 30 నుంచి చేస్తానని ప్రకటన

**న్యూఢిల్లీ :** ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే మరోసారి నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. మహారాష్ట్రలో లోకాయుక్త చట్టం అమల్లో జాప్యం జరుగుతున్నందుకు నిరసనగా వచ్చే ఏడాది జనవరి 30న తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నారు. లోకాయుక్త చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నా హజారే మండిపడ్డారు. ప్రజా సంక్షేమానికి కీలకమైన ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. చట్టం అమలుకు గతంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు. లోకాయుక్త చట్టాన్ని తీసుకురావాలంటూ హజారే 2022లో నిరాహార దీక్ష చేపట్టారు. అయితే, అప్పటి ముఖ్యమంత్రి జోక్యంతో ఆయన దీక్షను విరమించారు. అనంతరం మహారాష్ట్ర అసెంబ్లీ లోకాయుక్త బిల్లుకు ఆమోదం కూడా తెలిపింది.క్షేత్రస్థాయిలో మాత్రం చట్టం అమలు జరగట్లేదని హజారే అన్నారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు 7 లేఖలు రాసినా స్పందన కరువైందని ఆక్షేపించారు. 'ఈ చట్టం ప్రజాసంక్షేమానికిఅవసరం. నేను ఈ విషయంపై ఏడు లేఖలు రాశాను. కానీ అవతలి వైపు నుంచి ఎటువంటి స్పందనా లేదు.

### కరూర్ తొక్కిసలాట ఘటనలో విచారణ కమిషన్ సస్పెన్షన్‌పై

# మా ఆదేశాలు సవరించం

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** కరూర్ తొక్కిసలాటలో 41మంది మృతి చెందిన ఘటనపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్‌ను, సిట్‌ను సస్పెండ్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'ప్రతిదీ న్యాయంగా, నిష్పాక్షికంగా జరగాలని మేం కోరుకుంటున్నాం' అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ దాఖలు చేసిన నివేదికను న్యాయమూర్తులు జె.కె.మహేశ్వరి , విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విమర్శనాత్మకంగా పరిశీలించింది. హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది. ఇలా హైకోర్టులో జరగడం సరైనది కాదు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సెప్టెంబరు 27న నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ తమిళగ వెట్రి కజగం (టివికె) ర్యాలీ సందర్భంగా జరిగిన కరూర్ తొక్కిసలాటపై అక్టోబరు 13న సుప్రీంకోర్టు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ సంఘటన జాతీయ మనస్సాక్షిని కదిలించిందని, న్యాయమైన, నిష్పాక్షికమైన దర్యాప్తునకు అర్హమైనదని పేర్కొంది. స్వతంత్ర దర్యాప్తు కోసం టివికె దాఖలు చేసిన తన ఆదేశంలో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. సిట్, ఏకసభ్య విచారణ కమిషన్ నియామకానికి ఆదేశాలను నిలిపివేసింది. ఈ సంఘటనపై పిటిషన్లను స్వీకరించడం, సిట్ దర్యాప్తునకు ఆదేశించడం, టివికె మరియు దాని సభ్యులను కేసులో పార్టీగా చే యకుండా వారిపై వ్యాఖ్యలు చే యడం పట్ల మద్రాస్ హైకో ర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. సెంథిల్ కుమార్‌ను కూడా ఇది విమర్శించింది. శుక్రవారం విచారణ సందర్భంగా తమిళనాడు ప్ర భుత్వం తరపున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్ తన వాదనలు వినిపిస్తూ రాష్ట్ర కమిషన్ సిబిఐ దర్యాప్తులో జోక్యం చేసుకోదని, అలాంటి సంఘటనలను నివారించేందుకు సిఫార్సులు ఇవ్వడానికి మాత్రమే పరిమితం అవుతుందని వాదించారు. ప్రతిదీ న్యాయ ంగా, నిష్పాక్షికంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం అని ధర్మాసనం విల్సన్‌కు తెలిపింది. కమిషన్ నియామక నోటిఫికేషన్ చదవాలని సూచించింది. విల్సన్, సిద్ధార్థ్ లూథ్రా కూడా రాష్ట్రం తరపున అప్పీల్ చేసుకుని రిజిస్ట్రార్ జనరల్ నివేదిక కాపీని కోరుతూ సమాధానం దాఖలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. కరూర్ తొక్కిసలాట సమస్యపై కె.కె.రమేష్ దాఖలు చేసిన ఒక తాజా పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం నోటీస్ జారీ చేసి, పార్టీల వాదనలు పూర్తి చేయాలని కోరింది. తుది విచారణకు కేసును వాయిదా వేసింది. అక్టోబరు 30న కరూర్ తొక్కిసలాటలో మరణించిన కుటుంబాన్ని అధికారులు బెదిరిస్తున్నారనే ఆరోపణపై సిబిఐను సంప్రదించమని సుప్రీంకోర్టు కోరింది. అక్టోబరు 13న కోర్టు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. టివికె ర్యాలీకి 10,000మంది రావచ్చని అంచనా వేయగా, దాదాపు 27,000మంది హాజరవడంతో తొక్కిలాటకు దారితీసిందని అంతకు ముందు పోలీసులు చెప్పారు. ఏడుగంటల ఆలస్యంతో విజయ్ వేదిక వద్దకు చేరుకున్నారని ఈ ఆలస్యమే తొక్కిసలాటకు దారితీసి 41మంది మృతికి కారణమైందన్నారు.

### పార్లమెంటులో బాగా మాట్లాడారు..

# ప్రభుత్వ కథనాన్ని విచ్ఛిన్నం చేశారు

### కాంగ్రెస్ ఎంపిలకు రాహుల్‌గాంధీ కితాబు




**న్యూఢిల్లీ :** వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటు ఉభయ సభలలో జరిగిన చర్చలలో కాంగ్రెస్ పార్టీ ఎంపిల పనితీరును ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశంసించారు. ప్రభుత్వ కథనాన్ని ప్రతిపక్షం విచ్ఛిన్నం చేసిందని పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుల సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. ప్రభుత్వం రెండు అంశాలపై ప్రతిపక్షాల నుండి ఒత్తిడిలో ఉన్నట్లుగా కనిపిస్తుందని ఈ సమావేశంలో రాహుల్‌గాంధీ అన్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వందేమాతరం, ఎస్ఐఆర్ పై ఉభయ సభల్లో గంభీరమైన చర్చ జరిగిందని, ఈ చర్చలలో తాము వారి కథనాన్ని విచ్ఛిన్నం చేసినట్లు భావిస్తున్నామన్నారు. ఎస్ఐఆర్ చర్చ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కలవరపడ్డారని, పార్లమెంటులో నిందాపూర్వక పదాన్ని కూడా ఉపయోగించారని ఆయన పేర్కొన్నారు. హోం మంత్రి ఒత్తిడిలో ఉన్నాడని, మొత్తం యంత్రాంగం ఓటు చోరీలో ఉందని, అది దేశం మొత్తానికి తెలుసునని, అదే అందుకు కారణమని అని గాంధీ పేర్కొన్నారు.ఇండిగో విమానాల అంతరాయాలు, వాయు కాలుష్యం, కార్మిక కోడ్ల సమస్య వంటి ప్రజల ప్రస్తుత సమస్యలను లేవనెత్తడంలో పార్టీ విజయవంతమైందని ఎంపిల సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్లు లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ అన్నారు. కాంగ్రెస్ చీఫ్ విప్ కె.సురేశ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రతి సమావేశంలోనూ ఎంపిల పనితీరును అంచనా వేయడానికి, వారి అభిప్రాయాలను, అభిప్రాయాలను వినడానికి సమావేశమవుతారని అన్నారు. కాగా ఎంపిల సమావేశంలో శుక్రవారం ఉదయం లాతూర్‌లో మరణించిన మాజీ కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్‌కు సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు.

### మధ్య ప్రాచ్యం నుంచి గత మూడేళ్లలో

# 5,945 మంది భారతీయుల తరలింపు

### పార్లమెంట్‌కు మంత్రి జయశంకర్ వెల్లడి



**న్యూఢిల్లీ :** విదేశాల్లో ఉన్న భారతీయుల రక్షణ, భద్రతను దృష్టిలో పెట్టుకుని గత మూడు సంవత్సరాలలో మధ్యప్రాచ్యంలోనిఇజ్రాయెల్, ఇరాన్, సిరియా, ఇరాక్ నుండి 5,945 మందిని స్వదేశానికి తరలించినట్లు కేంద్రం ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలియజేసింది. 2023 లో ఇజ్రాయెల్‌లో 'ఆపరేషన్ అజయ్', 2025లో ఇరాన్, ఇజ్రాయెల్‌లో 'ఆపరేషన్ సింధు' వంటి ఆపరేషన్‌ల ద్వారా భారతీయులను విదేశాల నుంచి తీసుకువచ్చినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. '2024లో కువైట్‌లో జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 45 మంది భారతీయుల మృతదేహాలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో విమానంలో తరలించింది. ఇందులో ముగ్గురు ఉత్తరప్రదేశ్ పౌరులు కూడా ఉన్నారు' అని ఆయన తెలిపారు. మధ్యప్రాచ్య ప్రాంతంతో సహా ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న ఏవైనా ప్రతికూల పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా, అనవసరమైన ప్రయాణాలను నివారించాలని, స్థానిక అధికారులు జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, ప్రచురించిన హెల్ప్‌లైన్ నంబర్‌లు, ఇతర కమ్యూనికేషన్ విధానాలపై భారత మిషన్లతో సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం సలహాలను జారీ చేస్తుందనారు. అవసరమైన చోట, చిక్కుకున్న భారతీయ పౌరులను సురక్షితంగా తరలించడానికి ప్రభుత్వం పూర్తి ప్రభుత్వ విధానంతో తరలింపు కార్యకలాపాలను ప్రారంభిస్తుందని జయశంకర్ తెలిపారు. ప్రభుత్వం సురక్షితమైన ఆశ్రయం, భోజనం, స్థానిక, సరిహద్దు కదలికలు, రవాణాతో సహా లాజిస్టికల్ ప్రత్యేక వాహనాలు, తరలింపు విమానాలను ఉచితంగా ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రస్తుతం, భారతీయ పౌరుల రక్షమ, భద్రతకు ఏదైనా ముప్పు లేదా మధ్యప్రాచ్య ప్రాంతం నుండి భారతీయ పౌరులను తరలించాల్సిన పరిస్థితి గురించి ఎటువంటి సమాచారం లేదన్నారు.

### ఈ ఏడాది అక్టోబరు నాటికి

# 5,897 భారతీయ మృతదేహాల తరలింపు

**న్యూఢిల్లీ :** విదేశాల్లో పనిచేస్తున్న లేదా నివసిస్తున్న భారతీయ పౌరుల మరణాలకు సంబంధించిన మొత్తం కేసుల సంఖ్య ఇటీవలి కాలంలో తగ్గిందని కేంద్రం ప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ సంవత్సరం అక్టోబర్ నాటికి విదేశాల్లో మృతి చెందిన 5,897 భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలించినట్లు పేర్కొంది. మృతదేహాలను స్వదేశానికి తరలించడానికి పట్టే సమయంపై ప్రభుత్వం డేటాను నిర్వహిస్తుందా అని లోక్‌సభలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను సభ్యులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో జయశంకర్ లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ మరణాలు, స్థానిక దహన సంస్కారాలు/ఖననం, భారతదేశంలోని వారి స్వస్థలాలకు మృతదేహాలను తరలించడం వంటి విదేశాలలో ఉన్న భారతీయ పౌరులను ప్రభావితం చేసే సమస్యలను పరిష్కరించడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. విదేశాల్లో పనిచేస్తున్న లేదా నివసిస్తున్న భారతీయ పౌరుల మరణాలకు సంబంధించిన మొత్తం కేసుల సంఖ్య ఇటీవలి కాలంలో పెద్దగా పెరగలేదన్నారు. 2016 నుండి స్వదేశానికి తరలించిన భారతీయ పౌరుల మృతదేహాల జాబితాను కూడా ఆయన పంచుకున్నారు. ఈ గణాంకాల ప్రకారం ఈ సంవత్సరం అక్టోబర్ వరకు స్వదేశానికి 5,897 మంది భారత పౌరుల మృతదేహాలను తీసుకువచ్చారు. ఇతర సంవత్సరాల గణాంకాలనుకూడాపరిశీలిస్తే...4,167;4,222; 4,205; 5,291; 5,321; 5,834; 5,946; 6,532, 7,096గా ఉన్నాయి. మరణానికి కారణం, మృతదేహాలను ఎక్కడి నుండి తీసుకురవాలనేది, భారతదేశం నుండి వారి ఉంటున్న దేశం దూరం, ఆతిథ్య దేశానికి చెందిన దేశీయ చట్టాలు, మరణించిన వ్యక్తి ఉద్యోగ స్థితి, దేశంలో బంధువుల ఉనికి వంటి అనేక అంశాల ఆధారంగా మృతదేహాలను స్వదేశానికి తరలించడానికి పట్టే సమయం మారుతుందని అన్నారు.

# విమాన టికెట్ల ధరలను ఏడాది పొడువునా నియంత్రించలేం

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ :** ఇటీవల ఇండిగో సంక్షోభం సమయంలోవిమాన చార్జీలు విపరీతంగా పెరిగాయి. దాంతోకేంద్రంప్రభుత్వం రంగంలోకి దిగి టికెట్ల ధరలపైపరిమితిని విధించింది. తాజాగా విమాన చార్జీల నియంత్రణపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. విమాన టికెట్ల ఛార్జీలను ఏడాది పొడువునానియంత్రించలేమని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. పండుగల సమయంలో టికెట్ల ధరల పెరుగుతాయని.. ఛార్జీలపై దేశవ్యాప్తంగా పరిమితి విధించడం ఆచరణాత్మకం కాదని తెలిపారు. నియంత్రణ లేని మార్కెట్ కారణంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని వ్యాఖ్యానించారు. రంగం అభివృద్ధి చెందడానికి నియంత్రణ సడలింపులు జరిగాయన్న ఆయన..అసాధారణవృద్ధినిచూసినఇతర దేశాలునియంత్రణఎత్తివేసిందన్నారు.దాంతో మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. మార్కెట్ డైనమిక్స్ ఆధారంగా ధరలుంటాయని.. అంతిమంగా ప్రయాణిలు అతిపెద్ద లబ్ధిదారులుగా నిలుస్తారన్నారు. విమాన ఛార్జీలపై నియంత్రణ ఎత్తివేయాలని కోరుతూ ఓ సభ్యుడు ప్రైవేట్ మెంబర్ బిల్లుపై స్పందించారు. నియంత్రణ సడలింపు ఆలోచన ఇప్పటికీ కొనసాగుతోందని.. మనం పౌర విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే, ముఖ్యమైన అవసరం ఏమిటంటే.. మరిన్ని కంపెనీలు మార్కెట్లోకి ప్రవేశించగలిగేలా దానిపై నియంత్రణలు తొలగించడమేనన్నారు. మార్కెట్ నియంత్రణ సడలింపు ఉన్నప్పటికీ.. ప్రస్తుత రూపంలో ఉన్న విమాన చట్టం దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్న అసాధారణ పరిస్థితులలో జోక్యం చేసుకుని పరిస్థితిని సరిదిద్దే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఇస్తుందని.. ఇందులో ప్రయాణీకుల నుంచి అసమంజసమైన ఛార్జీలను నివారించడానికి చార్జీలపై పరిమితిని నిర్ణయించడం సైతం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

# భారత పౌరసత్వం వదులుకున్న 9 లక్షల మంది

### కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ:**గత ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ శుక్రవారం పార్లమెంటులో చెప్పారు. భారత పౌరసత్వంపై సభ్యులు అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఆయన ఈ డేటా వెల్లడించారు. భారత పౌరసత్వాన్ని వదులుకొనే వ్యక్తుల వార్షిక రికార్డులను ప్రభుత్వం భద్రపరుస్తోందని తెలిపారు. ఆ రికార్డుల ప్రకారం 2011–2019 మధ్య 11,89, 194 మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. గత 14 ఏళ్లలో భారత్‌లోని 20 లక్షలకు పైగా ప్రజలు తమ పౌరసత్వం వదులుకొన్నట్లు డేటా సూచిస్తోంది. విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నట్లు విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల కాలంలో విదేశీ పౌరసత్వం పొందుతున్న భారతీయుల సంఖ్య మరింత పెరిగిందని, గత ఐదేళ్లలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకొన్నారని కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పేర్కొన్నారు. అలాగే, విదేశాలలో ఉద్యోగాలు చేయాలని కలలు కంటున్న భారత యువతీ యువకులు మోసపూరిత ఉద్యోగ ఆఫర్ల బారిన పడుతున్నారని, గల్ఫ్ దేశాలలో ఉద్యోగాల కోసం భారత యువత నకిలీ గల్ఫ్ ఉద్యోగ ఆఫర్లకు ఆకర్షితులై అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల బారిన పడుతున్నారని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. ఇటీవల ఇటువంటి కేసులు తమ దష్టికి వచ్చాయన్నారు. వీటిలో చాలావరకు సోషల్ మీడియాలో ఉద్యోగ ఆఫర్లను నమ్మడంతోనే మొదలవుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటివి నివారించడానికి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా విదేశాంగ శాఖ యువతకు అవగాహన కల్పిస్తోందన్నారు. నమోదు కాని ఏజెంట్లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగా అక్టోబర్ 2025 నాటికి 3,505 నమోదుకాని ఏజెంట్ల వివరాలను ఇమైగ్రేట్ పోర్టల్‌లో పొందుపరిచామన్నారు.

### దగ్గు సిరప్ అక్రమ రవాణా కేసులో...

# యుపిలో ఇడి సోదాలు

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో అక్రమంగా దగ్గు సిరప్ రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం అనేక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఉదయం 7:30 గంటలకు ప్రారంభమైన ఈ సోదాలు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, వారణాసి, జౌన్‌పూర్, సహరాన్‌పూర్‌లోని 25 ప్రాంగణాలతో పాటు రాంచీ (జార్ఖండ్, అహ్మదాబాద్ (గుజరాత్)లలో జరుగుతున్నాయి. కోడైన్ ఆధారిత దగ్గు సిరప్‌ల (సిబిసిఎస్) అక్రమ తయారీ, వ్యాపారం, రవాణాపై దర్యాప్తు చేయడానికి ఇడి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద క్రిమినల్ కేసు నమోదు చేసింది. వీటిలో బంగ్లాదేశ్‌లోకి అనుమానిత సరిహద్దు అక్రమ రవాణా కూడా ఉంది. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు శుభం జైస్వాల్, అతని సహచరులు అలోక్ సింగ్, అమిత్ సింగ్‌లతో పాటు కొంతమంది దగ్గు సిరప్ తయారీదారులు, చార్టర్డ్ అకౌంటెంట్ విష్ణు అగర్వాల్‌లకు సంబంధించిన ప్రదేశాల్లో సోదా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిబిసిఎస్ విస్తృత దుర్వినియోగం, అక్రమ రవాణాను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన తర్వాత ఉత్తరప్రదేశ్ పోలీసులు నమోదు చేసిన దాదాపు 30 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఏజెన్సీ ఈ చర్య తీసుకుంది. ఇడి అధికారుల ప్రకారం.. ఈ కేసులో నేరం ద్వారా వచ్చిన ఆదాయం సుమారు రూ. 1,000 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. కాగా, శుభమ్ జైస్వాల్ దుబాయ్‌కు పారిపోయినట్లు భావిస్తున్నారు. అతని తండ్రిని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు చేయడానికి పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు.


## త్వరలో సిఎంగా డికె శివకుమార్

### కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్

**బెళగావి:** కర్నాటకలో 'విందు' రాజకీయం జోరుగా సాగుతోంది. ఈ మధ్యనే సీఎం, డిప్యూటీ సీఎం ఉదయం అల్పాహారం కోసం కలుకొని తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఒక్కటిగా ముందుకెళతామని సందేశమిచ్చారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఎమ్మెల్యేలు అందరికీ రాత్రి విందు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ త్వరలో బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం జోరందుకున్నది. ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా ఇదే విషయం చెప్పడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరినట్లు అయింది. శివకుమార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ శీతాకాల సమావేశాల తర్వాత డీకే శివకుమార్ సీఎం అవుతారని ప్రకటించారు. 'విందుపై విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఎమ్మెల్యేలంతా ఒక చోటు కలుకోవడమన్నది అరుదు, అంతా కలిసి భోజనం చేశా. విందులో పాల్గొన్నంత మాత్రానా బల ప్రదర్శన అయిపోదుగా!' అని ఇక్బాల్ అన్నారు. శివకుమార్ సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారా అన్న ప్రశ్నకు అందరం మిత్రులమే అని ఆయన సమాధానమిచ్చారు. శివకుమార్ శుభవార్త ఏమైనా చెప్పారా అని అడిగితే 'నేను మీకు శుభవార్త చెబుతాను. డీకే శివకుమార్ ఈ అసెంబ్లీ సమావేశాల తర్వాత సీఎం అవుతారు' అని ఇబ్బాల్ అన్నారు. శివకుమార్‌ను అవకాశం వరిస్తుందని దీమాగా చెప్పారు. అదృష్టముంటేనే సీఎం అవుతారన్నారుగా అని ఓ విలేకరి ప్రశ్నించగా 'దైవాజ్ఞ లేకుండా ఏ పని జరగదు. శివకుమార్ శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుందన్న నమ్మకం ఉంది. ఆయన పడిన కష్టాన్ని గుర్తించి తగు విధంగా నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానానికి చెప్పాం' అని అన్నారు. శివకుమార్ విందుకు సమారు 5055 మంది హాజరయ్యారని ఇక్బాల్ తెలిపారు.

### ఎమ్మెల్యేలతో 'రాజకీయ విందు సమావేశం'

# వార్తలు అసత్యం : డికె శివకుమార్



**బెళగావి (కర్ణాటక) :** కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. శాసనసభ్యులతో రాజకీయ విందు సమావేశం జరిగిందనే వార్తలను శుక్రవారం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కొట్టిపారేశారు. తన పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, పార్టీ సహచరుల ప్రేమతోనే ముందుకు సాగిందని ఆయన నొక్కిచెప్పారు. ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సహా దీర్ఘకాల సహచరుల నుండి తనకు తరచుగా అనధికార భోజన ఆహ్వానాలు అందుతాయని, రాజకీయ పార్టీ ఉద్దేశంతో చూడకుండా మర్యాదపూర్వకంగా స్వీకరిస్తూ వాటికి హాజరవుతుంటానని స్పష్టం చేశారు. 'ఈ ప్రాంతం నుండి స్నేహితులు నన్ను ఆప్యాయంగా భోజనానికి లేదా విందుకు ఆహ్వానిస్తుంటారు. నేను వాటిని ఎలా నిరాకరించగలను ?. ఇది విందు సమావేశం కాదుకానీ నేను ఆహ్వానించబడిన వారితో వెళ్లాలి'. బెళగావి శివార్లలో శాసనసభ్యులతో విందు గురించి ప్రత్యేకంగా అడిగినప్పుడు శివకుమార్ ఆ ప్రశ్నకు సమాధానమిస్తూ మా నియోజకవర్గం నుంచి ఇక్కడ పనిచేస్తున్న ఒక అబ్బాయి మాట్లాడుతూ 'మధ్యాహ్న భోజనం కోసం 'తాను ముద్దే, ఉప్సారు' పంపుతానని చెప్పారు. కానీ నేను దానిని తిరస్కరించాను. ఒక రోజు అనంతరం ఆసిఫ్ సైత్, ఫిరోజ్ సైత్ నన్ను ఆహ్వానించారు.' పార్టీలోని దీర్ఘకాలిక నాయకులు,స్నేహితులకు కూడా విస్తృత ఆహ్వానాలు అందాయన్నారు. 'దొడ్డన్నవర్ బెళగావి జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మాత్రమే కాదు నాకు స్నేహితుడు కూడా. ఆయన చాలా కాలంగా నన్ను అతడి ఇంటికి డిన్నర్‌కు ఆహ్వానిస్తున్నాడు. అలాంటప్పుడు నేను నా కాంగ్రెస్ కుటుంబాన్ని మర్చిపోవాలా? అందుకే నేను, కొంతమంది అక్కడికి డిన్నర్‌కు వెళ్లాం. అది డిన్నర్ సమావేశం కాదు' అని శివకుమార్ చెప్పారు. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లకు అనుమతిచ్చే అంశంపై ఉప ముఖ్యమంత్రి శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరు నగర ప్రతిష్ఠను కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. భద్రతా ఏర్పాట్లను నిర్ధారించడంలో హోం మంత్రి జి.పరమేశ్వర చాలా జాగ్రత్తగా ఉన్నారని ఆయన చెప్పారు. 'తగినంతగా చూసుకునేలా బాధ్యత హోంమంత్రికి ఇవ్వబడింది.మ్యాచ్‌ల సమయంలో ముందు జాగ్రత్త చర్యలు కె.ఎస్.సి.ఎ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, అతడి బృందం పోలీస్ విభాగంతో చర్చించారు' అని శివకుమార్ చెప్పారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

నెం. CEE/P/SC-2x25kV-OHE-KMT-DKJ- BDCR-2025-26-01 తేదీ: 11.12.2025 PUB/1587

భారత యూనియన్ రాష్ట్రపతి తరపున, సికింద్రాబాద్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) కింది పనుల కోసం (ఆన్‌లైన్) ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు:

**టెండర్ నెం.:-** 2x25kV-OHE-KMT-DKJ-BDCR, తేదీ. 10/12/2025. **పని వివరణ:** 'దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్‌లోని ఖమ్మం (KMT) (మినహాయించి) - డోర్నకల్ (DKJ) (మినహాయించి) - భద్రాచలం రోడ్ (BDCR) (కలిపి) సెక్షన్‌లో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనులతో సహా, ఇప్పటికే ఉన్న 1x25kV సిస్టమ్‌ను 2x25kV AT ఫీడింగ్ సిస్టమ్‌గా OHE అప్‌గ్రేడ్ చేయడానికి డిజైన్, సరఫరా, నిర్మాణం, పరీక్ష మరియు ప్రారంభోత్సవ పనులు. మొత్తం 78 RKM/101 TKM'. **సుమారు విలువ: (రూ.)** 503751882.87. ముందస్తు **ఆన్‌లైన్‌లో చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము: (రూ.)** 2668800.00. **టెండర్ ఫారం ధర: (రూ.)** ఏమీ లేదు. **పనుల పూర్తి కాలం:** 15 నెలలు. **టెండర్ తెరిచే ప్రదేశం:** సికింద్రాబాద్.

1. ఇ-టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్ ముగింపు: సమయం: 15.00 గంటలు, తేదీ: 28/01/2026
2. ఇ-టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్ ప్రారంభం: సమయం: 15.30 గంటలు, తేదీ: 28/01/2026

టెండర్ తెరిచే తేదీ తర్వాత ప్రకటించిన సెలవుదినం అయినట్లయితే, టెండర్లు తదుపరి పనిదినం నాడు నిర్ణీత సమయంలో తెరవబడతాయి.
టెండర్ షరతులు/ వివరాలు మరియు టెండర్లను సమర్పించడానికి, దయచేసి మా వెబ్‌సైట్ **www.ireps.gov.in** ను సందర్శించండి.
**గమనిక:** టెండర్ పత్రాలకు ఏవైనా మార్పులు/ సవరణలు/ అదనపు చేర్పులు అవసరమైతే, అవి పై వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయి.
**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సికింద్రాబాద్**

**ఇ-టెండర్ ఆహ్వాన ప్రకటన (https://ireps.gov.in ద్వారా)** PUB/1588

CE/C/Plg&Sy/SC, CE/C-VI/SC & CE/C-II/SC నిర్మాణ సంస్థ, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, వరుసగా, భారత రాష్ట్రపతి తరపున ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నాయి:

NIT No : 32-CAO-C-SC-2025 తేదీ: 05/12/2025 **పని పేరు:** SCR నిర్మాణ సంస్థ: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ డివిజన్‌లోని నిజామాబాద్ స్టేషన్‌లో ఆర్‌బిజి భవనం, గూమ్టీ భవనం, అధికారులు మరియు సూపర్వైజర్ల విశ్రాంతి గృహం మరియు సిబ్బంది క్వార్టర్లు మొదలైన వాటి ప్రతిపాదిత నిర్మాణం. **అంచనా వ్యయం: (రూ.)** 22,00,28,684.20 **ఇఎండి: (రూ.)** 12,50,200.00 **పూర్తి చేయు కాలం:** 18 (పద్దెనిమిది) నెలలు. **టెండర్లు తెరిచే తేదీ:** 30/12/2025 15:00 గంటలకు

2. **NIT No:** EPC 12-CAO-C-SC-2025 తేదీ: 08/12/2025 **పని పేరు:** SCR నిర్మాణ సంస్థ: తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్-ధోన్ సెక్షన్ డబ్లింగ్ పనులకు సంబంధించి గద్వాల్ స్టేషన్ నుండి ఆలంపూర్ రోడ్ స్టేషన్ మధ్య ట్రాక్ డబ్లింగ్, విద్యుదీకరణ మరియు సిగ్నలింగ్ పనులతో సహా ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు నిర్మాణం (EPC) కాంట్రాక్ట్. **అంచనా వ్యయం: (రూ.)** 562,70,49,413.00 **ఇఎండి: (రూ.)** 2,00,00,000.00 **పూర్తి చేయు కాలం:** 30 (ముప్పై) నెలలు. **టెండర్లు తెరిచే తేదీ:** 06/03/2026 15:00 గంటలకు

3. **NIT No:** EPC10-CAO-C-SC-2025 తేదీ: 06/12/2025 **పని పేరు:** తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మోటుమర్రి-విష్ణుపురం డబ్లింగ్ పనులకు సంబంధించి, విద్యుదీకరణ మరియు సిగ్నలింగ్ పనులతో సహా, సంత్ సేవాలాల్ మహారాజ్ నుండి విష్ణుపురం స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ డబ్లింగ్ కోసం దక్షిణ మధ్య రైల్వే (నిర్మాణ సంస్థ) - ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు కన్‌స్ట్రక్షన్ (EPC) కాంట్రాక్ట్. **అంచనా వ్యయం: (రూ.)** 439,45,79,122.92 **ఇఎండి: (రూ.)** 2,00,00,000.00 **పూర్తి చేయు కాలం:** 24 (ఇరవై నాలుగు) నెలలు. **టెండర్లు తెరిచే తేదీ:** 05/03/2026 15:00 గంటలు

i) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి **https://ireps.gov.in** వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.
ii) టెండరర్లు టెండర్ సమర్పణ కాలంలో తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు, ఇది టెండర్ ముగింపు తేదీకి పదిహేను రోజుల ముందు ప్రారంభమవుతుంది.
iii) టెండరర్లు టెండర్ సమర్పణ కాలం ప్రారంభమయ్యే తేదీ వరకు జారీ చేయబడే ఏవైనా సవరణల కోసం (కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.
**చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/నిర్మాణం/ సికింద్రాబాద్**

**టెండర్ నెం. 31-PA -25-26-Sr.DEE-M-HYB, 32-GSU-25-26-Sr.DEE-M-HYB** PUB/1589

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు Sr.DEE/M/HYB, ఈ క్రింది టెండర్లకు వ్యతిరేకంగా ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. టెండర్లు ముగింపు తేదీ: 06-01-2026, 15:00 గంటలు. బిడ్డర్లు తమ అసలైన/ సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఇ-టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు అటువంటి ఏ మాన్యువల్ ఆఫర్ స్వీకరించబడినా అది పరిగణించబడదు.

**1. పని వివరణ: టెండర్ నెం. 31-PA-25-26 -Sr.DEE-M-HYB:** హైదరాబాద్ డివిజన్: - 1) BSX- గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా కొత్త హోల్డింగ్ ఏరియా అభివృద్ధిలో భాగంగా PF నెం 4, షెల్టర్ (COP), రిటైనింగ్ వాల్ ఏర్పాటు మరియు ఇప్పటికే ఉన్న FOBని PF 4 వరకు పొడిగించడం - విద్యుత్ ఏర్పాట్లు. 2) SC-MUE సెక్షన్: a) NZB వద్ద PF1పై 25 మీటర్ల పొడవున మరియు PF2/3పై 160 మీటర్ల పొడవున, b) KMC వద్ద PF1పై 300 మీటర్ల పొడవున మరియు PF2/3పై 200 మీటర్ల పొడవున, c) BSX వద్ద PF1పై 210 మీటర్ల పొడవున మరియు PF2పై 160 మీటర్ల పొడవున COP ఏర్పాటు - విద్యుత్ ఏర్పాట్లు. 3) HYB డివిజన్లోని 16 హాల్ట్ స్టేషన్లలో (HG - 2/3) దివ్యాంగుల సౌకర్యాల ఏర్పాటు మరియు 12 SG-3 స్టేషన్లలోని మరుగుదొడ్ల ఉన్నతీకరణ - విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు వ్యయం: (రూ.)** 3,84,29,392/- **EMD: (రూ.)** 3,42,200/- **పూర్తి చేయు కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 06-01-2026

**2. పని వివరణ: టెండర్ నెం. 32-GSU-25-26-Sr.DEE-M-HYB :** హైదరాబాద్ డివిజన్: 1) SC-MUE సెక్షన్: సీతాఫల్‌మండి B-మల్కాజిగిరి-క్యావల్రీ బ్యారక్స్- బోలారం ఆటో సెక్షన్లలో ట్రాక్ సర్క్యూట్‌ను మల్టీ సెక్షన్ డిజిటల్ యాక్సిల్ కౌంటర్‌తో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 2) VDI, GWD, KQQ, WPR, MQN & BDHN స్టేషన్లలోని మొత్తం స్టేషన్లో లూప్ లైన్లలోని అనలాగ్ యాక్సిల్ కౌంటర్ను MSDACతో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 3) సీతాఫల్‌మండి A-కాచిగూడ - ఫలక్‌నుమా ఆటో సెక్షన్లలో ట్రాక్ సర్క్యూట్‌ను MSDAతో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 4) 16 ఇంజనీరింగ్ ఇంటర్‌లాక్డ్ LC గేట్ల వద్ద మెకానికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బ్యారియర్ను ఎలక్ట్రికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బ్యారియర్‌తో భర్తీ చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. 5) వాడియారం మరియు మాసాయిపేట స్టేషన్ల మధ్య KM. 0/04-06 వద్ద చేగుంట-మెదక్ రోడ్డుపై రెండు లేన్ల ట్రాఫిక్ కోసం LC నెం:228 T స్థానంలో KM 555/03-04 వద్ద బ్రిడ్జ్ నెం: 636A (ROB) నిర్మాణ ప్రతిపాదన - విద్యుత్ ఏర్పాట్లు. 6) JKM-BDHN: JKM-BDHN స్టేషన్ల మధ్య RUB ఏర్పాటు చేయడం ద్వారా KM 17/900 - 18/0 వద్ద ఉన్న మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్ గేట్ నెం 17/JBని తొలగించడం - విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు వ్యయం: (రూ.)** 1,07,93,923/- **EMD: (రూ.)** 2,04,000/- **పూర్తి చేయు కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 06-01-2026

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in
టెండర్ పూర్తి వివరాలు చూడగలిగే నోటీస్ బోర్డు స్థానం: సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/M/HYB కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్- 500071
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/M/ హైదరాబాద్
A2016

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# ప్రజాపక్షం

శనివారం, 13 డిసెంబరు

## మోదీ–ట్రంప్ సంభాషణ

భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చాలాకాలం తర్వాత గురువారం టెలిఫోన్ సంభాషణ ద్వారా ఉభయ కుశలోపరి ముచ్చటించుకున్నారు. జనవరిలో ట్రంప్ రెండవ అధ్యక్ష పదవీకాలానికి పదవీ ప్రమాణం స్వీకరించిన దరిమిలా మోదీ వాషింగ్టన్ వెళ్లి శుభాకాంక్షలు తెలిపి, శుభాసంభాషణలు జరిపి వచ్చిన తదుపరి ట్రంప్ తమ వాణిజ్య భాగస్వాములుగా ఉన్న పలు దేశాలనుంచి దిగుమతులపై సుంకాల విధింపు ఇబ్బడిముబ్బడి పెంచినపుడు తమ ''వ్యూహాత్మక భాగస్వామి''గా భావించే భారత్‌ను విడిచిపెట్టలేదు. భారత్ వాణిజ్య మిగులు, భారత్‌లో అమెరికా నుంచి దిగుమతులపై అధిక సుంకాలు ఎత్తిచూపుతూ భారత్‌నుంచి దిగుమతులపై సుంకాలను 25 శాతానికి పెంచారు. రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని సాకుగా చూపి రష్యానుంచి ముడిచమురు దిగుమతిపై తాము విధించిన ఆంక్షలను భారత్ పాటించకుండా దిగుమతి చేసుకుంటున్నదంటూ ట్రంప్ మరో 25 శాతం సుంకం విధించారు. దక్షిణాఫ్రికా తర్వాత భారత్‌పైనే ట్రంప్ ఇంత భారీగా సుంకం విధించారు. భారత్ ఆ ఒత్తిడికి తలొగ్గకపోవటంతో ఇరు దేశాల సంబంధాల్లో ఉద్రిక్తత ప్రవేశించింది. రెండోవైపున, తమ పాలపదార్థాలు, జన్యుమార్పిడి వ్యవసాయోత్పత్తులకు తమ మార్కెట్ తెరిచేందుకు భారత్ అంగీకరించకపోవటంతో భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. విరామాలతో పలుదఫాలు చర్చలు జరిగినా ప్రతిష్టంభన తొలగిపోలేదు. అయితే తెరవెనుక చర్చల్లో అనేక వివాదాంశాలు పరిష్కారమైనట్లు చెప్పబడుతున్నది. ''భారత్ మున్నెన్నడూలేనంత ఉత్తమ ప్రతిపాదనలు చేసింది'' అని యుఎస్ వాణిజ్య ప్రతినిధి జమీసన్ గ్రీర్ ఈ వారంలో సెనేట్ అప్రోప్రియేషన్ సబ్ కమిటీకి చెప్పటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ యుఎస్ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్, భారత్‌తో ఒప్పంద ముఖ్య సంప్రదింపుదారు బ్రెండన్ లించ్ ఢిల్లీ వచ్చి వాణిజ్య ఒప్పందంపై జరుపుతున్న చర్చల్లో పురోగతి సాధించినట్లు చెప్పబడుతున్న సందర్భంలో ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. 'X'లో మోదీ పోస్టు ప్రకారం ట్రంప్‌తో ఎంతో సుహృద్భావంతో ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను చర్చించారు. భారత్–అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతున్న తీరుపట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వాణిజ్యం, క్లిష్టమైన టెక్నాలజీలు, ఇంధనం, రక్షణరంగం, భద్రత గూర్చి నేతలిరువురూ అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నారు.

దౌత్య పరిభాషలోని ఈ పదాలన్నీ భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం దిశలో పెద్ద పురోగతి జరిగినట్లు, త్వరలో సంతకాలు జరగవచ్చునని భావించవచ్చు. వివరాలు వెల్లడైతేగాని భారత్ మార్కెట్ ద్వారాలు ఎంతమేరకు తెరుస్తారో, దాని పర్యవసానాలేమిటో విదితం కాదు. అప్పుడైనా ట్రంప్ సుంకాలు ఎంత తగ్గిస్తారో వేచిచూడాలి. భారత్ మరిన్ని రాయితీలిస్తుందో చూడాలి.

స్థూలంగా చూస్తే భారత్, అమెరికా సంబంధాలు అన్ని రంగాల్లో బలంగానే కొనసాగుతున్నాయి. ట్రంప్ ఒత్తిళ్లన్నీ తమ దేశానికి లాభసాటి అయిన వాణిజ్య ఒప్పందం సాధించటం. ఒకవైపు వాణిజ్య చర్చలు తుది దశలో ప్రవేశించాక కూడా ఆయన గతవారం భారత్‌నుంచి బియ్యం దిగుమతులపై సుంకాల పెంపుదల కొరడా ఝుళిపించారు. భారత్ టెక్కీలకు హెచ్1బి తదితర వీసాల కుదింపు గొడవ అలాగే ఉంది. అంతేగాక, అమెరికా పౌరసత్వం కోసం మిలియన్ డాలర్ల గోల్డ్‌బాండ్ జారీ అమలును మొన్ననే మొదలెట్టారు. రెండోవైపున, భారత్ కూడా అమెరికాతో బహుముఖ సంబంధాల ప్రాధాన్యత తగ్గించలేదు. అయితే దక్షిణ గోళ బ్రిక్స్, ఎస్‌సిఒ వంటి బహుళపక్ష వేదికల్లో చురుకుగా పాల్గొనటం, రష్యా, చైనాలతో సంబంధాలు మెరుగుపరచుకోవటం ద్వారా తమ ''వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని'' ప్రకటిస్తూ ట్రంప్‌కు ఇబ్బందికరమైన సంకేతాలు పంపింది. భారత్‌తో రెండు దశాబ్దాలపాటు ఎంతో శ్రమించి నిర్మించిన సంబంధాలను చెడగొట్టిన అధ్యక్షునిగా ట్రంప్ చరిత్రలో మిగిలిపోతారంటూ ఆయన అంతర్గతంగా ప్రభుత్వంలోనుండి, పార్టీలోనుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణకు సంకేతంగా ప్రధాని మోదీతో సంభాషించాలని ట్రంప్ కోరుకుని ఉంటాడు. అమెరికాతో సంబంధాల్లో ఇబ్బందులు తొలగించుకోవటం ద్వారా వాణిజ్య వర్గాల్లోని అసంతృప్తిని తొలగించుకునే ఆసక్తితో ఉన్న నరేంద్రమోదీ వాణిజ్య ఒప్పందంపై కొన్ని సడలింపులు ఇచ్చి ఉంటారు. దాంతో ట్రంప్–మోదీ మధ్య ఐస్ కరిగింది. సంభాషణల పునరుద్ధరణ జరిగింది. దేశానికి మేలు జరిగితే ఇది మంచి పరిణామమే.

# కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ఏదీ రక్షణ?

## ఉన్న హక్కులు ఊడగొట్టి పరిశ్రమలకు దాసోహం చేయిస్తున్న లేబర్‌కోడ్

**డాక్టర్ అరుణ్‌మిత్రా**

వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత చాలాకాలంగా ఆరోగ్య కార్యకర్తలు, కార్మికసంఘాలకు తీవ్రమైన ఆందోళనకర అంశంగా వుంది. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవ కాలంలో బాలల చేత సైతం పొగగొట్టాలు శుభ్రం చేయించారు. ప్రమాదభూయిష్టమైన పరిశ్రమల్లో పని చేయించారు. పర్యవసానంగా అనేకమంది తీవ్రమైన జబ్బులపాలైనారు, పిన్నవయస్సులోనే మృత్యువాతపడ్డారు. అక్కడి నుండి ఇంగ్లండ్ చాలా ముందుకు ప్రయాణించింది. పిల్లలందరూ బడికి వెళ్లాలి, వారికి సవ్యమైన పౌష్టికాహారం అందించాలి, వారికి అవసరమైన ఆరోగ్యసంరక్షణను అందించాలి అనే దిశలో ఆ ప్రయాణం సాగింది. మనదేశంలో దీన్ని సాధించటానికి మనం ఎంతో దూరంలో ఉన్నాం.

2007లో జెనీవాలో జరిగిన ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ 60వ సమావేశం, ''కార్మికుల ఆరోగ్యం : ప్రపంచ కార్యాచరణ ప్రణాళిక''ను రూపొందించింది. ''కార్మికులు ప్రపంచ జనాభాలో సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్థిక, సామాజికాభివృద్ధికి ప్రధానమైన దోహదకారులు. అయితే వారిలో కొద్దిమందికి మాత్రమే వృత్తిసంబంధ ఆరోగ్య సేవలు అందుతున్నాయి అని అది గుర్తించింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సంభవిస్తున్న మొత్తం మరణాలలో 20లక్షల 2వేలు లేదా 3.6 శాతం వృత్తి సంబంధ ప్రమాదాలలో లేదా వ్యాధులతో సంభవిస్తున్నట్లు ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఒ) అంచనా వేసింది. ఇండియన్ పాపులేషన్ క్లాక్ (జనాభా గడియారం) ప్రకారం మనదేశంలో ప్రతి సంవత్సరం 97లక్షల మరణాలు సంభవిస్తున్నాయి. వాటిలో దాదాపు 48000 మంది కార్మికులు లేదా మొత్తం మరణాలలో 4.8 శాతం వృత్తి సంబంధమైన ప్రమాదాల్లో మరణిస్తున్నారు. కార్మిక మరణాల్లో 24.20 శాతం నిర్మాణాల రంగంలో ఉన్నాయి. సవ్యమైన నిరోధన, రిపోర్టింగ్, తనిఖీ పద్ధతులను పాటిస్తే ఆ విషాదాలలో అనేకం నివారించటం సాధ్యం.

భారతదేశంలో శ్రామికవర్గం రమారమీ 54కోట్ల మంది. వారిలో దాదాపు 3 శాతం ప్రభుత్వ డిపార్టుమెంట్లలో, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఉన్నారు. వారు మాత్రమే సామాజిక భద్రత కింద ఉన్నారు. మిగతా శ్రామికశక్తిలో కొద్ది సంఖ్య మాత్రమే నియతరంగంలో ఉండగా, విస్తారమైన మెజారిటీ – 93శాతం అనియతరంగంలో ఉన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వరంగం ఉద్యోగులు పోను, మొత్తం శ్రామికశక్తిలో సుమారు 11 శాతం మాత్రమే సామాజిక భద్రత పథకాల వర్తింపు కింద ఉన్నారు. అందువల్ల వృత్తి సంబంధమైన భద్రత అత్యంత ప్రాధాన్యత గల సమస్యగా ఉంది.

కార్యకలాపాల్లో వివిధ రంగాల మధ్య సమన్వయం ఏర్పాట్లను అభివృద్ధి చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ) సూచించింది. ఇది చాలా ముఖ్యం – ఎందుకంటే ఆరోగ్యంపై ప్రభావం వివిధ రంగాల్లో భిన్నంగా ఉంటుంది. గని త్రవ్వకాల్లో పనిచేసేవారు వారి చుట్టూ వ్యాపించి ఉన్న పదార్థాన్ని పీల్చుకోవటం వల్ల ఎక్కువగా జబ్బులపాలవుతుంటారు. అణుశక్తి పరిశ్రమలోనివారు ప్రమాదకరమైన అణుధార్మికత ప్రభావానికి గురవుతుంటారు. ఆసుపత్రి కార్మికులు అంటువ్యాధులు పాలవుతుంటారు. నిర్మాణాల రంగంలోని కార్మికులు ఎక్కువగా బాధించే గాయాల పాలవుతుంటారు. కుట్టుపనివారు వృథా మెటీరియలు, విషప్రభావం గల గ్యాస్‌లకు గురవుతుంటారు. ఆ ప్రకారం ప్రమాదాల నిరోధన, చికిత్స, పరిహారం పద్ధతుల్లో కూడా వ్యత్యాసం ఉంటుంది. ఆర్థిక కార్యకలాపాల్లోని అధిక రిస్క్ రంగాల్లో పనిచేసే కార్మికుల పట్ల, యువకులు, వృద్ధుల పట్ల, వికలాంగులు, వలస కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధవుంచాలి. మహిళల సమస్యలను ప్రత్యేకించి పరిగణనలోకి తీసుకోవాలి.

2025 నవంబర్ 21న నోటిఫై చేసిన ''వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం మరియు పనిపరిస్థితులపై లేబర్ కోడ్, 2020'' కార్మికుల భద్రతకు సంబంధించిన వివిధ క్లాజులను పూర్తిగా తొలగించింది. సమర్థవంతంగా అమలు చేయటం, శ్రామిక శక్తిలోని విస్తృత విభాగాలకు కవరేజి ఇవ్వటానికి సంబంధించిన ప్రాథమిక సమస్యలను చేపట్టటంలో అది విఫలమైంది. ఫ్యాక్టరీలు, గనులు, రేవులు, నిర్మాణాలు, రవాణా, తోటలు, కాంట్రాక్టు కార్మికులు, వలసకార్మికుల వంటి అనేక రంగాల్లో భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించి గతంలో ఉన్న 13 కేంద్ర చట్టాలను కలగలిపి ఈ కోడ్ రూపొందించారు. ఆ విధంగా ప్రతి ఒక్క రంగానికి ఉండే నిర్దిష్టమైన పరిస్థితులను విస్మరించారు.

మొత్తం దుకాణాలు/కార్మికుల్లో 93 శాతం నాన్–రిజిస్టర్డ్ సంస్థల్లోనే ఉంటారు. వాటిలో పనిచేసే కార్మికుల సమస్యలను లేబర్‌కోడ్ దాటవేసింది. అప్రెంటీస్‌లు /ట్రైనీలు సహా–ఉపాధి స్వభావం ఏదైనప్పటికీ కార్మికులందరికీ కోడ్ వర్తింపజేయాలి. వ్యవసాయ కార్మికులు, గృహ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఉప్పుతయారీ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఫారెస్టు వర్కర్స్, ఐటి వర్కర్స్, కొరియర్ వర్కర్స్, అంగన్‌వాడీ వర్కర్స్ వగైరా ఇతర కేటగిరీ కార్మికులను కోడ్ దాటవేసింది.



ఇంతకు క్రితం రంగాలవారీ ఉన్న నిర్దిష్టమైన చట్టాలను – ఫ్యాక్టరీ యాక్ట్, మైన్స్ యాక్ట్, కాంట్రాక్టు లేబర్ యాక్ట్, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం వగైరా చట్టాల్లో ఉన్న బహుముఖమైన లీగల్ భద్రతలను ఓఎస్‌హెచ్ కోడ్ బలహీనపరిచింది. కొత్త చట్టం యజమానులకు వెసులుబాటుయిస్తూ, కార్యికులకు స్పష్టమైన అమలు చేయాల్సిన హక్కులను హరిస్తున్నది. అంతేగాక 10మంది ఆ పైగా కార్మికులున్న ఫ్యాక్టరీలకే ఈ కోడ్ వర్తిస్తుంది. ఇది చిన్న సాంకేతిక మార్పుగా కనిపించవచ్చుగాని కార్మికుల కవరేజి విషయంలో పెద్ద మార్పు తెస్తుంది. మన జౌళి, గార్మెంట్, మెటల్, హోసిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్స్‌లో 10 లేదా 20 మంది పనిచేసే యూనిట్లే అత్యధికం. ఈ కార్మికుల సంఖ్యను పెంచటం వల్ల చిన్న, సూక్ష్మ యూనిట్లలో పనిచేసే లక్షలాది మంది చట్ట రక్షణ కోల్పోతారు.

లేబర్ ఇన్‌స్పెక్టర్ మెకానిజం నీరుగారింది. వారిని ''ఇన్‌స్పెక్టర్లు–కం–ఫెసిలిటేటర్లు'' అని నామకరణం చేశారు. లేబర్ చట్టాలను కచ్చితంగా అమలు చేసేటట్లు చూడాల్సిన వారి పాత్ర 'దోహదకారులు' స్థాయికి దిగజారింది. అంటే సలహాలిస్తారన్నమాట. దీంతో తనిఖీ అర్థరహితమవుతోంది.

రంగంవారీ ఉన్న నిర్దిష్టమైన రక్షణలను కోడ్ నీరుగార్చింది. ఇంతకుముందు రంగంవారీ కార్మికులకు నిర్దిష్టంగా – ప్లాంటేషన్ లేబర్ చట్టం, బీడీ అండ్ సిగార్ వర్కర్స్ చట్టం, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ చట్టం, డాక్ వర్కర్స్ చట్టం – ఆ రంగం స్వభావాన్ని బట్టి పనిగంటలు, సంక్షేమం, గృహవసతి, వైద్య సంరక్షణ, భద్రత వంటి అంశాలపై ప్రత్యేకంగా చట్టాలున్నాయి. ప్రస్తుత లేబర్‌కోడ్ వీటన్నిటినీ కలిపివేసి సర్వసాధారణ చట్టంలోకి తెచ్చింది. సాధకబాధకాలపై ఫిర్యాదు, పరిష్కారం యంత్రాంగాన్ని నీరుగార్చింది.

సుదీర్ఘమైన పనిగంటలు, వెసులుబాటుతో కూడిన వర్క్‌షిఫ్టుల విషయంలో నిబంధనలు బలంగా ఉన్నాయి. ఒఎస్‌హెచ్ కోడ్ 48 గంటల పనివారాన్ని అలాగే వుంచినా, రాష్ట్ర డ్రాఫ్టులు, రూల్సు 12 గంటల రోజు షిఫ్ట్ అనుమతిస్తున్నాయి. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం ఛాంపియన్ చేస్తున్న ఎన్నో పోరాటాలు, త్యాగాలతో కార్మికవర్గం సాధించుకున్న 8 గంటల పని దినాన్ని ఇది వెనక్కు కొడుతున్నది. ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణ మూర్తి 70 గంటల పనివారాన్ని ప్రతిపాదించటం (బహుశా ప్రభుత్వం ప్రోత్సాహంతో కావచ్చు)లో ఆశ్చర్యం లేదు. సుబ్రహ్మణ్యం మరింత ముందుకెళ్లి 90 గంటల పనివారాన్ని ప్రతిపాదించారు. మన శరీర వ్యవస్థలు వరుసగా 8 గంటలు కూడా పూర్తి శక్తితో పనిచేయలేవని వైద్య పరిశోధనలు నిర్ధారించాయి. 6 గంటల పని, అదీ ఉదయం పూట ఆదర్శమైన పనివేళ అని శాస్త్రవేత్తలు సాధారణంగా అంగీకరిస్తారు. స్వచ్ఛమైన, పరిశుభ్రమైన పరిసర వాతావరణం, శుభ్రమైన త్రాగునీరు, ఇంకా అటువంటి వసతులు కొరవడిన పరిస్థితుల్లో కార్మికులు ఆరోగ్యంగా ఉండటం, గరిష్ట శక్తి సామర్థ్యాలను వెచ్చించటం కష్టం.

కార్మిక యూనియన్‌లు, సంఘ సేవకులు, ఆలోచనాపరులైన పౌరులు, రాజకీయ పార్టీలూ ఆరోగ్యకరమైన జీవితం కోసం కార్మికుల హక్కులను సమర్థించాలి. ఈ ఒఎస్‌హెచ్ అండ్ డబ్ల్యుసి కోడ్ ఉపసంహరణకై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

### ఆర్‌ఎస్‌ఎస్ కోట నాగ్‌పూర్‌లో సిపిఐ భారీ ర్యాలీ

## వేలాదిమందితో ప్రదర్శన

సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కేంద్రం నెలకొని ఉన్న నాగ్‌పూర్ పుర వీధుల్లో సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహించారు. మితవాద ప్రతీఘాత శక్తులు రాజ్యాంగం జోలికి రావొద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు. నాగ్‌పూర్ వీధుల గుండా సిపిఐ శ్రేణులు కవాతు చేశారు. ఈ ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ బాలచంద్ర కాంగో, మహారాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి సుభాష్ లాండే, నాగ్‌పూర్ జిల్లా సెక్రెటరీ యుగల్ రాయలు, విదర్భ ప్రాంతానికి చెందిన అన్ని జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు. సుమారు 5వేల మంది సిపిఐ కార్యకర్తలు, మద్దతుదారులు విదర్భ ప్రాంతమంతటి నుంచి పెద్ద ఎత్తున ఈ ప్రదర్శన కోసం నాగ్‌పూర్‌కు తరలివచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ఎదుట నుంచి ప్రదర్శన సాగుతున్న సమయంలో ఫాసిజం, నియంతృత్వం నశించాలి, రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించాలని వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ప్రతిష్ఠాత్మక చిట్నీస్ పార్క్‌లో బహిరంగ సభను నిర్వహించారు.






మాజీ రాష్ట్ర కార్యదర్శి తుకారామ్ భస్మే అధ్యక్షతన జరిగిన సభలో కాంగో ప్రసంగిస్తూ స్వాతంత్ర్యోద్యమం నుంచి కార్మికోద్యమం వరకూ సిపిఐ అగ్రభాగాన నిలిచిందన్నారు. నిజాం వ్యతిరేక పోరాటంలో నాలుగున్నర వేల మంది కామ్రేడ్‌లు తమ జీతాలను త్యాగం చేశారని గుర్తు చేశారు.

యుపిఎ–1 ప్రభుత్వానికి 64 మంది వామ పక్ష పార్టీ సభ్యులు ఉన్నప్పటికీ మంత్రివర్గంలో చోటు కోసం బేరసారాలు చేయలేదని, కానీ, మహాత్మాగాంధీ నరేగా, సమాచార హక్కు , విద్యా హక్కు,గిరిజనులకు అటవీ హక్కు చట్టాల కోసం నాటి ప్రభుత్వానికి మార్గదర్శనం చేశారని తెలిపారు.







## కదంతొక్కుతున్న జాతా

### కర్నాటకలో కెజిఎఫ్ నుంచి ప్రారంభం

సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కోలార్ బంగారు గనులు(కెజిఎఫ్) నుంచి సిపిఐ కర్నాటక రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రవ్యాప్త జాతా ప్రారంభమైంది. ఈ జాతాను నవంబర్ 30న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. కెజిఎఫ్‌లో కమ్యూనిస్టు ఉద్యమం ఘన వారసత్వం కలిగి ఉంది. అక్కడి ప్రజలు 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో సిపిఐ వెటరన్ నాయకుడు కె.ఎస్.వాసన్‌ను శాసనసభకు తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. 1957లో ఇదే నియోజకవర్గం నుంచి మరో సీనియర్ నాయకుడు ఎం.సి.నరసింహన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

1955లో ప్రముఖ కమ్యూనిస్టు కామ్రేడ్ జీవానందం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రదేశంలోనే జాతా ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జెండాను డి.రాజా ఆవిష్కరించారు. అలాగే గిల్బర్ట్ ప్రాంతంలో జెండా దిమ్మను ప్రారంభించి, జెండాను ఎగురవేశారు. కింగ్ జార్జ్ ఆడిటోరియంలో సిపిఐ కోలార్ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాజా తో పాటు, సిపిఐ కర్నాటక రాష్ట్ర కార్యదర్శి సాతీ సుందరేశ్, తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే టి.రామచంద్రన్, కర్నాటక రాష్ట్ర సహాయ కార్యదర్శులు సంతోష్, రఘు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్తీక్, డిఎంకె కోలార్ జిల్లా కార్యదర్శి అరివళగన్, విసికె రాష్ట్ర కార్యదర్శి మూర్తి, ఎండిఎంకె కర్నాటక ఇన్‌ఛార్జ్ జై శంకర్, తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాజా ప్రసంగిస్తూ కెజిఎఫ్ లో అంబేడ్కర్ విగ్రహాలను అనేకం చూశానని, రాజ్యాంగ నిర్మాతగా వివిధ వర్గాల నుంచి దేశాన్ని హిందూత్వ ఆధారం మతతత్వ రాజ్యం చేయాలని అనేక వత్తిళ్ళు వచ్చినప్పటికీ దేశాన్ని లౌకికదేశంగా నిలబట్టేందుకు ధృడంగా నిలబడ్డారని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలు లౌకికవాదం, ప్రజాస్వామ్యం అనే భావనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, దానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉన్నదన్నారు. బిజెపి అధికారంలో కొనసాగేందుకే 'ఒక దేశం, ఒకే ఎన్నిక' అనే ప్రతిపాదనను ఉద్దేశ్యపూర్వకంగా ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. అది సమాఖ్య నిర్మాణంపై దాడి చేయడమే అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించాలని, వాటిని బలహీనపరచవద్దని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ మహోజ్వల పాత్రను పోషించిందని, తెలంగాణ సాయుధ పోరాటం, పుదుచ్చేరి స్వాతంత్ర్య పోరాటాలకు నేతృత్వం వహించిందని గుర్తు చేశారు. కెజిఎఫ్‌లో ప్రారంభమైన సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు వెళ్తుందని, డిసెంబర్ 23న బెంగళూరులో ముగుస్తుందని సాతీ సుందరేశ్ వెల్లడించారు.



## ప్రతి గడపకు అభివృద్ధి ఫలాలు

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లోనే ప్రతి గడపకు నిజమైన అభివృద్ధి ఫలాలు అందుతాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హన్వాడ మండలంలోని కొనగట్టుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గడ్డం కురుమయ్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే అసలైన అభివృద్ధి అర్హులైన లబ్ధిదారులకు చేరుతోందని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని శాఖలను, వ్యవస్థలను దెబ్బతీసి ప్రజలను ఇబ్బందుల్లో నెట్టేసింది అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టి, ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ''గ్రామాభివృద్ధి, సంక్షేమం, ప్రగతి, గడపగడపకు చేరాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం'' అని ఆయన స్పష్టం చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారే పల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ ఉన్నారు.

## జాతీయస్థాయి క్రీడలకు అక్షర ఎంపిక



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని విస్డం పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని పి.అక్షర జాతీయస్థాయిలో తెలంగాణరాష్ట్రంనుండి అండర్17 విభాగంలో పుట్‌బాల్ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. ఈనెల18న జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరగనున్న పోటిలలో అక్షర పాల్గొంటుందన్నారు. జాతీయస్థాయి పోటిలకు ఎంపికైన క్రీడాకారిణి అక్షరను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అభినందించి శాలువాతో సన్మానించారు. జాతీయస్థాయి క్రీడలో రాణించి రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జాతీయస్థాయి పోటిలకు అక్షర ఎంపికకావడంపట్ల పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్, పాఠశాల నిర్వాహకులు ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాలభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/ ధన్వాడ :** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి సి.జ్యోతి గుర్తు కత్తెర గుర్తు అది మీ మదిలో గుర్తుండాలి అని తెలిపారు. గున్ముక్ల గ్రామంలో శివకుమార్‌రెడ్డి తమ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చంద్రోల్ల అనంతమ్మ అయ్యప్పరెడ్డిని గెలిపించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** తొలిదశ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు మద్దతు పలికారని, పెద్ద ఎత్తున పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించారని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అన్ని వర్గాల వారు కాంగ్రెస్ ను ఆదరించినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతామన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, సీనియర్ నాయకులు చంద్రకుమార్ గౌడ్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్, నాయకులు బాలస్వామి, ప్రవీణ్ కుమార్, చందు యాదవ్, రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా కాంగ్రెస్ ప్రచారం



**ప్రజాపక్షం/ ఉట్కూర్ :** ఉట్కూర్ మండలం నాగిరెడ్డి పల్లిలో మంత్రి వాకిటి శ్రీహరి నాగిరెడ్డిపల్లి ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని గ్రామసర్పంచ్ అభ్యర్థిగా బలపరిచిన వ్యక్తిగా బస్వరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బస్వరాజు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి గ్రామంలోని సమస్యల గురించి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, కొత్తపల్లి రఘు, జి. నర్సప్ప పరమేష్, జగదీష్, గణేష్ , ఆటో నర్సింహ, శంకర్ రెడ్డి, చంద్రశేఖర్, రఘుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు ప్రసన్నం కోసం ప్రచారం

**ప్రజాపక్షం/నర్వ:** నర్వ మండల పరిధిలోని ఉందేకోడ్ గ్రామ సర్పంచు అభ్యర్థి గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో మాట్లాడుతూ గతంలో వార్డు నెంబర్ గా విద్యా కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. గత ప్రభుత్వ హయాంలో స్కూల్లో డైనింగ్ హాలు మరుగుదొడ్లు తాగునీటి వాటర్ ట్యాంక్ సుమారు 18 లక్షలు ఖర్చు చేసిన ఇంకా ఆరు లక్షల బిల్లు పెండింగే ఉందని అన్నారు. వార్డు నెంబర్ గా ఉన్నప్పుడు వివిధ వీధిలో నీళ్ల సమస్యల సిసి రోడ్లు , డ్రైనేజీలు కట్టించానని సర్పంచుగా ప్రజలు నన్ను గెలిపించుకుని ఒక అవకాశమిస్తే గ్రామంలోని అన్ని సమస్యలు మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లి నిధులు తీసుకొచ్చి పరిష్కరిస్తానని అధికార పార్టీ ఉన్నందున ప్రజలు నన్ను గెలిపించుకుంటే పనులు చేసి పెడతా పింఛన్లు గాని ఇందిరమ్మ ఇండ్లు గాని ప్రతి ఒక్కరికి అందేటట్లు చూస్తానని తెలిపారు. మన గ్రామ బాగు కోసం, సేవ చేయడానికి సిద్ధంగా ఉన్న మన నారాయణ కి కత్తెర గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి.

## కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఘనవిజయం

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ రెబల్ అభ్యర్థి పురుగుల యాదయ్య కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బాదమోని రమేష్‌గౌడ్‌పై 909 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఈసందర్భంగా యాదయ్య మాట్లాడుతూ వంగూరు గ్రామాభివృద్ధికోసం అహర్నిశలు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## సర్పంచ్‌గా రెండోసారి విజయం



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని జాజాల గ్రామపంచాయతీ సర్పంచ్‌గా జిలకర కాశమ్మ సైదులు రెండోసారి విజయం సాధించారు. వారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను రెండోసారి గ్రామసర్పంచ్ ఎన్నిక విజయానికి కృషిచేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధిచేస్తానని వారు పేర్కొన్నారు.

## పదేండ్లు మోసపోయాం

**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ :** గత పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ప్రజలు మోసపోయారని, అభివృద్ధి పేరుతో మాత్రమే ఆశలు పెట్టించారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన యారోని పల్లి సర్పంచ్ అభ్యర్థి పోశమోని లక్ష్మి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ '' పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో గ్రామాలకు నిధులు రాలేదు అభివృద్ధి పనులు జరగలేదు, ప్రజలు సమస్యలు పెరిగాయి. ఇప్పుడు ప్రజలు నిజమైన మార్పు కోరుకుంటున్నారు'' అని అన్నారు. '' పేదల సంక్షేమం కోసం పని చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేస్తున్న ఏకైక పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీయే అని ఆయన చెప్పారు.ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ ఉన్నారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి

### వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** శుక్రవారం వనపర్తి మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపిస్తేనే గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని ఎదుర్కొంటామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రెండవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వనపర్తి మండలంలో ఆయన ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. అప్పాయిపల్లి, కీర్యతండా , కాశీంనగర్, కాశీంనగర్ తాండ, చిట్యాల పెద్దగూడెం, దత్తాయిపల్లి, చందపురం, మెంటేపల్లి, కడుకుంట్ల , కిష్టగిరి, కిష్టగిరి తాండ, పెద్దగూడెం తాండ, నాచహల్లీతో పాటు పలు గ్రామలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు స్వాగతం పలికారు. డోలు డప్పులతో నృత్యాలు చేస్తూ నుదుటన తిలకం దిద్ది మంగళహారతి ఇస్తూ మహిళలు సైతం ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ప్రస్తుతం మూడేళ్లు తాను ఎమ్మెల్యేగా, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, మల్లు రవి ఎంపీగా ఉంటారని గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులనే అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచు ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాలలో పూర్తిస్థాయి అభివృద్ధి కొనసాగుతుందని మీరు గెలిచి వస్తే నేను అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అభ్యర్థులకు సూచించారు. విద్యాపరంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు వైద్యపరంగా నూతన ఆసుపత్రుల నిర్మాణం అంతర్గత రోడ్ల నిర్మాణం విద్యుత్ సమస్యల పరిష్కారం గ్రామాలలో మౌలిక వసతుల కల్పన లాంటి అనేక పనులు చేపడుతున్నామన్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జడ్పీటిసి గొల్ల వెంకటయ్య, తదితరులున్నారు.

## నీతివంతమైన పాలన జనసేన లక్ష్యం



**ప్రజాపక్షం/వనపర్తిటౌన్:** వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామ సర్పంచు అభ్యర్థిగా బిజెపి మద్దతుతో జనసేన పార్టీ నుంచి సర్పంచు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మచ్చా ఉత్తేజ్ ప్రచార కార్యక్రమంలో జనసేన పార్టీ వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు పాల్గొని ఉత్తేజ్ ను గెలిపించమని గ్రామ ప్రజలను కోరారు. ఉత్తేజ్‌ను సర్పంచుగా గెలిపిస్తే గ్రామ అభివృద్ధి గురించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్ తో మాట్లాడి ప్రత్యేక డెవలప్‌మెంట్ కార్యక్రమాలు పార్టీ నుంచి స్వంతంగా చేపించే ప్రయత్నం చేస్తామన్నారు. సర్పంచు అభ్యర్థి ఉత్తేజ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి 1.మొదటిగా విద్యకు వైద్యానికి పెద్దపీట 2. ప్రతి వార్డులో పరిశుభ్రంగా ఉండేటట్టుగా మురికి క్లీనింగులు వీధి లైట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో చేస్తుంటాను. 3. చెరువులో ఉన్న బోరింగ్‌లో బోరు వేయించి నూతన వాటర్ ప్లాంట్ ఎస్సీ కాలనీలో సొంత నిధులతో ఏర్పాటు చేస్తానన్నారు. బీజేపీ నాయకులు గాంధీ, గ్రామ అధ్యక్షుడు సాయిలు, మన్నెం కొండ, జనసేన నాయకులు సురేష్ యాదవ్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రెండోవిడత ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట్:** జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో రెండవ విడత ఎన్నికల పోలింగ్ సబ్బంది మూడవ ర్యాండమైజేషన్ పూర్తి. గ్రామ పంచాయితీఎన్నికలనిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రెండవ విడతలో ఎన్నికలు జరుగనున్న నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్ మండలాల పోలింగ్ సిబ్బంది. మూడవ ర్యాండమూజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి సమక్షంలో నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓ లను ర్యాండమైజేష్ ద్వారా కేటాయించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ నాటికే ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలతో కూడిన గ్రామ పంచాయితీలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నుంచి మినహాయింపు కల్పించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. గ్రామ పంచాయితీ ఎన్నికల దృష్ట్యా, ప్రజల్లో భద్రతాభావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాజాపూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.జిల్లా ఎస్పీ డాక్టర్‌వినీత్‌తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, లోకల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు ఈ ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా,శాంతియుతవాతావరణంలో స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, నిర్భయంగా ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం, ఓటు మన హక్కు అనే నినాదాలతో ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశం ప్రజలతో ధైర్యాన్ని నింపి, చట్టాన్ని ఉల్లంఘించాలని చూసే అసాంఘిక శక్తులకు, రౌడీసీటర్లకు బలమైన హెచ్చరిక పంపమేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సున్నితమైన అతి సున్నితమైన గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం పటిష్ఠమైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజలకు కీలక సూచనలు చేస్తూ, ముఖ్యంగా క్రిటికల్ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఇతరులను భయపెట్టేందుకు ప్రయత్నించినా, లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అన్ని విధాలా రక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్సై లు రాముడు, వెంకటేశ్వర్లు, నరేష్, రాజు, శివ శంకర్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట నియోజకవర్గం మరికల్ మండలంలోని ఇబ్రహీం పట్నం, వెంకటాపూర్, పెద్ద చింతకుంట గ్రామాలలో మరికల్ మండల కేంద్రంలోని ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని గత 10 ఏళ్లు కేసీఆర్ చేసిన అభివృద్ధి మళ్ళీ చేసి చూపిస్తామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేసిందని ధ్వజమెత్తారు. అందుకే ప్రజల్లు రేవంత్ పాలన పై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీలో అభ్యర్థులు ఓట్లు అడగడానికి వెళ్లే గ్యారెంటీల పై నిలదీయాలన్నారు. రైతులు, సాధారణ ప్రజలు మద్దతు బీఆర్ఎస్ వైపే ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు పార్టీ శ్రేణులు వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈనెల 14 వ తేదీన ఆదివారం రోజు జరిగే సర్పంచ్ ఎన్నికలు మన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# విపత్తుల నివారణకు ప్రణాళిక




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** విపత్తుల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేయాలని స్థానిక సంస్థలఅదనపుకలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. వరదలు, పరిశ్రమ ప్రమాదాలు, ఇతర ప్రమాదాల నియంత్రణపై జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మేజర్ జనరల్ సుధీర్ బాహల్ (రిటైర్డ్) వీడియో సమావేశం ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు. వరదలు వచ్చినప్పుడు, పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు,ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై జిల్లాలలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని, దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదలు, పరిశ్రమ ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలో భారీ వరదల సమయంలో నీటి విడుదల కోసం పై నున్న ప్రాంతాలు, దిగువ ప్రాంతాలలో సమన్వయం చేసుకుంటూ ఉండాలని అన్నారు. విపత్తుల సమయంలో వెంటనే ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, ఎస్‌డిఆర్ఎఫ్ వంటి ఏజెన్సీలకు సమాచారం వెళ్లేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం. యాదయ్య, అగ్నిమాపక శాఖ అధికారి కిషోర్, పశుసంవర్ధక శాఖ అధికారి డా.మధుసూదన్ గౌడ్, డిఎస్ఓ గంప శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష



**ప్రజాపక్షం/వనపర్తి:** వనపర్తి4 ఆత్మకూరు1 మొత్తం 5 కేంద్రాల్లో 1340 మంది అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష. శనివారం రోజున జరగనున్న జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష 2026 కోసం వనపర్తి జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1340 మంది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా ఎస్పీ సునితరెడ్డి, ఐపీఎస్ అన్నారు. ఈ పరీక్షలు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని ప్రశాంతంగా జరిగేలా సంబంధిత పోలీసు అధికారులకు భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడులూ జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. జిల్లాలో పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ సమగ్ర భద్రత ఏర్పాటు చేసింది. ప్రతి పరీక్షా కేంద్రంలో పోలీసు బందోబస్తు సిబ్బంది విధుల్లో ఉంటారు. సర్కిల్ ఇన్స్పెక్టర్లు స్వయంగా పర్యవేక్షిస్తారు. ప్రజలు పోలీసులకు సహకరించాలి. విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్ష రాయాలని ఎస్పీ అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

## విస్తృతంగా ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** అధికార కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అందిస్తున్న సహకారం విశేషమని, గ్రామ అభివృద్ధితో పాటు విద్యవైద్యంవ్యవసాయం రవాణా వంటి ప్రతి రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం తమ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మద్దతుతో వీపనగండ్ల సర్పంచుగా పోటీ చేస్తున్న మీసాల పార్వతమ్మ అన్నారు. గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి విశ్వాసంతో ముందుకు నడిపించాలని ఆమె కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీగా పాల్గొంటూ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ గ్రామానికి ఇప్పటికే మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో పలు కీలక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. ప్రధానంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో వీపనగండ్ల కొత్త గ్రామపంచాయితీ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగడం రూ.3.90 కోట్ల వ్యయంతో వీపనగండ్ల బెక్కం బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కావడం వీపనగండ్ల కల్వరావు కేతపల్లి మార్గంలో కొత్త బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు ఇప్పటికే మంజూరు కావడం జరిగిందని వివరించారు. గ్రామ యువత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మంత్రి జూపల్లి కృష్ణారావు తన సొంత నాలుగు ఎకరాల భూమిని క్రీడా ప్రాంగణం కోసం విరాళంగా ఇచ్చినట్లు పార్వతమ్మ తెలిపారు.

## సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలి

### ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ రాకేష్‌శర్మ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ రాకేష్‌శర్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌బిఐ మెయిన్‌బ్రాంచ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బ్యాంకుసిబ్బందికి సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఖాతాదారులు సైబర్ నేరాలబారిన పడుతున్నారని అలాంటి వారికి అవగాహన కల్పించడానికి బ్యాంకు సిబ్బంది ముందువరుసలో ఉండాలని సూచించారు. చాలామంది సైబర్‌నేరగాళ్ల బారిన పడుతున్నారని అవగాహనలేక బ్యాంకులలో లేదా 1930టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయడం లేదన్నారు. అలాంటివారికి సైబర్‌నేరాలబారిన పడితే ఎలా ఫిర్యాదుచేయాలో వివరించాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి బ్రాంచ్‌మేనేజర్ నరేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ లీలావతి, ఆసోసియేట్స్ దినేష్, భాగ్యలక్ష్మి , అంజలి, షేక్‌షర్ఫి, మాధవరావు, వర్షిణి, కిశోర్ రెడ్డి, మాధురి, నిఖిత, సర్వీస్‌మేనేజర్ రమేష్‌బాబు, క్యాష్ ఆఫీసర్ శరత్‌బాబు, మెస్సెంజర్ వెంకట్రావు, కృష్ణ, ఎస్‌ఎంఈ మేనేజర్ జగదీష్, కస్టమర్‌సపోర్టు ఆఫీసర్ శ్రీకాంత్, ప్రొబేషనరీ ఆఫీసర్ నిధికుమారి, సౌరభ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి, సంక్షేమం, ప్రతి ఇంటి పురోగతి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మాదారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ గౌడ్ కు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, నాయకులు వెంకట్ రెడ్డి, బాల్ రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నియోజక వర్గంలోని హన్వాడ మండలం ఎల్లంబాయి తాండాలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సబావత్ సత్య కు మద్దతుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన చెప్పారు. నిజమైన సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యం అని స్పష్టం చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి ప్రజలను నిండా మోసం చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం పై ప్రజలు నమ్మకం ఉంచవద్దన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదలకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పిస్తున్నామని, రానున్న మూడు సంవత్సరాల్లో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఒక్కటి కూడా మిగలకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన ప్రస్తావిస్తూ, పేదలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ, ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందిస్తూ , మహిళలను పారిశ్రామిక వేత్తలు గా తయారు చేస్తుందని ఆయన చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలవంతులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో పని చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం జరగాలంటే కాంగ్రెస్ పార్టీకి బలం చేకూర్చాలని, అందరూ కలిసి సర్పంచ్ అభ్యర్థి సబావత్ సత్య ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలనుకోరారు.ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, మారే పల్లి సురేందర్ రెడ్డి ఉన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వరంగల్‌లో మహిళా న్యాయవాది యామినిపై జరిగిన అమానుష దాడిని నిరసిస్తూ మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి బాధ్యులను వెంటనే శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా నేతి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవృత్తి, ఆత్మగౌరవంపై చేసిన దాడిగా భావించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో



న్యాయవాదులు లింగంపల్లి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్, ప్రభాకర్, రెడ్డిపల్లి సైదులు, ఓలేటి రాము, కల్యాణ్‌బాబు, భాస్కర్, భవాని, రమణ,పవన్‌కుమార్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## సాయిలు ఆశయాలను సాధిద్దాం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని సింగారం గ్రామా సిపిఐ సీనియర్ నాయకులు జినుకుంట్ల సాయిలు ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం అన్నారు.జినుకుంట్ల సాయిలు ప్రధమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆ గ్రామంలో ఆయన స్థూపానికి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.సాయిలు పార్టీకి నిస్వార్ధంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భోలుగురి నరసింహ,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఉప్పునూతల రమేష్, కుంభం లక్ష్మారెడ్డి,ఆయన కుటుంబ సభ్యులు గ్రామ శాఖ కార్యదర్శి జినుకుంట్ల నరసింహ,జినుకుంట్ల శేఖర్,పాలకూరి నరసింహ,పాలకూరి వెంకన్న తదితరులు ఉన్నారు.





## ఉపకార వేతనాల వ్యవస్థ బలోపేతం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వం అందించే స్కాలర్షిప్ పేద విద్యార్థుల విద్యకు భవిష్యత్‌లో భద్రత లాంటిదని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అలాంటి స్కాలర్షిప్ లను అందించడంలో జాప్యం చేయకుండా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ లపై సమీక్షా నిర్వహించారు. మండల విద్యాధికారులు (ఎంఈఓలు),ఎస్‌సి,బిసి,ఎస్‌టి వెల్ఫేర్ శాఖల అధికారులు, లీడ్ బ్యాంకు అధికారులు విద్యార్థులకు ప్రభుత్వం అందించే వివిధ స్కాలర్షిప్ పథకాల అమలు వేగవంతం చేయాలని చెప్పారు.ఉపకార వేతనాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, సామాజిఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఇవి అత్యంత కీలకమని అన్నారు.అందువల్ల స్కాలర్షిప్‌ల అప్లికేషన్ల పై సమీక్ష, ధృవీకరణ, ఫండ్ విడుదలలన్నీ నిర్దిష్ట గడువుల్లోనే పూర్తి చేయాలన్నారు.ఏ విద్యార్థి సాంకేతిక కారణాలతో, పత్రాల లోపాలతో ,లేదా డేటా ఎంట్రీ సమస్యలతో బెనిఫిట్ కోల్పోకుండా చూసుకోవడం ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శశికళ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీకి వ్యతిరేకం కమ్యూనిజం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సంపన్న వర్గాల దోపిడికి వ్యతిరేకంగా కమ్యూనిజం ఆవిర్భవించిందని దానితోనే దోపిడి అంతమవుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ సభ్యత్వ నమోదు, ఆవిర్భావ దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారి వర్గశ్రమ దోపిడిని కమ్యూనిజం ఎప్పుడు వ్యతిరేకిస్తుందన్నారు. బిజెపి అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల విధానం సామాన్య ప్రజలను దోచుకోవడమే అన్నారు. దేశంలో కమ్యూనిజం ఆవిర్భవించి శత వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన సిపిఐ భారీ బహిరంగ సభ జనవరి 18న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, మామిడి వెంకయ్య, సోమగాని కృష్ణ, జడ వెంకన్న, జక్కుల రమేష్, ఉమా, చక్రాల స్టాలిన్ పాల్గొన్నారు.

## గాంధీ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల గోడ పత్రిక



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాలను పునస్కరించుకుని చేపట్టే మహాత్మా గాంధీ లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రం లో గాంధీజీ విగ్రహాల సేకరణ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీ ఒక లక్ష విగ్రహాల ప్రదర్శన నిర్వహించే కార్యక్రమానికి ప్రతి నియోజకవర్గంలో గాంధీజీ విగ్రహాల సేకరణ చేపట్టాలని సూచించారు.ఈ స్వర్ణోత్సవాలలో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో డిసెంబర్ 23న రైతు సదస్సు నిర్వహించి రాష్ట్ర అన్ని జిల్లాలలోని ఉత్తమ రైతులకు పుడమి పుత్ర అవార్డులు అందించడం, 156 బాలురచే బాల గాంధీల వేశాధారణ,1156 ఒక అడుగు ఎత్తు గాంధీజీ విగ్రహాల సామూహిక ప్రదర్శన,గ్రామ నిర్మాతల వృత్తులు , ఉత్పత్తుల ప్రదర్శన,ఎద్దు గానుగ ప్రదర్శన,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ డా. పుచ్చకాయల వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో సభ్యులు మట్ట చెన్నయ్య, యంపల్ల భీష్మ రెడ్డి, జటావత్ జవహర్ లాల్, బొపంగి అశోక్,మంచికంటి సంతోష్ కుమార్,పల్లె శ్రీనివాస్ గౌడ్,శింర శెట్టి జాస్మిన్,ఎండీ సన,మైనంపాటి అరుణ పాల్గొన్నారు.

## ఉప ఎన్నికను తలపించిన మునుగోడు సర్పంచ్ ఎన్నికలు

### ఒక్క ఓటుకు రూ.5వేల రుపాయాలు





**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలో గత మూడు సంవత్సరాల క్రితం మునుగోడుకు ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో మునుగోడు ఉప ఎన్నిక నిర్వహించారు ఆ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విందుతో పాటు ఓటుకు భారీగా నగదు పంపిణీ చేశారు. అదే తరహాలో నిన్న జరిగిన మునుగోడు మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గ్రామ సర్పంచిగా గెలిచేందుకు గ్రామాలలో ప్రత్యేక విందులను ఏర్పాటు చేశారు. దాంతోపాటు ఇంటింటికి మటన్ చికెన్ మద్యం పంచుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఒక పండుగ వాతావరణం నెలకొన్నది ఒక్కొక్క గ్రామంలో సర్పంచిగా గెలిచేందుకు పంతంతో ఒక్క ఓటుకు రూ.2వేలు నుంచి రూ.5వేలుచొప్పున నగదు చెల్లించి ఓట్లు వేయించుకున్నారని వా ర్తలు వినిపిస్తున్నాయి. ఓ గ్రామంలో అధికార పార్టీకి చెందిన ముగ్గురు నా యకులు సర్పంచ్ గా బరిలో నిలిచి సర్పంచ్ పదవి దక్కించుకోవాలని పంతంతో ఒక్కొక్క ఓటుకు మూడు వేల చొప్పున ముగ్గురు అభ్యర్థులు సమానం గా నగదును పంపిణీ చేశారని గుసగుసలు వినపడుతున్నాయి. పదవి కోసం ఖర్చుకు భయపడకుండా ఎమ్మెల్యేకు అయ్యే ఖర్చు తో సమానంగా సర్పంచి పదవి కోసం సర్పంచ్ అభ్యర్థులు ఖర్చు పెట్టారని మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఎన్నికలు ఇంత ఖర్చుతో కూడుకుంటే సామాన్య ప్రజలు ఎన్నికల్లో ఎట్లా పోటీ చేస్తారని సామాన్య వ్యక్తులు అనుకుంటున్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నల్లగొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిచ్చి అధిక నిధులు కేటాయిస్తానని రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ,తిప్పర్తి,కనగల్ మండలాలలోని పలు గ్రామాలలో నూతనంగా సర్పంచులుగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లను శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన సర్పంచులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పదవులు అనేవి ఎవరికి శాశ్వతం కావని తెలిపారు.వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు గ్రామాలలో అందరినీ కలుపుకుపోతూ పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు.ఎన్నికలప్పుడే పార్టీలని, ఆ తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధికి తాను తగిన నిధులు కేటాయిస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన పెద్ద సూ రారం సర్పంచ్ గుండె జానమ్మ,ఉప సర్పంచ్ పెండెం అరుణ రామకృష్ణ, తిప్పర్తి మండలం ఎల్లమ్మ గూడెం సర్పంచ్ ఊట్కూరి వాణి సందీప్ రెడ్డి,నల్లగొండ మండలం చెన్నుగూడెం సర్పంచ్ మర్రి



సతీష్ యాదవ్, బుద్ధారం సర్పంచ్ తుక్కాని వెంకట్ రెడ్డి,చందనపల్లి సర్పంచ్ పెద్ది లక్ష్మమ్మ గోవర్ధన్,నర్సింగ్ బట్ల సర్పంచ్ జకిర తాజుద్దీన్,వెలుగు పల్లి సర్పంచ్ పోతేపాక వినోద్, కాంచనపల్లి సర్పంచ్ ముప్పిడి మహేశ్వరి, తొర్రగల్ సర్పంచ్ చిర్రబోయిన యాద య్య, దొనకల్ సర్పంచ్ కొత్తపల్లి సునీత తదితర నూతన సర్పంచులు,వార్డు సభ్యులకు మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

### విజయోత్సవ ర్యాలీలో మంత్రి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండలంలోని ఎల్లారెడ్డి గూడెం గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో విజయం సాధించిన అభ్యర్థి ఎల్లందుల లింగస్వామి(కిట్టు)విజయోత్సవ ర్యాలీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాభివృద్ధి దిశగా కృషి చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలతో ఉన్నదని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.అభివృద్ధి,సంక్షేమ పాలన చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి పల్లెలో ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం ఈ విజయం. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో కలసి పనిచేస్తుందని ఆయన తెలిపారు.





## ప్రతీ ఒక్కరికీ ప్రజా పాలన ఫలాలు

### అభ్యర్థుల గెలుపునకు ఎమ్మెల్యే బీర్ల సుడిగాలి పర్యటన

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని సీతారాంపురం, గురుజుబావి, కొమ్మాయిపల్లి, మరిపడిగ, మసాన్‌పల్లి, వెల్మజాల, రామారం, బ్రహ్మణపల్లి, సుద్దాల గ్రామాలలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల గెలుపు కోరుతూ జిల్లా నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య కు ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మ రథం పట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో రాష్ట్రం ముందుకు సాగుతున్న తరుణంలో గ్రామాలలో కూడా ప్రజాపాలన ఫలాలు ప్రతి ఒక్కరికి అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యం లో గ్రామాలలో కూడా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నుకోవడం ద్వారా గ్రామాలకు అధిక నిధులు చేకూరి గ్రామాలు సస్యశ్యామలంగా అభివృద్ధి చెందడంతో పాటు, గ్రామాలలో ఎటువంటి సమస్యలకు తావు లేకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా అందే అవకావం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, వార్డుల అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి ప్రజలే బలం

### ప్రజలకు ఓటే ఆయుధం : కలెక్టర్ వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడికి ఓటు కీలకమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వజ్రాయుధం మీ ఓటు మీ భవిష్యత్తు నిర్ణయిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వి.హనుమంతరావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఓటరు అవగాహన, చైతన్య (స్వీప్) కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ గ్రామపంచాయతీ నుండి రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ వరకు ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రలోభాల పర్వం మొదలవుతుందని డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాల కోసం ఓటును అమ్ముకోవడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని అన్నారు. ఓటు పవిత్రమైందని ఓటు అమ్ముకోకండి మీ ఓటు మీ పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. సర్వసాధారణ ఓటర్లు ప్రజాస్వామ్య బలానికి మూల స్తంభం అని గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా ఓటరు వినియోగశాతం పెంచేందుకు అవగాహన ర్యాలీలు, యువజన సంఘాల, విద్యార్థులు, మహిళలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ర్యాలీలు చేపట్టడం జరిగిందని అన్నారు. స్వచ్ఛమైన ఓటుతో మంచి అభ్యర్థిని ఎన్నుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో జూనియర్ కళాశాల విద్యార్థినులు స్వచ్ఛందంగా ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అనే నినాదం ఫ్లాకార్డ్స్ పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, సంస్థ నారాయణపురం మండల ప్రత్యేక అధికారి జయశ్రీ, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, స్థానిక ఎస్సై జె.జగన్, ఎంపీఓ నరసింహారావు, ఏపీఎం శ్రీదేవి, ఏపీఎంలు గడ్డం వెంకటేష్, విష్ణు, మహిళా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.





## చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ



**ప్రజాపక్షం/చింతలపాలెం :** ఎన్నికల సమయంలో ఏ పార్టీ, ఏ అభ్యర్థి అయినా చట్టాన్ని అతిక్రమించే చర్యలు చేస్తే పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటారని జిల్లా ఎస్పి కె నరసింహ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ చేస్తే వెంటనే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. రాత్రి వేళల్లో అనవసరంగా గుంపులుగా తిరగడం, క్యాంపులు ఏర్పాటు చేయడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం నేరమన్నారు. అలా చేసిన వారిపై బైండోవర్ చర్యలు, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం, ప్రతిష్ట దెబ్బతీసే పోస్టులు చేస్తే ఐటి యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను ముందుగానే గుర్తించి నిర్బంధ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాసరెడ్డి, సిఐ ప్రతాప్ లింగం, చింతలపాలం తహశీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపిడిఓ రామచంద్రరావు, ఎంపిఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి



### జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అధికారులు గ్రామ పంచాయితీ ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్ సూచించారు. 2వ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సాధారణ పరిశీలకులు రవి నాయక్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శుక్రవారం ర్యాండమైజేషన్ జరిపించారు. రెండవ విడత ఎన్నికలు జరిగే పెన్‌పహాడ్, చివ్వెంల, మోతె, మునగాల, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల్లోని ఆయా గ్రామ పంచాయితీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో రెండవ విడతలో మొత్తం 181 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లకు, 1628 వార్డు సభ్యులకి ఎన్నికల నోటిఫికేషన్ విడదల అవ్వగా 23 సర్పంచ్‌లు, 166 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడంతో మిగిలిన 158 గ్రామ పంచాయితీల సర్పంచ్, 1462 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అదికారులు 1901 ఓపిఓలు 2429 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు.

## అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ ప్రచారం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని కాల్వపల్లి, సుబ్బారెడ్డిగూడెం, ఆలగడప, రాయినిపాలెం, ముల్కల కాల్వ, అవంతీపురం, బాదలాపురం, గూడూరు, కిష్టాపురం,



కొత్తగూడెం, రుద్రారం, బోట్యానాయక్‌తండా, చింతపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని విస్తృత ప్రచారం చేశారు. గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు మంద సైదులు, చిమట పద్మమదార్, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, బానావత్ నాగలక్ష్మి వంశీ, జంగిలి శివలీల లింగయ్య, గాదనబోయిన మట్టయ్య, బొడ్డు సైదులు, కడియం గురవయ్య, మురళిలను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు దైద సంజీవరెడ్డి, తలకొప్పుల సైదులు, శంకర్‌నాయక్, జంగ్లి లింగయ్య, బసవయ్యగౌడ్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ఘనత కెసిఆర్‌దే

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


**ప్రజాపక్షం/చివ్వెంల/పెన్‌పహాడ్ :** గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత మాజీ సిఎం కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రెండవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా చివ్వెంల మండలంలోని చందుపట్ల, పెన్‌పహాడ్ మండల పరిధిలోని భక్తళాపురం, చీదెళ్ళ గ్రామాల్లో ఆ పార్టీ బలపర్చిన సర్పంచ్, వార్డు అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. రేవంత్ పాలనలో అన్ని అమ్మకాలు, ఆరచకాలేనని చెప్పారు. రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ పాలనపై ఆశలు సన్నగిల్లాయన్నారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలే సక్కగా ఇవ్వలేక ఎగవేస్తున్నారని మండిపడ్డారు. ఐదు విడతల రైతుబంధులో చాలా మంది రైతులకు రెండు విడతలే డబ్బులు అందాయని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న ధాన్యంకు క్వింటాకు బోనస్ రూ.500లు, నిరుపేద ఆడపిల్లల పెండ్లికి కళ్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, మహిళలకు రూ.2500 ఫించన్ ఇస్తామని నిలువునా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అంటేనే కమీషన్లు, కొట్లాటలని అన్నారు. గ్రామాలలో మళ్ళీ అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ చిల్లర మూకలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా నిలబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల సహకార పరపతి సంఘం చైర్మన్ సుధీర్ రావు, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, చివ్వెంల మాజీ జడ్‌పిటిసి భూక్య సంజీవ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన రెండవ విడత ప్రచారం

### మొదలైన ప్రలోభాల పర్వం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రెండవ విడత పంచాయితీ ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. నామినేషన్ల దాఖలు ముగిసిన నాటి నుండి ఆయా గ్రామాల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చేసే హడావుడి, లౌడ్ స్పీకర్లతో చేసే ప్రచారంతో హోరెత్తిపోయాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ గెలుపే లక్ష్యంగా ఓటర్లకు డబ్బు, మద్యం, మాంసంతోపాటు ఇతర నజరానాలు పంచడం మొదలుపెట్టారు. సూర్యాపేట జిల్లాలో రెండవ విడత ఎన్నికలు 8 మండలాల పరిధిలో ఈనెల 14న జరగనున్నాయి. ఇందులో సూర్యాపేట నియోజక వర్గ పరిధిలోని చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలు ఉండగా, కోదాడ నియోజక వర్గంలోని కోదాడ రూరల్, అనంతగిరి, మోతె, మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో మొత్తం 181 గ్రామ పంచాయితీలు, 1628 వార్డులు ఉండగా ఇందులో 23 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 166 వార్డులకు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 158 సర్పంచ్, 1462 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో సర్పంచ్ అభ్యర్థులుగా 493 మంది, వార్డుల బరిలో 3224 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరు తమ తమ గ్రామాల్లో హోరాహోరీగా ప్రచారాన్ని కొనసాగించారు. తమ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగారు. ఈ ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో రాజకీయ పొత్తులు చిత్రవిచిత్రంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ నేతలు ఇరువురు కలిసి అనేక గ్రామాల్లో ఎన్నికల పొత్తులు పెట్టుకోవడం గమనార్హం. ఎన్నికల ముందు వరకు పార్టీలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న వారు కలిసిపోయి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ పొత్తులు పెట్టుకోవడంతో ఓటర్లు సైతం ముక్కున వెలువేసుకుంటున్నారు.



ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ప్రలోభాల పర్వాన్ని మొదలుపెట్టారు. ఓటర్ జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్ళి ఓటర్లను కలుస్తూ మందు, మాంసం పంపిణీ చేయడంతోపాటు డబ్బులను ఇస్తున్నారు. మొదటి విడత ఎన్నికల్లో అభ్యర్థులు స్థానిక పరిస్థితులను అంచనా వేస్తూ ఆయా గ్రామాల్లో ఒక్క ఓటుకు రూ.2 వేల నుండి రూ.5వేల వరకు పంపిణీ చేశారు. ఇదే తరహాలో రెండో విడత ఎన్నికల్లో కూడా పంపిణీ చేసేందుకు అభ్యర్థులు కొందరు సిద్ధం కాగా మరికొందరు ఇప్పటికే పంపిణీ చేశారు. 65వ జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో పోటీ చేసిన అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అభ్యర్థులు ఎన్నికల్లో ఎంత డబ్బును ఖర్చు చేసినా గెలిచిన తరువాత తిరిగి రెట్టింపు సంపాదించుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతాల్లో వేలాది ఎకరాల వ్యవసాయ భూములను రియాల్టర్లు కొనుగోలు చేసి వెంచర్లుగా మార్చి వ్యాపారాలను పెద్దఎత్తున సాగిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయితీలకు ఆదాయం పెరగడంతోపాటు గెలుపొందిన అభ్యర్థులకు వ్యక్తిగతంగా కూడా లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో ఖర్చుకు వెనకాడడం లేదు.

# క్రీడ

## 'శతక' వీరుడు

### యుఎఇపై 234 పరుగులతో టీమిండియా విజయం!




అండర్–19 ఆసియా కప్‌ను భారత జట్టు ఘనంగా ఆరంభించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(171) విధ్వంసక శతకంతో కొండంత స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం యుఎఇని రెండో దలలోపే కట్టడి చేసింది. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ సెంచరీతో విరుచుకుపడగా.. అరోన్ జార్జ్ (69), విహాన్ మల్హోత్రా(69)లు అర్ధ శతకాలతో రెచ్చిపోయారు. టాపార్డర్ రాణించడంతో ప్రత్యర్థికి అసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. అనంతరం బౌలర్లు విజృంభించగా 234 పరుగుల తేడాతో అదిరే బోణీ కొట్టింది ఆయుశ్ మాత్రే బృందం. దుబాయ్‌లో జరుగుతున్న అండర్–19 ఆసి యా కప్‌లో భారత్ రికార్డు స్కోర్‌తో బోణీ చేసింది. ఆతిథ్య యూఏఈ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ.. ఫీల్డర్లను బౌండరీ వద్దకు పరుగులు పెట్టిస్తూ వైభవ్ సూర్యవంశీ (171: 95 బంతుల్లో 9 ఫోర్లు, 14 సిక్సర్లు) శతక్కొట్టగా.. టీమిండియా బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లను గొప్పగా కట్టడి చేశారు. అన్ని విభాగాల్లో అదుర్స్ అనిపించిన టీమిండియా 234 పరుగుల తేడాతో టోర్నీలో శుభారంభం చేసింది. సూపర్ సెంచరీతో విజృంభించిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

**56 బంతుల్లోనే సెంచరీ**

ఇటీవలే రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో యూఏఈపై శతకంతో కదంతొక్కిన వైభవ్ సూర్యవంశీ మరోసారి విరుచుకుపడ్డాడు. దుబాయ్‌లోని ఐసిసి అకాడమీ మైదానంలో ఊచకోతకు తెగబడిన వైభవ్.. బౌండరీలతో హోరెత్తించాడు. కసిదీరా కొట్టిన ఈ యంగ్‌స్టర్ 56 బంతుల్లోనే సెంచరీతో భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. వైభవ్ ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ అరోన్ జార్జ్(69), విహాన్ మల్హోత్రా(69)లు హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఫలితంగా.. నిర్ణీత ఓవర్లలో 433 పరుగులు చేసింది టీమిండియా. అనంతరం భారీ ఛేదనలో యూఏఈ ఏమాత్రం పోటీ ఇవ్వలేక పోయింది.
టాపార్డర్ కుప్పకూలగా పృథ్వీ మధు(50), ఉద్దిశ్ సూరి(78) అర్ధ శతకంతో ఏడు వికెట్లు కోల్పోయి 199 రన్స్ చేసిందంతే. దుమ్మురేపే ఆటతో 234 పరుగుల విజయం సాధించిన భారత్ 'మాతో జాగ్రత్త' అని ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపింది. మరో మ్యాచ్‌లో మలేషియాపై 297 పరుగులతో పాకిస్థాన్ గెలుపొందింది. డిసెంబర్ 14న భారత్, పాక్ మ్యాచ్ జరుగనుంది.


## టీ20ల్లో 'ఇషాన్' సూపర్ కెప్టెన్సీ..



### వరుసగా 8 విజయాలతో సరికొత్త రికార్డు!

భారత జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ దేశవాళీలో కెప్టెన్‌గా, ఆటగాడిగా అదరగొడుతున్నాడు. ఇషాన్ సారథ్యంలోని జార్ఖండ్ టీ20 ఫార్మాట్లో జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అజేయ శక్తిగా దూసుకెళ్తోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తున్న ఇషాన్ బృందం శుక్రవారం ఈ లీగ్ చరిత్రలో అత్యధిక ఛేదనతో రికార్డు నెలకొల్పింది. పంజాబ్ నిర్దేశించిన 235 పరుగులను 18.1 ఓవర్లలోనే అందుకొని సరికొత్త అధ్యాయం లిఖించింది జార్ఖండ్. నిరుడు దక్షిణాఫ్రికా పర్యటన మధ్యలోనే స్వదేశం వచ్చేసిన ఇషాన్ దేశవాళీ క్రికెట్‌కే పరిమితయ్యాడు. బిసిసిఐ ఆదేశాలను లెక్కచేయక సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన ఈ యంగ్ స్టర్.. డొమెస్టిక్‌లో సత్తా చాటి మళ్లీ సీ గ్రేడ్ కాంట్రాక్ట్ సాధించాడు. ఇక మిగిలిందల్లా నీలిరంగు జెర్సీ మళ్లీ ఒంటిపైకి చేరడమే. అందుకని.. పునరాగమనం కోసం తీవ్రంగా కష్టపడుతున్నాడు ఇషాన్. దేశవాళీలో జార్ఖండ్‌కు సారథ్యం వహిస్తున్న ఈ విధ్వంసక ఓపెనర్.. వరుసగా ఎనిమిది విజయాలు కట్టబెట్టాడు.
పుణేలోని డీవై పాటిల్ అకాడమీలో శుక్రవారం పంజాబ్ 236 పరుగులను నిర్దేశించగా.. ఇషాన్ 23 బంతుల్లోనే 47 రన్స్‌తో మెరిశాడు. కుమార్ కుష్రగ(87 నాటౌట్) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. రికార్డు లక్ష్యాన్ని మరో 11 బంతులు ఉండగానే ఛేదించింది. దాంతో.. ఇషాన్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాడు. గత 12 మ్యాచుల్లో 47(23), 2(4), 93(50), 113 నాటౌట్(50), 15(7), 27(24), 53(67), 17(21), 28(41), 45(73), 173(247)తో రాణించాడు. టీ20ల్లో శుభ్‌మన్ గిల్ విఫలమవుతున్న వేళ.. భీకర ఫామ్‌లో ఉన్న ఇషాన్‌ను తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## 2028 ఒలింపిక్సే లక్ష్యం



### రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్న వినేశ్ ఫొగాట్..

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సంచలన ప్రకటన చేశారు. తన రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్నారు. ఒలింపిక్ కలను సాకారం చేసుకునేందుకు తిరిగి వస్తున్నట్లు ప్రకటించారు. వినేశ్ ప్రకటనతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వినేశ్ పోస్టు పెట్టారు. 'ప్యారిస్ ఒలింపిక్స్‌తో నా రెజ్లింగ్ జర్నీ ముగిసిందా అని ప్రజలు ఇప్పటికీ అడుగుతూనే ఉన్నారు. ఈ ప్రశ్నకు నేను ఇప్పటికీ సమాధానం చెప్పలేకపోయాను. నేను రెజ్లింగ్ మ్యాట్, ఆ ఒత్తిడి, అంచనాల నుంచి, నా సొంత ఆశయాలకు కూడా కొంతకాలం దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇన్నేళ్లలో మొదటిసారిగా నేను కాస్త ఊపిరిపీల్చుకోగలిగాను. నా సుదీర్ఘ ప్రయాణంలోని ఎత్తుపల్లాలను అర్థం చేసుకోవడానికి నేను కొంత సమయం తీసుకున్నాను. నేను కెరీర్‌లో ఎన్నో ఎత్తులు చూశాను. అందులో ఈ ప్రపంచం ఎన్నడూ చూడని హృదయ విదారకర ఘటనలు, త్యాగాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ చూసిన తర్వాత నేను ఓ సత్యాన్ని తెలుసుకున్నాను. నేను ఇప్పటికీ ఈ క్రీడను ప్రేమిస్తున్నాను. ఇప్పుడు మళ్లీ బరిలోకి దిగాలని అనుకుంటున్నాను. ఈ సారి నేను ఒంటరిగా బరిలోకి దిగట్లేదు. నా వెంట నా కొడుకు వస్తున్నాడు. నన్ను ప్రోత్సహించేందుకు నా కొడుకు సిద్ధమయ్యాడు. లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌లో కలుద్దాం' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

# ఫోకస్ సైన్స్



## 'సిపి' ఉల్లంఘన



సెర్న్‌లో శాస్త్రవేత్తలు ఒక కొత్త రకమైన 'కాస్మిక్ పారిటీ సిమెంట్రీ' (సిపి) ఉల్లంఘనను గుర్తించారు. అత్యంత సూక్ష్మ దశలో పదార్థం (మ్యాటర్), కాంతి (లైట్), జీవం (లైఫ్)కు చోటు కల్పించే తత్వాన్ని కనుగొన్నారు. ఇవే దాదాపు మొత్తం కనిపించే పదార్థాన్ని నిర్మించే కణాలు. బిగ్ బ్యాంగ్ జరిగిన వెంటనే పదార్థం, ప్రతిపదార్థం సమానంగా సృష్టించబడి ఉండాలి. ఈ రెండూ పరిపూర్ణ సమతౌల్యంలో ఉండి పరస్పరం పూర్తిగా నిర్మూలించుకోవాలి. కానీ, ఒక చిన్న అసమతౌల్యం మిగిలిపోయిందనే విషయాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. అదే పదార్థం బ్రతకడానికి, నక్షత్రాలు, గ్రహాలు, చివరకు జీవం ఏర్పడటానికి దారిచూపించి ఉండవచ్చని నమ్ముతున్నారు. మనల్ని నిర్మించే ఈ అతి ప్రాథమికమైన కణాల్లో ఇలాంటి అసమమితి కనిపించడం ఇదే మొదటి సారి. విశ్వం అసలు ఎందుకు ఉంది అన్న ప్రశ్నకు ఇది ఒక లోతైన సంకేతాన్ని అందిస్తున్నది.


## ఎన్నో కాలాలు!




మనకు తెలిసినవి భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు. మరో విధంగా చెప్పాలంటే, గతం, వర్తమానం, భవిష్యత్తు.. ఏ పరిణామమైనా ఈ పరిధిలోకే వస్తుంది. కానీ, ఇంతకు మించిన కాలాలు లేదా స్థల పరిమాణాలు ఉన్నాయని భౌతిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సమయానికి వెలుపల, ఎన్నో పైస్థాయి కాలాలు లేదా పరిణామాలు ఉండవచ్చని ఊహిస్తున్నారు. ప్రతి అదనపు పరిమాణం మనం తెలిసిన విశ్వానికి కొత్త అంశాలను జతచేస్తున్నది. వీటిలో పదో ఒక పరిమాణం అత్యంత ఆశ్చర్యకరం. దీనిని, ప్రతి సాధ్యమైన కాలరేఖ, ప్రతి ప్రత్యామ్నాయ విశ్వం, ప్రతి వాస్తవికత ఒకేసారి ఉన్న స్థాయిగా అభివర్ణిస్తున్నారు. ఇక్కడ అనంత సంఖ్యలో భూములు ఉంటాయి. అంటే, అనంత మార్పులు.. కాలాలు కూడా ఉంటాయి. పరిణామాలు ఎన్నో విభిన్న సందర్భాల్లో కొనసాగుతుంటాయి. కొన్ని విశ్వాలు మన విశ్వాన్ని దగ్గరగా పోలి ఉంటాయి. మరికొన్ని పూర్తిగా భిన్నమైన భౌతిక సూత్రాలతో పనిచేస్తాయి. ఈ ఆలోచనను పరిశీలించడం అనేది మన ఉనికిపై ఉన్న అవగాహనను అనంతరంగా విస్తరిస్తుంది. వాస్తవం మన ఊహించిన దాని కంటే ఎంత పెద్దది, క్లిష్టమైనది, పొరలతో నిండినదో ఈ కొత్త సిద్ధాంతం చూపిస్తుంది.

## ఖగోళ మర్మాన్ని ఛేదిస్తారా?

ఈ విశ్వం... మానవ మేధస్సుకు సవాళ్లు విసురుతున్న అంతుచిక్కని రహస్యం. మనిషి నిరంతర అన్వేషణతో ఎన్నో ప్రశ్నలకు సమాధానలు కనుగొన్నాడు. మూఢ నమ్మకాలను చెదరగొట్టే ఆవిష్కరణలు చేశాడు. కానీ, ఇప్పటికీ ఇంకా అనేక లోతైన అంశాలపై అవగాహన లేదు. ప్రత్యేకించి, విశ్వం ఎందుకు ఉద్భవించింది?



ఎందుకు పదార్థంతో నిండి ఉంది? ఎందుకు శూన్యంగా లేదు? అనే ప్రశ్నలు పదేపదే వేధిస్తున్న నేపథ్యంలో, న్యూక్లియర్ పరిశోధనలు నిర్వహించే 'సెర్న్' శాస్త్రవేత్తలు సమాధానాలను వెతికే పనిలో పడ్డారు. ఈ ఖగోళ మర్మాన్ని ఛేదించడానికి అతి చేరువలోకి వచ్చారు. వారి అధ్యయన నివేదికను అనుసరించి, బిగ్ బ్యాంగ్ జరిగిన మొదటి క్షణాల్లో ప్రతిపదార్థంపై పదార్థం ఎలా గెలిచిందో చెప్పగలిగే సంకేతాలు వారి ప్రయోగాల్లో కనిపిస్తున్నాయి. అదే మనం తెలిసిన విశ్వానికి రూపమిచ్చింది. అయితే, ఈ కొత్త ఫలితాలు పదార్థం మరియు ప్రతిపదార్థం (మ్యాటర్ అండ్ యాంటీ మ్యాటర్) ప్రవర్తనల మధ్య ఉన్న అతి సూక్ష్మ తేడాలను కొలిచిన ఖచ్చితమైన ప్రయోగాల నుండి వచ్చాయి. నక్షత్రాలు, గ్రహాలుసహా అన్నిటినీ నిర్మించేది పదార్థమే. ప్రతిపదార్థం దాదాపు అలాగే ప్రవర్తించినా, పదార్థాన్ని తాకిన వెంటనే నశించిపోతుంది. ఈ అసమతౌల్యమే దశాబ్దాలుగా శాస్త్రజ్ఞులను అయోమయంలో పడేసింది. సెర్న్‌లో జరిగిన తాజా ప్రయోగాలు కణ భౌతికశాస్త్రంలో పదార్థాన్ని ... ప్రాథమిక వ్యవస్థలు ఉండవచ్చని సూచిస్తున్నాయి. ఇవే విశ్వం పూర్తిగా మాయమవకుండా కాపాడి ఉండవచ్చు. ఈ ఆవిష్కరణ కేవలం సిద్ధాంతం మాత్రమే కాదు.... విశ్వం ఎందుకు ఉందో అర్థం చేసుకోవడం భౌతిక శాస్త్రం, ఖగోళ శాస్త్రంతోపాటు వాస్తవికతపై ఉన్న అవగాహనను పూర్తిగా మార్చే అవకాశాన్ని కూడా కల్పిస్తుంది. ఇది పాత ఊహాగానాలను సవాలు చేస్తుంది.. ప్రస్తుత అవగాహనను మెరుగుపరుస్తుంది... సృష్టి గురించి కొత్త సిద్ధాంతాల దారిని తెరుస్తుంది. గతంలో పరోక్ష సూచనలపై ఆధారపడ్డ ప్రయత్నాలతో పోలిస్తే, ఈ ప్రయోగాలు పాఠ్యపుస్తకాలను సైతం మార్చగలిగిన స్పష్టమైన డేటాను అందిస్తున్నాయి. భవిష్యత్ శాస్త్రజ్ఞులను ప్రేరేపించగల శక్తి వీటిలో ఉంది. ప్రత్యేకించి, ఇది మనిషి ఆసక్తి ఎంత దూరం వెళ్తుందో గుర్తు చేస్తుంది. ఊహించలేని వేగంతో కణాలను ఢీకొట్టి వాటి క్షణకాలిక పరస్పర చర్యలను పరిశీలించడం ద్వారా, గెలాక్సీలు, నక్షత్రాలు, జీవం అన్నిటినీ సృష్టించిన శక్తులను నేరుగా చూస్తున్నాం. విశ్వం తన రహస్యాలను కొంచెం కొంచెంగా తెరిచి చూపుతోంది. మన ఉనికిని సాధ్యంచేసిన నియమాలను అర్థం చేసుకునే స్థితికి మనం చేరుకుంటున్నాం. సెర్న్‌లోని ఈ క్షణం కేవలం ఒక శాస్త్రీయ సాధనతోనే సరిపుచ్చకుండా, విశ్వాన్ని చూసి ఆశ్చర్యపోవడానికి ఒక ఆహ్వానాన్ని కూడా ఇస్తున్నది. విశ్వం ఎలా ప్రారంభమైం? అందులో ఉన్న ప్రతి దానిని నడిపించే సూత్రాలు ఏవి? అనే ప్రశ్నలకు సమాధానం లభించే రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం.




## చండూరులో సిపిఐకి మూడు ఉపసర్పంచ్ స్థానాలు




**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం కస్తాలలో సిపిఐ సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ పదవులను కైవసం చేసుకుంది. కస్తాల, పుల్లెంల , కొండాపురం గ్రామాలలో సిపిఐ ఉపసర్పంచ్ పదవులను కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికైయ్యారు. కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం (సిపిఐ), ఉపసర్పంచ్‌గా కట్ట స్వర్ణ (సిపిఐ), పుల్లెంల సర్పంచ్‌గా ముక్కముల వెంకన్న (కాంగ్రెస్), ఉప సర్పంచ్‌గా చెడుబుద్ధి ఊషయ్య (సిపిఐ), కొండాపురం సర్పంచ్‌గా గిరి కరుణాకర్ (కాంగ్రెస్), ఉప సర్పంచ్‌గా గడ్డం యాదయ్య (సిపిఐ) ఎన్నికైయ్యారు. చండూరు మండలంలో సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులకు సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఖమ్మంలో సిపిఐ ఉపసర్పంచ్‌లు ..




**ప్రజాపక్షం/చింతకాని :** ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో సిపిఐ 5 సర్పంచ్ స్థానాలు గెలుపొందగా రాఘవాపురం, బస్వాపురం ఉపసర్పంచ్‌లు సిపిఐ గెలుపొందగా చిన్నమండవ, నాగిలిగొండలో కోరం లేక ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. బస్వాపురం ఉసపసర్పంచ్‌గా చంద్రకాని నర్సింహారావు ఎన్నికవ్వగా, రాఘవాపురం ఉప సర్పంచ్‌గా అబ్బూరి ఉమా మహేశ్వరరావు(మహేష్) ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గాలను సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జున రావు, కూచిపుడి రవి అభినంధించారు.

## సర్పంచ్‌గా ఎన్నికైన కర్రె లక్ష్మికి సన్మానం



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండలంలో గోపాల్‌పూర్ గ్రామ సర్పంచ్‌గా కర్రే లక్ష్మి బిక్షపతి అత్యధిక మెజార్టీతో సిపిఐ అభ్యర్థిగా గెలుపొందారు. శుక్రవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్, సిపిఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి రాజ్‌కుమార్, బికెఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే లక్ష్మ ణ్, జిల్లా అధ్యక్షులు మునిగాల బిక్షపతి కర్రే లక్ష్మి భిక్షపతిలను శాలువాతో సన్మానించారు.

# యువతతోనే గ్రామాల ప్రగతి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ రెండోవిడత ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం తానాకుర్థు గ్రామంలో పశ్య పద్మ ప్రచారం నిర్వహించారు. తానాకుర్థ్ గ్రామ సర్పంచ్‌గా పోటీచేస్తున్న జలందర్‌రెడ్డిని గెలిపించాలని గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ గ్రామ అభ్యుదయానికి, గ్రామ ప్రజలతో మమేకమయ్యే జలందర్‌రెడ్డిని గెలిపించాలని, కత్తెర గుర్తుపై ఓటేయాలని కోరారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి బలపరిచిన అభ్యర్థులను ఓడించాలన్నారు. గ్రామ అభివృద్ధికి వార్డు సభ్యులుగా పోటీచేసిన వారికి అండగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జలందర్‌రెడ్డిని సిపిఐ బలపరిచిందన్నారు. సర్పంచ్ అభ్యర్థి జలందర్‌రెడ్డితో పాటు సిపిఐ అభ్యర్థులుగా పోటీచేస్తున్న వార్డుసభ్యులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, అడ్డికె రాజేశ్వర్, సిపిఐ నాయకులు సాయా గౌడ్, కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల సాయిబాబా, లక్క గంగారాం, బిసి సంఘం మండల నాయకులు తిరుపతి, సంజీవి, పెరక శ్రీనివాస్, వేల్పూర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే వారిని ఎన్నుకోండి


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజల కోసం పని చేసే వారిని ఎన్నుకోవాలని సిపిఐ జాతీయ నాయకులు భాగం హేమంతరావు సూచించారు. ఖమ్మం జిల్లా నేలకొండమల్లి మండలంలోని మోటాపురంలో కూటమి అభ్యర్థి రామారావు విజయం కాంక్షిస్తూ శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధి పట్ల అంకిత భావంతో పని చేసే నాయకుడిను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మందుల లక్ష్మయ్య. శ్యామిలేటి శ్రీనివాసరావు, నామవరపు శివ. తాళ్లపల్లి వెంకన్న, శ్యామిలేటి కృష్ణ. రవికుమార్, రావెళ్ల కృష్ణారావు, భాగం మురళీ, ఇంటూరి ఆశోక్, గుగులోత్ వీరు, చావా రామయ్య, ఏలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



## ప్రజల మనిషి ఏషాల అశోక్

### సిపిఐ రాష్ట్ర నాయకుడు గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రజల మనిషి ఏషాల అశోక్‌ని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు కోరారు. శుక్రవారం భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో సిపిఐ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ గోదా శ్రీరాములు ప్రచారం చేశారు. 10 వార్డులలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏషాల అశోక్ 35 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుంచి పలు ఉద్యమాలలో పాల్గొన్నాడని, రాష్ట్ర చేనేత సంఘం ప్రధానకార్యదర్శిగా చేనేత కార్మికుల సమస్యలపై పోరాడారన్నారు. బస్వాపురం గ్రామ ఎంపిటిసిగా పైసా ఖర్చు లేకుండా ఎన్నికయ్యాడన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిజాయితీగల అశోక్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి ఉడత రాఘవులు, నాయకులు వర్రె సాయిలు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతోనే గ్రామాలు అభివృద్ధి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/వలిగొండ :** కమ్యూనిస్టులతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాద్రాద్రి జిల్లా వలిగొండ నర్సాపురం గ్రామంలో 8వ వార్డు సిపిఐ అభ్యర్థి ఎల్లంకి మహేష్ గ్యాస్ పొయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ గ్రామాలలో ఇప్పుడున్న పరిస్థితులలో కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిధులు దుర్వినియోగం కాకుండా, అవినీతి జరగకుండా కమ్యూనిస్టులు అడ్డుకుంటారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ ఉన్నారు. అనంతరం వలిగొండ మండలంలోని నర్సాపురం, దుప్పల్లి, గోపరాజుపల్లి గ్రామాలలో సిపిఐ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కమ్యూనిస్టులు సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఉండాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకి కమ్యూనిస్టులు ఉంటేనే ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ గ్రామాలకు ఎమ్మెల్సీగా నా నిధులనుండి కూడా అభివృద్ధి పనులకు ఖర్చుచేస్తానన్నారు. కమ్యూనిస్టు అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలిపించాలని ఎమ్మెల్సీ సత్యం ఓటర్లను కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్, దుప్పల్లి జావిద్, మాజీ సర్పంచ్ కీసర్ల సత్తిరెడ్డి, సలగంజి కృష్ణ కుమార్, కట్ల యాదగిరి పాల్గొన్నారు.

# ప్రజాతీర్పుకు అనుగుణంగా పనిచేయండి

### వార్డుసభ్యులను సన్మానించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటింది. ఎన్నికల్లో విజయం సాధించిన వార్డు సభ్యులను శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు ప్రజా తీర్పుకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఆదరణ లభించడం అభినందనీయమన్నారు. దౌడపల్లిలో మొత్తం 10 వార్డులకు సిపిఐ బలపరిచిన 7గురు అభ్యర్థులు పోటీ చేయగా, వారందరూ విజయం సాధించడం గర్వకారణమన్నారు. మెజారిటీ సభ్యులు గెలవడంతో ఉపసర్పంచ్ పదవిని సిపిఐ కైవసం చేసుకుందన్నారు. 1వ వార్డు నుంచి గెలిచిన సంతపూరి మధుకర్‌ను ఉప సర్పంచ్‌గా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. సిపిఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం మాట్లాడుతూ సర్పంచ్‌గా తనకు 400 లకు పైగా ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామమ న్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతపూరి మధుకర్, వార్డుసభ్యులు మూగల దేవేంద్ర, కంది సత్తన్న, అయిత శాంతయ్య(రాజుదాస్), దుర్గం దేవదాస్, ఏ మూరి శ్రీదేవి, సంతపూరి విజయలక్ష్మి తో పాటు సిపిఐ నాయకులు కేతిరెడ్డి రమణారెడ్డి, ఏలియా, మనోజ్, కిరణ్ పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## విద్యుత్ అధికారులతో మూడవ అవగాహన సమావేశం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామికవేత్తలకు విద్యుత్ శాఖ అధికారులు మూడవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి టిజిఎస్‌పిడిసిఎల్ కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణి, ఎస్ఇ వెంకన్న, డిఇ అన్వర్ పాషాలు ముఖ్య అతిథులుగా విచ్చేసి కొత్త బిల్లింగ్ నిబంధనలపై పలు పరిశ్రమ వినియోగదారులకు అవగాహన కల్పించి, వారి విద్యుత్ బిల్లులను తగ్గించుకునే విధంగా సహాయం చేసినందుకు ఎల్‌టి, హెచ్‌టి యూనిట్లకు అసాధారణంగా వచ్చిన విద్యుత్ బిల్లులపై సందేహాలకు ఓర్పుతో సమాధానాలు ఇచ్చినందుకు సిఐఎ అధ్యక్షులు డి శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ పిఎస్ మోహన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.



## బస్సులు పెంచాలని మేనేజర్‌కు వినతి

**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు తగ్గిపోవడంతో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయనీ దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ అన్నారు. ఉద్యోగాలకు వెళ్లే వారు, కళాశాల విద్యార్థులు సమయానికి బస్సులు దొరకక రోజూ సమస్యలను ఎదుర్కొంటున్నామని జీడిమెట్ల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ కలసి వినతి పత్రం అందచేశారు. దుండిగల్ ప్రాంతం నుండి ఉదయం ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణమే బస్సులు పెంచాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా పరిష్కరించాలని మాజీ సర్పంచ్ కావలి గణేష్ తెలిపారు. వారితో పాటు దుండిగల్ మాజీ ఎంపిటిసి బండారి మహేష్, దొంతుల వీరస్వామి, చెట్లపల్లి దత్తు యాదవ్, దాతర్పల్లె గోపాల్, తదితరులు పాల్గొన్నారు.




## డివిజన్‌లు మార్పు చేయాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్‌ఎంసిలో ఇటీవల ఏర్పాటు చేసిన డివిజన్లు తప్పులతడగా ఉందని వాటిని మార్పులు చేయాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో ఉన్న బిఎన్‌రెడ్డి నగర్,మహాలక్ష్మి నగర్, భరత్ నగర్‌లను శక్తిసాయి నగర్, చక్రీపురం డివిజన్‌లలో కలుపుతూ ముసాయిదా జారీ చేశారు. విభజనలో బిఎన్ రెడ్డి నగర్,మహాలక్ష్మి నగర్, భరత్ నగర్‌లను చర్లపల్లి డివిజన్‌లో కొనసాగించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో డి నాథం,దర్శనం కృష్ణ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## వెంకట్‌నాయక్‌ను పరామర్శించిన పిఎసి అరికెపూడి గాంధీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరాహిల్స్ కాలనీకి చెందిన సీనియర్ నాయకులు, కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వెంకట్ నాయక్ అనారోగ్యంకు గురవడం బాధకమని, త్వరగా కోలుకోవాలని, అధైర్యపడకూడదని తెలిపారు. కుటుంబ సభ్యులను యోగక్షేమాలు అడిగి తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. త్వరితగతిన కోలుకోవాలని, వెంకట్ నాయక్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు.

## ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన నూతన సర్పంచ్‌లు



**ప్రజాపక్షం/తాండూరు:** మొదటి విడత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గం లో అధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయ ఢంకా మ్రోగించా రు. గురువారం రాత్రి వరకు వెలువడి పంచాయతీ ఫలితాలలో తాండూరు నియోజకవర్గంలో వందకు పైగా సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ కొట్టస్తుంది. నూతన సర్పంచ్‌లు శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలుసుకోవడంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలుస్తూ ధన్యవాదాలు తెలియజేసుకున్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన గూడ్స్ వాహనం.. వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గూడ్స్ వాహనం బైక్‌ను డికొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన వల్లెపు శ్రీనివాస్(55) రాయి కొట్టే పని చేసుకుంటు జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో శామీర్‌పేట నుంచి పెద్దమ్మ కాలనీలో ఉన్న తన ఇంటికి గ్లామర్ బైక్‌పై వెళ్తుండగా అరణ్య రిసార్ట్ సమీపంలోకి రాగానే అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం డ్రైవర్ పెద్దమ్మ కాలనీ నుంచి నల్సార్ జంక్షన్ వైపు అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ శ్రీనివాస్ బైక్‌ను డీకొట్టింది. దీంతో శ్రీనివాస్ రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సమాజంలో గౌరవప్రదంగా జీవించాలి

* బలవంతపు వసూళ్ళకు పాల్పడితే చర్యలు తప్పవు
* ట్రాన్స్‌జెండర్లకు హైదరాబాద్ సిపి సజ్జనర్ హెచ్చరిక




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, బలవంతపు వసూళ్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ట్రాన్స్‌జెండర్లను హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి. సజ్జనర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను వీడి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని వారికి ఆయన హితవు పలికారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) ఆడిటోరియంలో ట్రాన్స్ జెండర్లతో హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్ జెండర్ల మధ్య గ్రూపు తగాదాలు, ఆధిపత్య పోరు తరచూ శాంతిభద్రతల సమస్యలకు, ప్రాణ నష్టానికి కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మధ్య ట్రాన్స్ జెండర్లపై ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, శుభకార్యాల పేరుతో ఇళ్లపై పడి యజమానులను వేధించడం సరికాదన్నారు. ఇలాంటి బలవంతపు వసూళ్లను సహించబోమని, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటి వారినైనా కటకటాల వెనక్కి పంపిస్తామని, అమాయక ప్రజలను ఇబ్బంది పెడితే జైలు శిక్షలు తప్పవని సిపి హెచ్చరించారు. ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ట్రాన్స్ జెండర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరలోనే ఒక సమగ్రమైన పాలసీని ప్రభుత్వం తీసుకువస్తున్నట్లు సిపి తెలిపారు.

**ప్రైడ్ ప్లేస్'తో సమస్యల పరిష్కారం: ఎడిజి చారు సిన్హా**

ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరించడానికి మహిళా భద్రత విభాగంలో 'ప్రైడ్ ప్లేస్' అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని సిఐడి, మహిళా భద్రతా విభాగ అదనపు డిజిపి చారు సిన్హా తెలిపారు.

ఎలాంటి సమస్యలు ఉన్నా, ఎవరైనా వేధించినా నిరభ్యంతరంగా ఈ వింగ్‌ను ఆశ్రయించవచ్చని ఆమె అన్నారు. ట్రాన్స్ జెండర్ల సమస్యలను వినడానికి, పరిష్కరించడానికి మహిళా భద్రతా విభాగం సిద్ధంగా ఉందన్నారు. చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉంటూ, సమాజంలో హుందాగా జీవించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, నార్త్ జోన్ డిసిపి రష్మి పెరుమాళ్, వెస్ట్ జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్, మహిళ భద్రతా విభాగ డిసిపి లావణ్య నాయక్ జాదవ్, సైబరాబాద్ డిసిపి సృజనతో పాటు ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శామీర్‌పేటను వార్డు కార్యాలయంగా ప్రకటించాలి

జిహెచ్‌ఎంసి అధికారులకు వినతులు సమర్పించిన నాయకులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేటను జిహెచ్‌ఎంసి వార్డు కార్యాలయంగా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని శామీర్‌పేట మండలానికి ఎంతో ఘన చరిత్ర ఉందని జిహెచ్‌ఎంసి అధికారులు స్పందించి వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని శామీర్‌పేట గ్రామస్థులు జిహెచ్‌ఎంసి అధికారులకు, డిసిసి జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు శుక్రవారం వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న తూంకుంట మున్సిపాలిటి, జవహార్‌నగర్ కార్పోరేషన్‌లు శామీర్‌పేటలోనే ఉండేవని చెప్పారు. శామీర్‌పేట హెడ్ క్వార్టర్‌లో తహశీల్దార్ కార్యాలయం, డీర్ పార్కు, ప్రభుత్వ ఆస్పత్రి, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, టిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్, పోలీస్‌స్టేషన్, ఐటిఐ కళాశాల, స్టేడియం, శామీర్‌పేట పెద్ద చెరువు పర్యటకంగా ఉందన్నారు. తూంకుంటను వార్డు కార్యాలయంగా ఏర్పాటు చేయడం చాల బాధకరమన్నారు. అన్ని వసతులు ఉన్న శామీర్‌పేటను వార్డు కార్యాలయంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషోర్‌యాదవ్, రాష్ట్ర హజ్ కమిటి మెంబర్ ముజుబుద్దిన్, మాజి ఎంపిటిసి సాయిబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## జోనల్ కమీషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇటీవల విభజించిన డివిజన్ల విభజనకు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లతో కలిసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేరే నియోజకవర్గానికి సంబంధించిన పరిధిలు కూకట్‌పల్లి నియోజకవర్గంలో కలవడం అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేరే నియోజకవర్గం కలవడం వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందన్నారు. ఒకసారి సమీక్షించి ఏ నియోజకవర్గానికి సంబంధించి అవే పరిధిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహా యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, పండాల సతీష్‌గౌడ్, మహేశ్వరి శ్రీహరి, సబియా గౌసుద్దీన్, మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు అధ్యక్షుడుగా వేల్పుల శ్రీనివాస్ పటేల్

నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన పురుషోత్తంరావు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రాజ్యాధికారం దిశగా మున్నూరుకాపులు కార్యాచరణ రూపొందించాలని, పదవి అనేది శాశ్వతం కాదని పదవికి వన్నెతెచ్చే విధంగా నూతన కమిటీ కృషి చేయాలని ఎమ్మెల్యే సి.మల్కా కొమురయ్య అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలోని శుభం గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలు గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు పటేల్, అపెక్స్ కమిటి కన్వీనర్ మీసాల చంద్రయ్య సారధ్యంలో ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి మల్కా కొమురయ్య మాట్లాడుతూ మున్నూరు కాపులు ఏకతాటిపైకి వచ్చి అందరి అమోదంతో ఏకగ్రీవంగా అధ్యక్షుడిని ఎన్నుకోవడం మున్నూరుకాపుల ఐఖ్యతకు నిదర్శనమని అన్నారు. ప్రస్తుతం బిసి హవా నడుస్తుందని అందరిని కలుపుకుని రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర మున్నూరుకాపు అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు, అపెక్స్ కమిటి కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్, గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ఏకగ్రీవ అధ్యక్షుడుగా వేల్పుల శ్రీనివాస్‌ను, ప్రధాన కార్యదర్శిగా చాట్లపల్లి నర్సింగరావును, ఉపాధ్యక్షుడుగా పాదం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ని ముఖ్య అతిథులు, కులబంధువులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, రాష్ట్ర పదాధికారులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, ఆకుల సత్యనారాయణపటేల్, ఎన్నికల అధికారి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## హౌసింగ్ బోర్డును విడదీయడం ఎంతవరకు సమంజసం?

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** పేద మధ్యతరగతుల వారి కోసమే నిర్మించిన హౌసింగ్‌బోర్డు కాలనీని మూడు ముక్కలు చేయడం ఎంతవరకు సమంజసం అని జనసేన నాయకులు కొల్లా శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కెపిహెచ్‌బి డివిజన్ ఈడబ్ల్యూస్, ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ నివసించే ప్రజలను విడదీయకుండా అన్ని ఒకరి సారధ్యం ఉండేలా పునరాలోచన చేయాలని జిహెచ్‌ఎంసి అధికారులను జనసేన తరపున కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ హౌసింగ్ బోర్డు కాలనీలో ని కెపిహెచ్‌బి, బాలాజీనగర్, వసంత్‌నగర్ అని మూడు ముక్కలు చేసి విడదీయడం సభ్యమా, ఇప్పటికే వాటర్, డ్రైనేజీ, ట్రాఫిక్, అక్రమ కట్టడాలు, ఇళ్ల మధ్య వైన్ షాపులు, హాస్టల్ వలన అంబులెన్స్‌లు పోవడానికి దారి లేకుండా ఇబ్బందులతో వున్న ప్రజలకు జిహెచ్‌ఎంసి అధికారులు మరొక ఇబ్బంది సృష్టించారన్నారు. గవర్నమెంట్ స్కూల్, 100 పడకల హాస్పిటల్, లైబ్రరీ, ఆట స్థలం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ముగ్గురు కార్పొరేటర్లతో మరో సమస్యగా మారిందన్నారు. స్థాని క సమస్యలపై ఏ కార్పొరేటర్ దగ్గరకు వెళ్లాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కలిగినీడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేటలోని గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం లేదంటు బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. శుక్రవారం శామీర్‌పేటలోని గురుకుల పాఠశాలను బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యల గోడును బిఆర్‌ఎస్‌వి బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులకు భోజనం పెడుతున్నారని, గురుకుల పాఠశాల సమస్యలపై సమీక్షలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. భోజనంలో రాళ్లు వస్తున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు.

విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఇతర నాయకులను అరెస్ట్ చేసి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## కలెక్టర్ ఇవిఎం గోడౌన్ పరిశీలన



**ప్రజాపక్షం/వికారాబాద్:** ఈవీవీఎం గోడౌన్ ను పరిశిలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల గోడౌనంను సీల్ తెరిచి బ్యాలెట్ యూనిట్ , కంట్రోల్ యూనిట్ లు ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షణంగా పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కలెక్టర్ సూచించారు. రిజిస్టర్‌లను పరిశిలించి సంతకలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ మంగీలాల్,ఆర్‌డిఓ వాసుచంద్ర ,తహసీల్దార్ లక్ష్మి నారాయణ ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## హక్కులు పొందేవరకు ప్రభుత్వం పోరాడుతూనే ఉంటుంది

మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు మహేష్‌గౌడ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** బిసి కులాల వారు కోరుకున్న విధంగా అన్ని హక్కులు లభిస్తాయని, వాటిని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, దీనికోసం ఎవరూ తొందరపడి ఆవేశాలకు గురికావద్దని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్‌లు కోరారు. కొద్ది రోజుల క్రితం బిసి రిజర్వేషన్లకోసం ఆత్మహత్య చేసుకొన్న ఈశ్వరాచారి ఆశించిన విధంగా వాటిని సాధించి తీరుతామన్నారు. జగద్గిరిగుట్టలోని ఈశ్వరాచారి నివాసానికి వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించారు. కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాగా ఆ ప్రభుత్వం రూ.5 లక్షలు ప్రకటించిందని ఆయన తెలియచేస్తూ దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం కుటుంబీకులకు అందచేసారు. దీంతోపాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తున్నామని మంత్రులు ప్రకటించారు. ఈశ్వరచారి ముగ్గురు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. బిసిలకు రావల్సిన రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ విషయంలో రాహుల్ గాంధీ ఆశయం మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తుది వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సంవిధాన్ బచావో కమిటి చైర్మన్ వినయ కార్పొరేషన్ చైర్మన్లు ఈరపత్రి అనిల్, నూతి శ్రీకాంత్, మెట్టు సాయి, బిసి సంఘం నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## అఖిలేష్ యాదవ్‌కు సన్మానం

అధ్యక్షుడు మామిడ్ల ముత్యాలు యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం పోరాట సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఘట్‌కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్ శుక్రవారం ఓ కార్యక్రమంలో ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెట్టు గణేష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ పుస్తకాలు పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించడం అభినందనీయమని కుషాయిగూడ అదనపు డిప్యూటీ కమిషనర్ ఎన్. వెంకటరమణ అన్నారు. కమలానగర్ స్ఫూర్తి క్లబ్ నిర్మాత కీర్తిశేషులు మణిపాల్‌రెడ్డి నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం యాప్రాల్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పాఠ్య పుస్తకాలను మాజీ కార్పొరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డితో కలసి వెంకటరమణ అందజేశారు. మణిపాల్‌రెడ్డి స్ఫూర్తిగా లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మనోహర్, రాజీవ్ రవియాదవ్, వంజరి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుందిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డబుల్ బెడ్రూం సముదాయంలో క్రైస్తవ సోదరసోదరీమణులు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బొంగునూరి కిషోర్ రెడ్డి, దుందిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పాల్గొని క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సేవా భావాల ప్రతీకగా ఉంటుందని, సమాజంలో ఐక్యతను పెంపొందించే కార్యక్రమాల అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల ప్రేమ్ పటేల్ సిరగల్ల బాబు, దొంతి మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాక్షేత్రంలో ఉండేవారికే పట్టం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఓట్ల సమయంలో వచ్చిపోయే వారిని కాకుండా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రం ఉండి పోరాడే కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చల్లంపల్లి కడ్తల్ గ్రామాల్లో కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం,ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్ కలిసి పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచులను, వార్డు సభ్యులను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు మోత్కుపల్లి శ్రీనువాస్, కడుపోల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రెజోనాన్స్ పాఠశాలకు అనుమతులు లేవు

పరీక్షలకు హాజరు కావొద్దు

హైదరాబాద్ జిల్లా విద్య అధికారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలో ఉన్న రెజొనాన్స్ పాఠశాలలకు సంబంధించి అనుమతులు లేవని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెజొనాన్స్ పాఠశాల వారు ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష మెగా రెసోఫాస్ట్‌కు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. కావున విద్యార్థులు ఆ పరీక్షకు హాజరు కాకూడదన్నారు. తల్లితండ్రులు ఈ విషయంలో తగిన జాగ్రత్త వహించాలని సూచించారు.

## నమ్మకంతో గ్రామపాలన చేయాలి



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తన అనుచర వర్గాన్ని గెలుపించుకునేందుకు మాజీ ఎంపిపి పిస్నింటి మధుసూదన్‌రెడ్డి కృషికి ఫలితం దక్కింది. శుక్రవారం కొత్తూరు మాజీ ఎంపిపి పిస్నింటి మధుసూదన్‌రెడ్డి మల్లాపూర్, మక్తగూడ తండా, మక్తగూడ గ్రామాల సర్పంచులను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీఠ వేయడం జరుగుతుందని వివరించారు. నూతన సర్పంచులు నరసింహారెడ్డి, మీనాక్షి దశరథ్ నాయక్, బోకుల శ్రీరాములును పూలమాలలు, శాలువాలతో ప్రత్యేకంగా సన్మానించారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామాభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తానని..ఇందుకు ప్రజలందరు సహకరించాలని నూతన సర్పంచ్ మోత్కురి హన్మంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ హన్మంత్‌రెడ్డి ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన మామిడిపల్లి గ్రామ పంచాయతీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

## జోనల్ కమిషనర్ హేమంత్‌ను కలిసిన మణికొండ బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/గండిపేట :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవును మణికొండ జిహెచ్ఎంసి బిఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు,షేక్ ఆరిఫ్, మహమ్మద్ ఆరిఫ్, సుమనళిని, శ్రీధర్, బిందు దేవి ప్రియ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ సాధ్యమైనంత త్వరలో సమస్యల పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నిస్తామన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. శుక్రవారం నందిగామ మండలం మొదళ్ళగూడ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మామిడిపల్లి గ్రామ పంచాయతీలోని మూడు గ్రామాల సర్పంచులను గెలిపించుకోవడమే కాకుండా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వగ్రామంలో సైతం తన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకున్నట్లు తెలిపారు. సర్పంచులను గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అధికార..ప్రతిపక్ష పార్టీల మధ్య సాగిన పంచాయతీ పోరు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అధికార పార్టీ కాంగ్రెస్..ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ మధ్య గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు సాగింది. ఒక్కొక్క పార్టీ నుండి ఇద్దరు చొప్పున సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేయడంతో స్థానికంగా పనిచేసే అభ్యర్థులకే పట్టం కట్టారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల పరిధిలో మొత్తం 153గ్రామ పంచాయతీలకు నిర్వహించిన ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 73పంచాయతీలను స్వాధీనం చేసుకోగా ప్రతిపక్ష బిఆర్ఎస్ 65పంచాయతీలను దక్కించుకుంది. బిజెపి సైతం ఇద్దరు సర్పంచులకు గెలిపించుకోగా 13మంది స్వతంత్ర అభ్యర్థులు పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించారు. డివిజన్‌లోని 153గ్రామ పంచాయతీల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలో హోరాహోరీ ప్రచారం చేయడంతో నువ్వా..నేనా అన్న చందంగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని 47గ్రామ పంచాయతీలకు గాను 26పంచాయతీలను అధికార కాంగ్రెప్ దక్కించుకోగా 18స్థానాలను బిఆర్ఎస్ కైవసం చేసుకుంది. కొత్తూరు మండలంలోని 12గ్రామ పంచాయతీలకుగాను 6స్థానాలు కాంగ్రెస్ దక్కించుకోగా మూడు స్థానాలు బిఆర్ఎస్, మరో మూడు స్థానాలను స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. నందిగామ మండల పరిధిలోని 18గ్రామ పంచాయతీల్లో 11స్థానాలకు బిఆర్ఎస్ దక్కించుకోగా 5స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. కేశంపేట మండలంలోని 29గ్రామ పంచాయతీలను గాను 12పంచాయతీల్లో కాంగ్రెస్ గెలుపొందగా మరో 12స్థానాల్లో బిఆర్ఎస్ విజయం సాధించగా ఐదు స్థానాలు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. కొందుర్గు మండలంలోని 22గ్రామ పంచాయతీల్లో 8స్థానాలు బిఆర్ఎస్ దక్కించుకుంటే 13స్థానాల్లో అధికార కాంగ్రెస్ విజయం సాధించింది. ఒక గ్రామ పంచాయతీల్లో బిజెపి గెలుపొందింది. జిల్లేడు చౌదరిగూడ మండలంలో 24గ్రామ పంచాయతీలకు గాను 11స్థానాలు అధికార కాంగ్రెస్ దక్కించుకోగా 13స్థానాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు.

### సాంకేతిక నైపుణ్యం కలిగిన.. మానవ వనరుల నిర్మాణంలో

## ఇఎస్‌సిఐ సేవలు అభినందనీయం

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి దేవసేన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సిఐ)లో జరుగుతున్న శిక్షణ, కన్సల్టింగ్, పరిశోధన కార్యకలాపాల పురోగతిని సమీక్షించేందుకు ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎ.దేవసేన హాజరయ్యారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు ఎఫ్ఐఈ, ఇఎస్‌సిఐ చేపడుతున్న జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమాలు, సామర్థ్య వృద్ధి చర్యలు, ప్రొఫెషనల్ నైపుణ్యాభివృద్ధి కోర్సులు, పరిశోధన ఆధారిత కన్సల్టింగ్ సేవలపై విపులమైన ప్రెజెంటేషన్‌ను అందించారు. తదనంతరం, ఆమెకు ఈఎస్‌సిఐ, క్యాంపస్‌లోని సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, ఆధునిక ప్రయోగశాలలు, ప్రత్యేక శిక్షణా హాల్స్ వంటి అత్యాధునిక వసతులను పరిచయం చేస్తూ పర్యటన నిర్వహించారు. ఈఎస్‌సిఐ అందిస్తున్న సౌకర్యాల నాణ్యత, ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్‌లో సంస్థ చూపిస్తున్న నిబద్ధతను ఆమె ప్రశంసించారు. సమావేశంలో పాల్గొన్న విభాగాధిపతులు, అడ్మినిస్ట్రేషన్ ఫైనాన్స్ అధికారులు తమ విభాగాల్లో కొనసాగుతున్న కార్యకలాపాలపై వివరాలు తెలిపారు. టెక్నికల్ విద్యలో తెలంగాణ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఈఎస్‌సిఐ అందించే ఆధునిక శిక్షణా అవకాశాలను విస్తరించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని దేవసేన సూచించారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల నిర్మాణంలో ఈఎస్‌సిఐ పోషిస్తున్న ప్రముఖ పాత్రను ఆమె అభినందిస్తూ, ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమియా మధ్య మరింత సహకారం కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు.

## 'మెస్సీ' మ్యాచ్‌కు.. రూ.100 కోట్లు కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలి

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెస్సి ఫుట్ బాల్ మ్యాచ్‌కు రూ.100కోట్లు కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ లక్డీకాపూల్ సింగరేణి భవన్ వద్ద ఆయన ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సింగరేణి భవన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ధర్నాకు దిగిన మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్సి టీమ్‌తో రేవంత్ టీమ్ ఫుట్‌బాల్ ఆడటం వల్ల రాష్ట్రానికి వచ్చే ప్రయోజనం ఏమిటో సిఎం చెప్పాలన్నారు. ప్రజాధనం, సింగరేణి డబ్బును ఫుట్ బాల్ మ్యాచ్‌కు సిఎం రేవంత్ కేటాయించారని ఆరోపించారు. ఐదు నిమిషాల ఆటకోసం రూ.100 కోట్లు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ ఆర్థిక నేరమేనని ఆయన ఆరోపించారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడటానికి ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోంది, ఏ శాఖల నుంచి ఖర్చు చేస్తోంది, ఎందుకు ఖర్చు చేస్తోందో సిఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈ విషయంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రూ.కోటి 89లక్షల ఎగవేతకు బెదిరింపులు

న్యాయం చేయాలని బాధితుడి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఏడాదిగా ముప్పై లారీల మొక్కజొన్న లోడ్ తీసుకొని రూ.కోటి 89 లక్షల ఇవ్వాల్సిందిపోయి సెటిల్‌మెంట్ పేరిట ఓ ముగ్గురు సోదరులు బెదిరింపులకు దిగుతున్నారని, తనకు న్యాయం చేయాలని బాధితుడు రామకృష్ణ రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో ఆయన మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్ పెరేసంద్రంలో తాను మొక్క జొన్న వ్యాపారం చేస్తానన్నారు. రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసి హైదరాబాద్ ఆరాంఘర్‌కు చెందిన ముగ్గురు సోదరులు అక్బర్, నాసిర్, అహ్మద్‌కు చెందిన రెండు కంపెనీలకు విక్రయిస్తానని తెలిపారు. తొమ్మిది లారీల మొక్కజొన్న లోడ్‌ను తాను పంపగా, సెటిల్‌మెంట్ పేరిటతనను ఆరాంఘర్‌లోని వారికి ఇంటికి పిలిపించి రావాల్సిన డబ్బు ఇవ్వకుండా, బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన వేడుకొన్నారు.

## 13న రెండో విడత శిక్షణ తరగతులు

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బందిని నియమించెందుకుగాను రెండో విడతలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో పూర్తిచేశారు. శుక్రవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండో విడతలో మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.జిల్లాలో నిర్వహించే రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను,ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి 13 న వారికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని,ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డిపిఒ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## రెవెన్యూ మంత్రిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు సాయిబాబా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పాలన అంటేనే భూదందా, అధికార దుర్వినియోగం అన్నట్టుగా మారిపోయిందని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా విమర్శించారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి కుమారుడికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అరాచకాలు చేస్తుందని, మంత్రిని తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని అత్యంత విలువైన వట్టినాగులపల్లి గ్రామ సర్వే నెంబర్ 245లోని 20.14 ఎకరాల భూమిని డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కోసం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ తీవ్రంగా ఒత్తిడి చేసిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి స్వయంగా రంగంలోకి దిగి, భూమి యజమాని సతీశ్‌షాను పిలిపించుకొని అగ్రిమెంట్ చేయాలని ఒత్తిడి చేశారని సాయిబాబా ఆరోపించారు. మంత్రి బెదిరించినా యజమాని వినకపోవడంతో, మంత్రి కుమారుడు స్వయంగా యజమాని సతీశ్‌షా ఇంటికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. బాధితులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నా, మంత్రి కుమారుడు దౌర్జన్యకాండకు పాల్పడటం చట్టాన్ని పూర్తిగా అపహాస్యం చేయడమేనన్నారు. ఈ సంఘటనతో పేద, మధ్య తరగతి ప్రజలకు రక్షణ కరువైన విషయం బహిర్గతమైందన్నారు. ఈ ఘటనపై నిజాయితీగా, నిర్భయంగా నిలదీసిన పోలీస్ అధికారిని ఆగమేఘాల మీద బదిలీ చేసి, పోస్టింగ్ ఇవ్వకుండా మానసిక ఆవేదనకు గురిచేస్తున్నారని సాయిబాబా విమర్శించారు. ఇది పోలీసుల మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసే చర్య అని, వెంటనే ఆ అధికారికి పోస్టింగ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీనాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజుగౌడ్, ఎస్.ప్రకాష్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## 'ఆయుర్వేద సంవాద్'తో ప్రజల వద్దకు ఆయుర్వేదం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆధునిక జీవనశైలికి, యువతకు ఆయుర్వేదాన్ని మరింత చేరువ చేసేందుకు 'ఆయుర్వేద సంవాద్ ' అనే సరికొత్త కార్యక్రమంతో ముందుకెళ్తున్నట్టు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుర్వేద ఆరోగ్య సంరక్షణ సంస్థ డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ ఎథికల్స్ డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ డాబర్ తన మొత్తం ఆయుర్వేద ఔషధాలు, ఎథికల్ ఉత్పత్తులను కొత్త, ఆధునిక ప్యాకేజింగ్‌లో విడుదల చేసిందన్నారు. ఆయుర్వేదంపై ఆచరణాత్మక అన్వయాలు, ఆధునిక జీవనశైలిలో ఎదుర్కొవడంలో దానిపాత్రపై ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, పరిశోధకులతో ఒకే వేదికపై పరస్పర చర్చలు జరుపుతామన్నారు. దేశవ్యాప్తంగా ఉచిత ఆరోగ్య పరీక్షలు, శిబిరాలు విస్తరిస్తూ సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తేవడమే డాబర్ లక్ష్యమన్నారు. సమావేశంలో ఆయుర్వేద సెల్స్ హెడ్ శివకుమార్, డాబర్ సీనియర్ మేనేజర్ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే గాంధీ

**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ ప్రాంతంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడంలో కీలకపాత్ర పోషించిన ట్రాఫిక్ సిఐ ప్రశాంత్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. మియాపూర్ ఆల్విన్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ట్రాఫిక్ సిఐ ప్రశాంత్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ "శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మియాపూర్ చౌరస్తా నుండి ఆల్విన్ చౌరస్తా వరకు నూతన ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఆల్విన్ ఎక్స్ రోడ్ సమీపంలో భారీగా ట్రాఫిక్ ఏర్పడడంతో, కొండాపూర్ వైపు నుండి వచ్చే వాహనాలను తాత్కాలికంగా మదీనగూడ యూటర్న్ వద్దకు మళ్లించారు. సుమారు 300 మీటర్ల దూరం వరకు మార్గమార్పు చేసి, మియాపూర్ వైపుకు ఉండే రైట్ టర్న్‌ను మూసివేశారు. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఫ్రీలెఫ్ట్ టర్న్‌ను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ అధికారులు డిఇ శ్రీదేవి, ఎఇ ప్రతాప్ పాల్గొన్నారు.

## పల్లెలను ప్రగతి సీమలుగా మార్చడమే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అభివృద్ధికి అమడదూరంగాలో ఉన్న పల్లె సీమలను ప్రగతి సీమలుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్, వార్డు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పంచాయతీల్లో గత రెండున్నర ఏళ్ళుగా ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి పూర్తిగా వెనకబడి పోయిందని, నేడు ప్రజా ప్రతినిధులు రావడంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కే అస్కారం ఉందన్నారు. గ్రామాల్లో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సమానంగా భావిస్తూ ముందుకు సాగితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటమి చెందామని నిరాశ పడవద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి పార్టీ కార్యకర్తలను ఉత్సాహంగా ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో విజయం సాధించిన గ్రామ పంచాయతీల సర్పంచులను సన్మానించారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** జాపాల గ్రామ సిపిఎం సర్పంచ్ అభ్యర్థి నోముల పరమేష్‌కు సంపూర్ణ మద్దతూ ప్రకటిస్తున్నామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, జిల్లా నాయకుల అల్లి మద్దిన్ తెలిపారు. శుక్రవారం సిపిఐ నాయకులు అనంతరెడ్డి, గ్రామ కార్యదర్శి బోలగం బాలయ్యలతో కలిసి జాపాల గ్రామ చౌరస్తాలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులతో గ్రామాలు అభివృద్ధి సాధ్యమన్నారు. జాపాల గ్రామ అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక పోరాటాలు చేశామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక ఆందోళన చేసి గ్రామ ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించడానికి గత 50 సంవత్సరాలుగా ఎన్నో రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పేదలకు భూమి పంచడంతోపాటు వారి రోజువారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయడం జరిగిందన్నారు. గ్రామంలో అభివృద్ధి కోసం సిపిఎం సర్పంచ్ అభ్యర్థి నోముల పరమేష్‌ని గెలిపించడంతోపాటు వార్డు సభ్యులను గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిత్తశుద్ధితో నిజాయితీగా పనిచేసే వారికి ప్రజలు పట్టం కట్టాలని అవకాశవాద రాజకీయాలకు పాల్పడే వారికి ఓటు ద్వారా తగిన సమాధానం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువత సన్మార్గంలో నడవాలన్న గ్రామ అభివృద్ధితో పాటు, గ్రామంలో శాంతి సామరస్యాలు నిలబడాలన్న కమ్యూనిస్టులకు ఓటు వేయడం అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాపిరెడ్డి, అనంతరెడ్డి, ఆవుల మల్లేష్, లెనిన్, యాట జగన్, యాట పాండు, నర్సిరెడ్డి, లక్ష్మీనారాయణ, యాట ముత్తయ్య పాల్గొన్నారు.

## మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

మేడ్చల్ ట్రాఫిక్ జోన్ డిసిపి రంజన్ రతన్ కుమార్

**ప్రజాపక్షం/మియాపూర్:** వార్షిక తనిఖీలో భాగంగా మేడ్చల్ ట్రాఫిక్ జోన్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు.పోలీసులతో పరేడ్ నిర్వహించి వారి విధులు, తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులు క్షుణంగా పరిశీలించారు. స్టేషన్ మొత్తం పనితీరు, రికార్డుల నిర్వహణ, క్రమశిక్షణ, పనితీరుపై డిసిపి రంజన్ రతన్ కుమార్ సంతృప్తిని వ్యక్తం చేశారు.



# రీల్

## 'నభా నటేశ్' పోస్టర్ విడుదల




నిఖిల్ హీరోగా యాక్షన్ సినిమా 'స్వయంభు'. ఈ సినిమాలో నభా నటేశ్ హీరోయిన్గా నటిస్తోంది. సినిమాలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్న నభా నటేష్కు సంబంధించిన పోస్టర్ను విడుదల చేశారు. సుందర అనే క్యారెక్టర్ నభా నటేష్ చేస్తున్నారు. నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. టాగూర్ మధు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బాహుబలికి కెమెరా మెన్గా పని చేసిన సెంథిల్ కుమార్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్గా పని చేస్తున్నారు.

## నేడు 'పవన్' పాట రిలీజ్




పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ డోస్ పెంచారు. ఈనెల 13న రాజమండ్రి లో పాటను రిలీజ్ చేయనున్నారు. ఈ ఈవెంట్ కు పవన్ కళ్యాణ్ హాజరయ్యే అవకాశం ఉంది. దేఖలేంగే సాలా అనే పాటను రిలీజ్ చేస్తారు రాజమండ్రిలోని ఆదిత్యా యూనివర్సిటీలో ఈ ఈవెంట్ జరగనుంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. భాస్కర్ పట్ల రాసిన ఈ పాటను విశాల్ దద్లాని పాడారు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల హీరోయిన్గా నటిస్తోంది. రాశీ ఖన్నా మరో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది

## ఈ సినిమా ప్రేక్షకుల్ని నవ్విస్తుంది



ప్రొడ్యూసర్ జయకాంత్, అమర్ బురా

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా.సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు రాబోతోంది. ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు ప్రొడ్యూసర్స్ జయకాంత్ (బాబీ), అమర్ బురా. ప్రొడ్యూసర్ జయకాంత్ (బాబీ) మాట్లాడుతూ.. డైరెక్టర్ మురళీ మనోహర్ మా ఫ్రెండ్. ఆయన 'గుర్రం పాపిరెడ్డి' స్టోరీ మాకు నెరేట్ చేశాడు. కథ చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. ప్రొడక్షన్ స్టార్ట్ చేసేందుకు ఇలాంటి కొత్త తరహా కథ కరెక్ట్ అనుకుని మూవీ స్టార్ట్ చేశాం. కొత్త ప్రొడ్యూసర్స్ అంటే ఏదైనా లవ్ స్టోరీతో, యూత్ ఫుల్ కంటెంట్ తో చేస్తుంటారు. కానీ రొటీన్ ప్రాజెక్ట్ చేయొద్దనే డార్క్ కామెడీ జానర్లో 'గుర్రం పాపిరెడ్డి' సినిమాను నిర్మించాం. ఫరియా అబ్దుల్లాకు మంచి కామెడీ టైమింగ్ ఉంది. తన రోల్ చేయడమే కాదు ఒక సాంగ్ రాసి పాడి కొరియోగ్రాఫ్ చేసింది. ఆ పాట వైరల్గా మారుతోంది. బ్రహ్మానందం, యోగి బాబు కీ రోల్స్ చేశారు. బ్రహ్మానందం డబ్బింగ్ చెబుతున్న టైమ్లో సినిమాలో పెద్ద క్యారెక్టర్ చేయించారు అన్నారు. ఆయన ఇటీవల కాలంలో ఇంత లెంగ్తీ రోల్ చేయలేదు. స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఆయన క్యారెక్టర్ ఉంటుంది. అలాగే యోగి బాబు కోసం రెండు నెలలు వెయిట్ చేశాం. రాజ్ కుమార్ కాసిరెడ్డి, వంశీధర్ కోసిగి మధ్య హిలేరియస్ కామెడీ వర్కవుట్ అయ్యింది. వాళ్లిద్దరికీ ఈ సినిమా ఫేమ్ తీసుకొస్తుంది. ప్రొడ్యూసర్ అమర్ బురా మాట్లాడుతూ తెలివిలేని వాళ్లు తెలివైన వాడిని ఎలా ఎదుర్కొన్నారు అనేది మా మూవీ పాయింట్. ఫన్, కామెడీతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. సందేశాలు వినేందుకు ప్రేక్షకులు థియేటర్స్కు రారు. వాళ్లను ఆ కాసేపు ఎంటర్ టైన్ చేయాలి. మా మూవీ కంటెంట్ మీద పూర్తి నమ్మకంతో ఉన్నాం. మ్యాడ్, మ్యాడ్–2 చూస్తున్నప్పుడు ఆ పాత్రలను చూస్తేనే ఎలా నవ్వుకున్నామో మా సినిమాలోనూ ఆర్టిస్టులను చూడగానే ఫన్గా ఫీలవుతారు. మా మూవీ కంటెంట్ ప్రతి ఒక్కరికీ నచ్చినా స్టార్ హీరో లేడు అనేది బిజినెస్ పరంగా ఇబ్బంది అయ్యింది. కంటెంట్ను నమ్మి మా గుర్రం పాపిరెడ్డి సినిమాను 140 స్క్రీన్స్ లో రిలీజ్ చేస్తున్నాం. ముందే పెద్ద సంఖ్యలో థియేటర్స్ వేసి సినిమాకు జనం లేరు అనిపించుకోవడం కంటే రెస్పాన్స్ బాగుంటే పెంచుకోవచ్చు అని అనుకున్నాం. టికెట్ ప్రైస్ కూడా అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నాం.


## ఫరియా అబ్దుల్లా కొరియోగ్రఫీ చేసింది

### డైరెక్టర్ మురళీ మనోహర్



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు డైరెక్టర్ మురళీ మనోహర్. మా నేటివ్ ప్లేస్ హైదరాబాద్. చిన్నప్పుడు శివ, నాయకుడు లాంటి సినిమాలు చూసిన ప్రభావంతో సినిమా ఇండస్ట్రీ వైపు ఆకర్షితుడిని అయ్యాను. ఇక్కడ ఎంబీఏ పూర్తిచేశాక లండన్ వెళ్లాను. అక్కడి ఫిలిం ఇనిస్టిట్యూట్లో కోర్స్ చేసి ఇండియాకు వచ్చి సంపత్ నందితో వర్క్ చేయడం ప్రారంభించాను. ఆయన డైరెక్ట్ చేసిన చాలా మూవీస్కు నేను వర్క్ చేశాను. 2010 నుంచి టాలీవుడ్లో ఉన్నాను. సంపత్ నంది సపోర్ట్తో సింబా మూవీ చేశాను. ఆ సినిమా నా ఫస్ట్ మూవీ. అయితే అది రిలీజ్ కావడంలో ఆలస్యమైంది. మా మూవీలో హీరోయిన్ క్యారెక్టర్కు ఫరియా అబ్దుల్లా బాగుంటుంది అనిపించి తీసుకున్నాం. ఆమె చాలా బాగా పర్ ఫార్మ్ చేసింది. ఈ చిత్రంలో ఒక పాట కూడా తనే రాసి పాడి కొరియోగ్రఫ్ చేసింది అన్నారు.


## ప్రభాస్ ఫొటోలు వైరల్





హీరో ప్రభాస్ తాజా ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ప్రభాస్ నటించిన రాజా సాబ్ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. రాజా సాబ్ సినిమాకు మారుతీ దర్శకత్వం వహించారు. తమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది.

## 'పెద్ది' కొత్త షెడ్యూల్...



పెద్ది మార్చి 27, 2026న గ్రాండ్గా పాన్- ఇండియా థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉంది.

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మోస్ట్ ఎవైటెడ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'పెద్ది'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రం ఇప్పటికే ఫస్ట్లుక్ పోస్టర్లు, ఫస్ట్ షాట్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి'తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. రామ్ చరణ్ ట్రేడ్మార్క్ మెగా గ్రేస్, ఉర్రూతలూగించే స్క్రీన్ ప్రజెన్స్తో ఈ పాట సోషల్ మీడియాలో సంచలనం సృష్టించి, ప్రపంచవ్యాప్తంగా వైరల్గా మారింది. 'పెద్ది' టీం నేటి నుండి హైదరాబాద్లో కొత్త షూటింగ్ షెడ్యూల్ను ప్రారంచనుంది. ఈ షెడ్యూల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు, వాటిలో కొన్నింటిని ఢిల్లీలో చిత్రీకరిస్తారు. జనవరి నెలాఖరు వరకు చిత్రీకరణ కొనసాగుతుంది, అప్పటికి సినిమా మొత్తం టాకీ పార్ట్ పూర్తవుతుందని భావిస్తున్నారు. ప్లానింగ్ ప్రకారం, నిర్మాణ పనులన్నీ సజావుగా సాగుతున్నాయి, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్కుమార్ ఒక కీలక పాత్ర పోషించడం ఈ చిత్రానికి మరింత బలాన్ని చేకూరుస్తుంది, అలాగే జగపతి బాబు, దివ్యేందు శర్మ ముఖ్యమైన పాత్రలలో నటిస్తున్నారు.

## 'అఖండ–2' సక్సెస్ మీట్



'అఖండ–2'కు బ్రహ్మాండమైన రెస్పాన్స్ వస్తోంది. బుకింగ్స్ చాలా స్ట్రాంగ్గా వున్నాయి. సినిమాకి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోందని నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట అన్నారు. ఈ సినిమా సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. అఖండ–2 ది తాండవం సక్సెస్ సెలబ్రేషన్స్లో నిర్మాత గోపి ఆచంట మాట్లాడుతూ అందరికీ నమస్కారం. కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా ఒక వారం రోజులు వాయిదా పడింది. ఈ సందర్భంగా మా బాలయ్య బాబుకి, డైరెక్టర్ బోయపాటి శ్రీనుకి, బాలయ్య బాబు ఫ్యాన్స్కి మా ప్రొడక్షన్ తరపున సారీ చెప్తున్నాం. ఈ సమస్యని పరిష్కరించడానికి మ్యాంగో మీడియా రామ్, నిర్మాత దిల్ రాజు చాలా సపోర్ట్ చేశారు. వారికి ధన్యవాదాలు. ఒక వారం రోజులు ఆలస్యం అయినప్పటికీ శుక్రవారం (డిసెంబర్ 12న) ఈ సినిమా ప్రీమియర్స్తో రిలీజ్ అయింది. ప్రీమియర్స్కి బ్రహ్మాండమైన రెస్పాన్స్ వచ్చింది. మేము భ్రమరాంబలో చూసాం. ఫ్యాన్స్ అసలు సీట్లో కూర్చోవడం లేదు. నిలుచుని చప్పట్లు విజిల్స్ తో అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. ఈరోజు మార్నింగ్ మ్యాట్నీ షోలు కూడా అద్భుతంగా ఉన్నాయి. అన్ని ఏరియాల నుంచి మంచి కలెక్షన్స్, రిపోర్ట్స్ వస్తున్నాయి. నార్త్లో జి సినిమాస్ ద్వారా దాదాపు 800 స్క్రీన్స్లో రిలీజ్ చేశాం. అక్కడ ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారని రిపోర్ట్స్ వస్తున్నాయి. సినిమాకి వర్డ్ ఆఫ్ మౌత్ బ్రహ్మాండంగా ఉంది. సూపర్ ట్రెండ్లో టికెట్స్ బుక్ అవుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో సక్సెస్ సెలబ్రేషన్స్ చేయాలని భావిస్తున్నాము. నిర్మాత రామ్ ఆచంట మాట్లాడుతూ.. ప్రీమియర్స్ రెస్పాన్స్ అదిరిపోయింది. రాత్రి జరిగిన ప్రీమియర్స్కి నైజాం సీడెడ్ ఆంధ్ర కలిపి 10 కోట్లు గ్రాస్ చేసింది. కర్ణాటకలో కూడా దాదాపు కోటి రూపాయలు కలెక్ట్ చేసింది. ప్రీమియర్స్లో కోటి రూపాయలు కలెక్ట్ చేసిన నాన్ కన్నడ సినిమాల్లో ఇది ఐదో సినిమా. బుకింగ్స్ చాలా స్ట్రాంగ్గా ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్స్ నుంచి చాలా అద్భుతమైన రిపోర్ట్స్ వస్తున్నాయి. శుక్రవారం ఈవినింగ్ నుంచి ఫ్యామిలీస్ కూడా యాడ్ అవుతాయి. ఈ వీకెండ్కి అదిరిపోయే ఫిగర్స్ చూస్తామని నమ్మకం ఉంది. రిలీజ్ తర్వాత అందరం చాలా హ్యాపీగా ఉన్నాం. ఓవర్సీస్ రెస్పాన్స్ కూడా అద్భుతంగా ఉంది. ఈ వీకెండ్లో కూడా అది కొనసాగుతుంది. బుకింగ్స్ చాలా స్ట్రాంగ్గా ఉన్నాయి. అన్ని ఫాస్ట్గా ఫిల్లింగ్ అవుతున్నాయి. శని, ఆదివారాల్లో ఇంకా సూపర్గా ఉంటాయి. గ్రౌండ్ రిపోర్ట్ చాలా ఎక్సలెంట్గా ఉంది. డిస్ట్రిబ్యూటర్స్ అందరు కూడా ఫుల్గా ఫుల్ హ్యాపీగా ఉన్నారు. బజ్ బ్రహ్మాండంగా ఉంది. ముఖ్యంగా బాలయ్య బాబు ఫ్యాన్స్ చాలా హ్యాపీగా ఉన్నారు. అద్భుతమైన సినిమా తీశారని ప్రశంసిస్తున్నారు..

## ఉత్సాహంగా సాగుతున్న ఆర్చరీ పోటీలు



ప్రజాపక్షం/హైదరాబాద్: బేగంపేట్లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం రెండో రోజు 32వ సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ (ఎన్టిపిసి) లు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. సీనియర్ ఇండియన్ రౌండ్ 21వ సీనియర్ కంపౌండ్ 45వ సీనియర్ రీకర్వ్ (పురుషులుమహిళలు) నేషనల్ ఆర్చరీ ఛాంపియన్షిప్ విజయవంతంగా ముగిసింది. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. పురుషుల టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్కు చెందిన సోలగం సాంబశివ, గుదురు వెంకట లోకేష్, చిట్టాపల్లి మోహిత్ సాయిలు మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్కు చెందిన సోడే దేశాయిల్, శివమ్ వైద్యాన్, శుభమ్లు నిలిచారు. ఇక మూడో స్థానంలో హర్యానాకు చెందిన మనేష్, గౌతమ్ పంవార్, సుమిత్, వినీత్ కుమార్, పవన్లు నిలిచారు. ఇక మహిళల టీమ్ విభాగం ఛత్తీస్గఢ్ మొదటి స్థానం గెలవగా రెండో స్థానంలో జార్ఖండ్, మూడో స్థానంలో అస్సాం దక్కించుకుంది. శుక్రవారం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి అనిల్ కామినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఆర్చరీ సంఘం అధ్యక్షులు టి. రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అశ్విన్ రావు, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం–విష్ణుపురం మధ్య రైల్వే భద్రత భేష్



జిఎం సంజయ్కుమార్ శ్రీవాస్తవ

ప్రజాపక్షం/హైదరాబాద్ : భద్రాచలంవిష్ణుపురం రైల్వే సెక్షన్ మధ్య భద్రతతో పాటు భద్రాచలం స్టేషన్ పునరాభివృద్ధి పనులు భేష్గా నిలిచిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం భద్రాచలం ,విష్ణుపురం రైలు మార్గం సహా పలు ప్రాంతాల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్లో సైతం తనిఖీని నిర్వహించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.25.41కోట్ల వ్యయంతో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్లాట్ఫామ్ ఉపరితలాల మెరుగుదల, అదనపు కవర్ల ఏర్పాటు, లిఫ్ట్లు, కొత్త వెయిటింగ్ హాల్, ముఖభాగం భవనం అభివృద్ధి, సర్క్యులేటింగ్ ఏరియా అప్గ్రేడ్ వంటి పనులపై అధికారులు జిఎంకు వివరాలు అందించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.అదే స్టేషన్లోని క్రూ లాబీని జీఎం పరిశీలించారు. లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్ల కోసం ఉన్న సౌకర్యాలను పరిశీలిస్తూ, వారి రోజువారీ సవాళ్లను తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలో భాగంగా స్టేషన్లో ఉన్న 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్ను కూడా శ్రీవాస్తవ సందర్శించారు. భద్రాచలం రోడ్ స్టేషన్లో పలువురు ప్రజా ప్రతినిధులు జీఎంని కలసి తమ విజ్ఞప్తులను సమర్పించారు. తరువాత భద్రాచలం రోడ్ విష్ణుపురం సెక్షన్లో రియర్ విండో ఇన్స్పెక్షన్ చేపట్టి, ట్రాక్లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా నిర్వహణను జిఎం పరీక్షించారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

## భూసేకరణ తుది తీర్పుకు లోబడి ఉండాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా రావిర్యాల వద్ద ఔటర్ రింగ్ రోడ్ ఇంటర్ చేంజ్ నుంచి ఆమన్గల్ రీజినల్ రింగ్ రోడ్ వరకు గ్రీన్ఫీల్డ్ రేడియల్ రోడ్ నిర్మాణం కోసం సేకరించే భూసేకరణ తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉండాలని హైకోర్టు షరతు విధించింది. పిటిషనర్లను తమ భూముల నుంచి తరలించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషనర్ల భూములకు సంబంధించి గతంలో జారీ చేసిన స్టేటస్కు ఉత్తర్వులను శుక్రవారం మరోసారి పొడిగించింది. భూసేకరణకు అధికారులు ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్ను రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారం బండ్లగూడకు చెందిన నీరటి రవీందర్ ఇతరులు సవాల్ చేసిన పిటిషన్ను జస్టిస్ శ్రవణ్కుమార్ శుక్రవారం విచారించారు. పిటిషనర్కు నోటీసు కూడా ఇవ్వలేదని, భూసేకరణ నిలిపివేయాలని పిటిషనర్ న్యాయవాది వాదించారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, కొందరు పిటిషనర్లు పరిహారం తీసుకున్నారని, భూసేకరణకు అవరోధం లేకుండా చేయాలని కోరారు. వాదనలపై న్యాయమూర్తి.. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు పిటిషనర్లను తొలగించరాదని ఆదేశించారు. విచారణ ఈ నెల 29కి వాయిదా వేశారు.

## అఖండ–2 నిర్మాతకు ఊరట

### టిక్కెట్ల ధరల పెంపునకు బెంచ్ అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ–2 టికెట్ల ధరలు పెంపు జీవో అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచ్ స్టే విధించింది. టిక్కెట్ ధరల పెంపునకు వీలుగా ప్రభుత్వం ఇచ్చిన మోమోను నిలిపివేస్తూ సింగిల్ జడ్జి గురువారం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సిన్మా నిర్మాత అత్యవసర అప్పీల్ పిటిషన్ వేశారు. ఈ అప్పీల్పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్కుమార్ డివిజన్ బెంచ్ విచారించి స్టే విధించింది. పెరిగిన టిక్కెట్ ధర ప్రకారం కావాల్సిన వాళ్లు సిన్మా చూస్తారని, అవసరం లేని వాళ్లు సిన్మా చూడరని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు వేసిన ముగ్గురి వ్యక్తుల కోసం నిర్మాత, డిస్టిబ్యూటర్లు ఇబ్బందిపడటం సరికాదంది. ఈ నెల 15 వరకు సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా, టిక్కెట్ ధరలపై జారీ చేసిన మెమో అమలును నిలిపివేసినప్పటికీ బుక్ మై షో పెంచిన ధరల ప్రకారమే టిక్కెట్లను విక్రయించిదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ జస్టిస్ శ్రవణ్కుమార్ విచారించారు. కోర్టు ధిక్కరణ పిటిషన్లో నోటీసులు జారీ చేశారు.

## అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)



పంచాయితీల పరిధిలో కూనంనేని విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ, గ్రామ సెంటర్లలో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ మాజీ కార్మికులు, పేదలు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు నివశిస్తున్న పాత క్వార్టర్లు, సింగరేణి స్థలాల నుంచి వెళ్లగొట్టే సంగిరేణి చర్యలకు స్వస్తి చెప్పి స్వేచ్ఛగా నివశించే వెసులుబాటు కల్పించామని అన్నారు. సింగరేణి సేఫ్ నిధులతో ప్రభావిత గ్రామాల అభివృద్ధి, కార్మిక వాడల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి జరుగుతుందన్నారు. కార్మికులు, పేదలు, మాజీ కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పారు. అనునిత్యం ప్రజలను వెన్నంటి ఉండి వారి కష్టాలు, సమస్యలపై స్పందించేది కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులే అని, ఈనెల 14న జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయలో డబ్బుల మూటలతో వచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, దుర్గరాశి వెంకటేశ్వర్లు,జి వీరస్వామి, వాసిరెడ్డి మురళీ, వట్టికొండ మల్లిఖార్జున రావు, పొలమూరి శ్రీనివాస్, యాంద్ర మహేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## జనజీవనంలోకి

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయారని ఆయన చెప్పారు. ఒక ఎకె47 రైఫిల్, రెండు సెల్ఫ్లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్లు), ఒక స్టెన్గన్, ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్ (బిజిఎల్)లను కూడా అందజేశారు. ఈ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నందుకు మొత్తం రూ. 8 లక్షల రివార్డును ప్రకటించారని ఎస్పి తెలిపారు. లొంగిపోయిన కేడర్లలో, మావోయిస్టుల కంపెనీ ప్లాటూన్ కమాండర్ మిదియం భీమా (30) తలపై రూ.8 లక్షల రివార్డును ప్రకటించారు. అదే విధంగా గంగా కుంజం (22), లేకం రామ, తాటి సోని (32), శాంతి సోధి (21)ల తలలపై ఒక్కొక్కరి చొప్పున రూ.5 లక్షల బహుమతి ప్రకటించగా, మద్వి నవీన్ (20), మద్వి రుక్ని (24), ఓయం మంగ్లీ (22), పొడియం మంగి (20), మద్వి గంగి (19)లకు ఒక్కొక్కరి తలలపై రూ.1 లక్ష రివార్డు ఉన్నట్లు చవాన్ అన్నారు. ఇటీవలి కాలంలో జరిగిన లొంగుబాటు సంఖ్య ఈ ప్రాంతంలో విశ్వాసం, శాంతి, అభివృద్ధి ప్రక్రియ క్రమంగా ఊపందుకుంటున్నట్లు కనిపిస్తుందని పోలీసు అధికారి తెలిపారు. గత 11 నెలల్లో కనీసం 1,514 మంది మావోయిస్టులు బస్తర్ ప్రాంతంలో ఆయుధాలు విడిచిపెట్టారని ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) సుందర్రాజ్ పట్టిలింగం తెలిపారు. పొలిట్బ్యూరో సభ్యుడు దేవ్జీ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పప్పారావు, దేవా (బార్సే దేవా),ఇతరులతో సహా మిగిలిన మావోయిస్టులు హింసను త్యజించడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అన్నారు. పోలీసుల గణాంకాల ప్రకారం, గత రెండేళ్లలో ఛత్తీస్గఢ్లో దాదాపు 2,400 మంది నక్సలైట్లు లొంగిపోయారు.

## ఊపిరి అందడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

నాశనం అవుతోంది. ప్రజలకు క్యాన్సర్ సోకుతోంది. వృద్ధులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు' అని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యంపై పార్లమెంట్ వెలుపల కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన నగరాల్లో వాయు కాలుష్యం ప్రతి సంవత్సరం తీవ్రమవుతోందని అన్నారు. వాయు కాలుష్యం పెరగడాన్ని తాను పూర్తిగా అంగీకరిస్తున్నానని, అందరూ కూడా అంగీకరిస్తారని భావిస్తున్నాన్నారు. అందరం దీనిపై చర్చించి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వం కూడా చెప్పిందని, ఈ సమస్య చాలా కాలంగా కొనసాగుతోందని, పరిస్థితి ప్రతి సంవత్సరం మరింత దిగజారుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం సమస్యను పార్లమెంటులో కూడా చర్చించాలని, సమస్య నుంచి పడయపడేలా ఆలోచించాలన్నారు. ప్రభుత్వం మంచి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముందుకు తీసుకెళ్తే అది చాలా బాగుంటుందని సూచించారు.

### చర్చకు సిద్ధం : రిజుజు

కాగా, లోక్సభలో వాయు కాలుష్య సంక్షోభంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఢిల్లీ దట్టమైన పొగమంచుతో నిండిపోయి, గాలి నాణ్యత చాలా పేలవంగా మారిన వర్గంలోకి చేరిన నేపథ్యంలో రిజిజు ఈ వ్యాఖ్యలు వచ్చాయి. జీరో అవర్ సందర్భంగా లేవనెత్తిన డిమాండ్లకు ప్రతిస్పందిస్తూ ప్రభుత్వం మొదటి రోజు నుంచే తన వైఖరిని స్పష్టం చేసిందని రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షంతో సహా సభ్యుల సూచనలను చేర్చడం ద్వారా అన్ని ముఖ్యమైన విషయాలను చర్చించడానికి, పరిష్కారాల వైపు పనిచేయడానికి సిద్ధంగా ఉందని రిజిజు అన్నారు. ఈ అంశాన్ని బిఎసిలో కాంగ్రెస్ సభ్యులు కూడా లేవనెత్తారని రిజిజు గుర్తు చేశారు. వివిధ చట్టాలు, నియమాల ప్రకారం, తాము ఈ చర్చను ఎలా చేపట్టాలో చూడాలని తెలిపారు. సమయం కేటాయింపును పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలిస్తుందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com